అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 10-09-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 202 Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar 12 పేజీలు వెల : 6.50

కేసు పురోగతిపై నివేదికివ్వండి



17లోగా కోల్‌కతా అభయ హత్యాచారం వివరాలు సమర్పించాలి : సీబీఐకి సుప్రీం ఆదేశం

వివరాలు 11లో



వరద సహాయం తక్షణమే విడుదల చేయాలి

బాధిత ప్రజలకు నష్టపరిహారం చెల్లించాలి

కేంద్ర ప్రభుత్వానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం డిమాండ్

సాయుధ పోరాట పక్షోత్సవాలను జయప్రదం చేయండి

బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ వక్రీకరణలను తిప్పికొట్టండి

పార్టీ శ్రేణులు, ప్రజలకు పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వరద ప్రమాదం గతంలో ఎప్పుడూ లేనంత తీవ్రంగా వచ్చిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం తెలిపింది. వరద సహాయాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం సమావేశమైంది. అనంతరం ఒక ప్రకటన విడుదల చేసింది. వర్షం, భారీ వరదలతో ఖమ్మం మళ్లీ వణికిందని గుర్తు చేసింది. వరద నష్టం తీవ్రంగా ఉన్నదని తెలిపింది. ఇంత జరిగినా కేంద్ర ప్రభుత్వం నుంచి బాధ్యతాయుతమైన స్పందన కరువైందని విమర్శించింది. ఇద్దరు కేంద్రమంత్రులు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నా వరద నష్టం పట్ల బాధ్యతగా వ్యవహరించడం లేదని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం స్పందించి వరద సహాయం విడుదల చేయాలని డిమాండ్ చేసింది. సర్వం కోల్పోయిన ప్రజలకు నష్టపరిహారం చెల్లించాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వం వరద నష్టం రూ.ఐదు వేల కోట్లకుపైగా కావాలని ప్రాథమిక అంచనా వేసిందని తెలిపింది. లోతుగా పరిశీలించిన తర్వాత ఆస్తి, ప్రాణ నష్టంతోపాటు పంట నష్టం వంటి వాటి గురించి తెలుస్తుందనీ, అప్పుడు వరద నష్టం అంచనా పెరిగే అవకాశమున్నదని వివరించింది. రాష్ట్రంలో పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంటే కేంద్రం ఇప్పటి వరకు నష్టపరిహారం ప్రకటించలేదని విమర్శించింది. వరదలొచ్చిన తర్వాత ఎప్పుడో సహాయం గురించి ప్రకటిస్తే ఉపయోగం ఏం ఉంటుందని ప్రశ్నించారు. తక్షణం సహాయం అందితేనే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని సూచించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు అవసరమైన నిధులను కేంద్ర ...11లో

నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోండి

అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు ఆదేశం

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించింది. అప్పటిలోగా నిర్ణయం తీసుకోకపోతే సుమోటో కేసుగా విచారిస్తామని స్పష్టం చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు ఈ పిటిషన్లను దాఖలు చేశారు. పార్టీ మారిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానందగౌడ్ పిటిషన్ వేశారు. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. వాటన్నింటినీ కలిపి హైకోర్టు సోమవారం విచారించింది. సుదీర్ఘ వాదనలు కొనసాగాయి. ఈ విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలను స్పీకర్ పట్టించుకోవడం లేదంటూ పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించింది.

రాజ్యాంగస్ఫూర్తిని నిలబెట్టేలా తీర్పు : హరీశ్

వివరాలు10లో..

నేతన్నలకు రూ. 30 కోట్ల రుణమాఫీ

రూ. 280 కోట్ల బకాయిలు విడుదల

- చేతివృత్తులు, కులవృత్తులకు చేయూత
- చేనేత సహకార సంఘాలకు త్వరలో ఎన్నికలు
- సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ మహిళలకు కోటీ 30 లక్షల చీరలు
- ఐఐహెచ్‌టీ ఇనిస్టిట్యూట్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు: ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"నేతన్నలకు చెందిన రూ. 30 కోట్ల రుణాలను మాఫీ చేస్తున్నాం. వారి కండ్లల్లో ఆనందం చూడాలని రూ.290 కోట్ల బకాయిలు విడుదల చేశాం. గతంలో ఆర్భాటం, సినీ తారల తళుకు బెళుకులు తప్ప.. నేతన్న ఆత్మగౌరవంతో బతికే పరిస్థితి లేదు. బీఆర్‌ఎస్ సర్కార్ బతుకమ్మ చీరల బకాయిలను చెల్లించకుండా ఆలస్యం చేసింది. కానీ మేం వాటిని చెల్లించి రాజకీయాలకతీతంగా సిరిసిల్ల కార్మికులను ఆదుకున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. చేనేత రంగంలో ఆధునిక శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని సోమవారం హైదరాబాద్‌లోని లలిత కళాతోరణంలో వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 63 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఏడాదికి రెండు చొప్పున కోటి 30 లక్షల చీరలను బతుకమ్మ చీరల స్థానంలో ఆర్డర్ ఇవ్వనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. రైతన్న ఎంత ముఖ్యమో కాంగ్రెస్ ప్రభుత్వానికి నేతన్న కూడా అంతే ముఖ్యమని వ్యాఖ్యానించారు. "గత సర్కార్ పదేండ్ల కాలంలో ఈ సంస్థ ఏర్పాటుపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా తెలంగాణకు చెందిన విద్యార్థులు ఐఐహెచ్‌టీలో చేరాలంటే ఒడిశా, ఏపీకి వెళ్లాల్సిన పరిస్థితి. కాంగ్రెస్ సర్కార్ అధికారం చేపట్టిన వెంటనే దీనిపై దృష్టి సారించి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేశాం" అని సీఎం అన్నారు. ఐఐహెచ్‌టీలో ...11లో

గ్రీన్ ఫార్మాసిటీ పనులు వేగవంతం చేయండి

కాలుష్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోండి : సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు10లో..

కాళోజీ సేవలు మరవలేనివి : సీఎం రేవంత్‌రెడ్డి



ప్రజా కవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు సేవలు మరవలేనివని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కాళోజి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కాళోజి జయంతి సందర్భంగా తెలంగాణ భాషా సాహిత్యానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

ఉదారంగా నిధులిచ్చి ఆదుకోండి

కేంద్రంతో సంబంధం లేకుండా నేరుగా మాకే డబ్బులివ్వండి

- 16వ ఆర్థిక సంఘానికి స్థానిక సంస్థల ప్రతినిధుల మొర
- సూచనలు, సలహాలిచ్చిన వివిధ రాజకీయ పార్టీలు
- కేంద్ర పన్నుల వాటాలో 50 శాతానికి తగ్గకుండా రాష్ట్రాలకు ఇవ్వాలి : సీపీఐ (ఎం) విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్థికంగా అత్యంత సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ఉదారంగా నిధులిచ్చి ఆదుకోవాలని రాష్ట్రంలోని స్థానిక సంస్థల ప్రతినిధులు... 16వ ఆర్థిక సంఘాన్ని వేడుకున్నారు. రాష్ట్రాలతోపాటు స్థానిక సంస్థలకు ఇచ్చే నిధుల విషయంలో కేంద్రం అనేక కొర్రీలేస్తున్న నేపథ్యంలో దాంతో (కేంద్రం) సంబంధం లేకుండా నేరుగా తమకే నిధులివ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం 16వ ఆర్థిక సంఘం చైర్మెన్ డాక్టర్ అరవింద్ పనగారియా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం సోమవారం హైదరాబాద్‌కు విచ్చేసింది. ఈ సందర్భంగా బేగంపేటలోగల ప్రజా భవన్‌లో పలు రాజకీయ పార్టీలు, సంస్థలు, వ్యాపార, వాణిజ్య ప్రతినిధులతో ఆ బృందం విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించింది. పనగారియాతో పాటు ఆర్థిక సంఘం సభ్యులు అజయ్ నారాయణ్ ఝా, అన్నీ జార్జ్, డాక్టర్ మనోజ్ పాండా, సౌమ్యా కాంతిఘోష్, కార్యదర్శి రిత్విక్ పాండే కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ మున్సిపల్ ...2లో

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మెన్‌గా గాంధీ

అసెంబ్లీ కమిటీలకు చైర్మెన్ల నియామకం



ఎస్టిమేట్స్ కమిటీకి నలమాద పద్మావతి

ప్రజాపద్దుల సంఘానికి వీర్లపల్లి శంకరయ్య

అసెంబ్లీ కార్యదర్శి ఉత్తర్వులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

శాసనసభలోని పలు కమిటీలకు చైర్మెన్లు, సభ్యులను నియమిస్తూ అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ) చైర్మెన్‌గా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎస్టిమేట్స్ కమిటీ చైర్మెన్‌గా కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి, ప్రజా పద్దుల సంఘం చైర్మెన్‌గా షాద్‌నగర్ ఎమ్మెల్యే కె. శంకరయ్య నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం బులెటిన్ విడుదలైంది.

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ

చైర్మెన్: అరికెపూడి గాంధీ

సభ్యులుగా ఎమ్మెల్యేలు: వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాసరెడ్డి, రామారావు పవార్, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, కూనంనేని ...11లో

మౌనం వీడే సమయం ఆసన్నమైంది

మాధబి బచ్‌ను ప్రశ్నించనున్న పీఏసీ

ఆరోపణలపై నేటికీ పెదవి విప్పని సెబీ చీఫ్

వత్తాసు పలుకుతున్న మోడీ ప్రభుత్వం



వివరాలు3లో..

రాజకీయాల్లో గౌరవం, మానవత్వం ఏది?

నైపుణ్యం అపారం.. గుర్తింపే లేదు : రాహుల్ ఆవేదన

మోడీ అంటే ప్రజలకు భయం పోయిందని వ్యాఖ్య



టెక్సాస్: భారత రాజకీయాలలో ప్రేమ, గౌరవం, మానవత్వం కనుమరుగవు తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల అనధికారిక పర్యటన నిమిత్తం అమెరికా వచ్చిన రాహుల్ ఆదివారం డల్లాస్‌లో ఇండో-అమెరికన్ సంతతి వారితో మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్‌పై విమర్శలు సంధించారు. 'భారత్' అనేది ఒక ఆలోచన మాత్రమేనని ఆర్‌ఎస్‌ఎస్ చెబుతోంది. మాది వివిధ ఆలోచనల సమ్మేళనం అని మేం నమ్ము తున్నాం' అని అన్నారు. కులం, మతం, భాష, సంప్రదాయం, చరిత్రతో నిమిత్తం లేకుండా అమెరికాలో మాదిరిగా ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం కల్పించాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. ప్రధాని మోడీ భారత రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని దేశంలోని లక్షలాది మంది ప్రజలు అర్థం చేసుకున్నారని రాహుల్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మెజారిటీ సాధించలేకపోవడాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావిస్తూ 'మన సంప్రదాయం, భాషపై బీజేపీ దాడి చేస్తోందని ప్రజలు చెబుతున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన నిమిషాలలోనే దేశంలో ఏ ఒక్కరూ బీజేపీని, ప్రధానిని చూసి భయపడలేదు. ఇది ప్రజలు సాధించిన గొప్ప విజయం' అని అన్నారు. డల్లాస్‌లోని టెక్సాస్ యూనివర్సిటీ విద్యార్థులతో కూడా రాహుల్ ముచ్చటించారు. దేశంలో నిపుణులైన లక్షలాది ...11లో

తేలని బీమా ప్రీమియంల తగ్గింపు

జీఎస్టీ నిర్ణయం వాయిదా

- నవంబర్‌లో మళ్లీ భేటీ
- జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



ఢిల్లీ : జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వాయిదా పడింది. నవంబర్‌లో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై నిర్ణయం వెలువడనుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో భేటీ అయిన 54వ జీఎస్టీ మండలి.. ఈ అంశంపై మంత్రుల బందాన్ని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇదే భేటీలో క్యాన్సర్ ఔషధాలు, స్నాక్స్‌పై జీఎస్టీ తగ్గిస్తూ నిర్ణయం వెలువడింది. కౌన్సిల్ సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీని రద్దు చేయాలన్న డిమాండ్లపై జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలోనే నిర్ణయం వెలువడుతుందని అందరూ ఆశించారు. దీనిపై సుదీర్ఘంగా చర్చించిన మండలి.. మంత్రుల బందానికి ఆ బాధ్యతను అప్పగించింది. బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి నేతత్వంలో జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రుల బందానికే ఈ బాధ్యతను కట్టబెట్టింది. కొంతమంది కొత్త సభ్యులు ఈ బందంలో చేరతారని, అక్టోబర్ చివరి నాటికి నివేదిక సమర్పిస్తారని నిర్మలా సీతారామన్ తెలిపారు. దీనిపై నవంబర్‌లో జరిగే భేటీలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. క్యాన్సర్ ఔషధాలపై ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీ రేటును 5 శాతానికి తగ్గిస్తూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. స్నాక్స్‌పై 18 శాతం నుంచి 12 శాతానికి జీఎస్టీని తగ్గిస్తున్నట్లు మంత్రి తెలిపారు. 2026 మార్చి తర్వాత జీఎస్టీ పరిహార సెస్సు కొనసాగించాలా? వద్దా? అనే అంశంపైనా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ, ఆన్‌లైన్ గేమింగ్‌పై జీఎస్టీ అంశాలపైనా చర్చించినట్లు పేర్కొన్నారు.

జీఎస్టీ సెస్ పరిహారమివ్వాలి

రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క



11లో..

ఇజ్రాయిల్ దుశ్చర్యలను ఎండగట్టండి

గాజాలో దాడులను ఆపండి : దేశాలకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల చీఫ్ విజ్ఞప్తి



జెనీవా : దాదాపు ఏడాది కాలంగా గాజాలో సాగుతున్న దాడులకు అంతం పలకడమే ప్రస్తుతం ప్రాధాన్యత గల అంశమని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ సోమవారం వ్యాఖ్యానించారు. ఆక్రమిత పాలస్తీనా ప్రాంతాల్లో అంతర్జాతీయ చట్టాలను దారుణంగా ఉల్లంఘించి ఇజ్రాయిల్ వ్యవహరిస్తున్న తీరుపై సత్వరమే అన్ని దేశాలు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు గాజాలో దాదాపు 41వేల మంది పాలస్తీనియన్లు మరణించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో కూడా గత మూడు వారాల నుండి ఉధృతంగా దాడులు కొనసాగుతున్నాయి. ఈ మారణహోమానికి స్వస్తి చెప్పి, పూర్తి స్థాయి ప్రాంతీయ ఘర్షణగా ఇది పెచ్చరిల్లకుండా నివారించడమే ప్రస్తుతం మన ముందున్న ప్రాధాన్యత అని మానవహక్కుల హై కమిషనర్ వోల్కర్ టర్క్ స్పష్టం చేశారు. జెనీవాలో ఐదు వారాల పాటు సాగే మానవ హక్కుల మండలి సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆయన ప్రసంగించారు. భద్రతా మండలి నిర్ణయాలు, తీర్మానాలతో సహా అంతర్జాతీయ చట్టాలు, అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించడాన్ని దేశాలు ఎంత మాత్రమూ ఆమోదించరాదని అన్నారు. బ్రిటన్, జర్మనీ, అమెరికా వంటి పశ్చిమ దేశాల్లో శరణార్థులను, మైనారిటీలను బలి ...2లో

నేడు, రేపు వర్షాలు

పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ఆ జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలున్నాయి. వర్షాలు పడే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది.

చరిత్రకు మతం రంగు పులిమితే ఖబర్దార్

భూములు పంచింది, త్యాగాలు చేసింది కమ్యూనిస్టులే : ప్రజానాట్యమండలి శౌర్యయాత్రలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్



వివరాలు 3లో

నవతెలంగాణ
మంగళవారం 10 సెప్టెంబర్ 2024

ఇజ్రాయిల్ దుశ్చర్యలను ఎండగట్టండి

(మొదటిపేజీ తరువాయి)

పశువులుగా చేయడం ద్వారా రాజకీయనేతలు హింసను రెచ్చగొడుతున్నారని ఆయన విమర్శించారు. గాజాలో 22లక్షల మంది పాలస్తీనియన్లు అత్యవసర సహాయం కోసం ఎదురుచూస్తున్నారని ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి) పేర్కొంది. గాజాలో ఇజ్రాయిల్ మారణకాండను ప్రారంభించి 11మాసాలు పూర్తయింది. దీంతో అక్కడి ప్రజల పరిస్థితులు దుర్భరంగా మారాయి.

గాజాలో స్కూళ్ళకు దూరంగా ఆరున్నర లక్షలమంది విద్యార్థులు

సోమవారం నుండి గాజాలో అధికారికంగా కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది. అయినా ఇజ్రాయిల్ దాడులు, కాల్పుల విరమణ ఒప్పందం కనుచూపు మేరలో లేకపోవడంతో 6,30,000మందికి పైగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్ళే పరిస్థితులు లేవు. దీంతో గాజాలో ఇజ్రాయిల్ దాడులతో విద్యార్థులకు రెండో విద్యా సంవత్సరం కూడా అంతరాయం కలిగింది. దాదాపుగా 90శాతానికి పైగా స్కూళ్ళన్నీ మూతబడడమో, విధ్వంసం కావడమో జరిగింది. మిగిలిన స్కూళ్ళను పునరావాస కేంద్రాలుగా మార్చారు. పిల్లలను ఇలా పాఠశాలలకు దూరంగా వుంచడం వల్ల ఒక తరాన్ని మొత్తంగా కోల్పోయే ప్రమాదం పొంచి వుందని యుఎన్ఆర్‌డబ్ల్యుఎ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ జూలియట్ టామా వ్యాఖ్యానించారు. నేర్చుకున్నది మర్చిపోయే ప్రమాదముందని, పైగా బాల్య వివాహాలు, బాల కార్మికులు, సాయుధ గ్రూపుల్లోకి రిక్రూట్‌మెంట్‌లు వంటి సమస్యల్లోకి కూరుకుపోతారని, హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందానికి తాము కొత్తగా షరతులు విధించామంటూ అమెరికా మీడియాలో వస్తున్న వార్తలను హమాస్ అధికారులు తిరస్కరించారు. ఇజ్రాయిల్ పైకి రాకెట్లు ప్రయోగించిన నేపథ్యంలో ఉత్తర గాజా నుండి ప్రజలు తక్షణమే ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

పొన్నం సత్తయ్య గౌడ్ 3వ మెమోరియల్ అవార్డుకు పలువురి ఎంపిక

- ప్రముఖ సినీగేయ రచయిత చంద్రబోస్, బలగం ఫేం కొమురమ్మ, మొగిలయ్యకు అవార్డులు
- 13న రవీంద్ర భారతి వేదికగా ప్రదానం



నవతెలంగాణ-హైదరాబాద్

పొన్నం సత్తయ్య గౌడ్ మెమోరియల్ అవార్డుకు పలువురు ఎంపికయ్యారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ జ్ఞాపకార్థం వారి సోదరులు, కుటుంబ సభ్యులు ప్రతి సంవత్సరం రచయితలకు, కళాకారులకు అందించే పొన్నం సత్తయ్య గౌడ్ 3వ మెమోరియల్ అవార్డు -2024 సంవత్సరానికి గాను ప్రముఖ రచయిత కళాకారుల ఎంపికకు జ్యూరి కమిటీ సమావేశమైంది. ప్రతి సంవత్సరం పొన్నం సత్తయ్య గౌడ్ మెమోరియల్ అవార్డు ఇస్తున్న మాదిరిగానే ఈసారీ కమిటీ పలువురు రచయితలు, కళాకారుల పేర్లను పరిశీలించింది. ఫైనల్‌గా రచయితల విభాగంలో ప్రముఖ సినీగేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్, కళాకారుల విభాగంలో బలగం ఫేం కొమురమ్మ మొగిలయ్యలను అవార్డు గ్రహీతలుగా ఎంపిక చేశారు. ఎంపిక చేసిన పేర్లతో కూడిన పత్రాన్ని కమిటీ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అందజేశారు. అవార్డు గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.51 వేల నగదు, మెమోంటోతో సత్కరించనున్నట్టు కమిటీ కన్వీనర్ పొన్నం రవిచంద్ర తెలిపారు. ఇందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.

గతంలో పొన్నం సత్తయ్య మెమోరియల్ అవార్డులో ప్రథమ సంవత్సరంలో రచయిత విభాగంలో నాళేశ్వరం శంకర్, కళాకారుల విభాగంలో ఒగ్గు కథ ధర్మయ్యలు ,ద్వితీయ సంవత్సరం రచయిత విభాగంలో నెలిమాల భాస్కర్ ,కళాకారుల విభాగంలో ప్రముఖ గాయని విమలక్క ఈ అవార్డులను అందుకున్నారు.ఈనెల 13 న పొన్నం సత్తయ్య గౌడ్ 13వ వర్ధంతి సందర్భంగా రవీంద్ర భారతిలో సాయంత్రం 6 గంటలకు అవార్డు గ్రహీతలకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, విశిష్ట అతిధులుగా ఎక్సైజ్ అండ్ సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారు. కార్యక్రమంలో రచయితలు కళాకారులు ,మేధావులు పాల్గొననున్నారు. జ్యూరి కమిటీ కన్వీనర్ పొన్నం రవిచంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు సీనియర్ పాత్రికేయులు, మాజీ కేంద్ర సమాచార శాఖ కమిషనర్ మాడ భూషి శ్రీధర్, ప్రముఖ సీనియర్ జర్నలిస్టు దిలీప్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికష్ణ , రచయిత్రి ఐనంపూడి శ్రీ లక్ష్మీ పాల్గొన్నారు.

సీఎంకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీ కమిషన్ చైర్మెన్‌కు, సభ్యులకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అభినందనలు తెలిపారు. మంగళవారం బీసీ కమీషన్ కార్యాలయంలో పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. భువనగిరి నుంచి ఇద్దరు సభ్యులను నియమించడం పట్ల ఆయన సీఎం రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల.. భవితవ్యం ఎటువైపో..?

- గత అనుభవం పునరావృతమయ్యేనా..
- 'సుప్రీం'కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది : ఎమ్మెల్యే కడియం



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల భవితవ్యం ఎటువైపు దారి తీస్తుందనేది చర్చనీయాంశంగా మారింది. సోమవారం హైకోర్టు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై 4వారాల్లో చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఆదేశించిన నేపథ్యంలో రాజకీయాలు వేడెక్కాయి. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), దానం నాగేందర్ (ఖైరతాబాద్) భవితవ్యంపై వాడివేడి చర్చ జరుగుతున్నది. 'కడియం' స్పందిస్తూ డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేసుకునే అవకాశముందని, సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం కూడా ఉన్నందున చాలా సమయముందని వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే 2004లో టీఆర్ఎస్ నుంచి నాడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో గెలిచిన ఎమ్మెల్యేలు దుగ్యాల శ్రీనివాసరావు (చెన్నూరు), మందాడి సత్యనారాయణరెడ్డి (హన్మకొండ), కమ్మంపాటి లక్ష్మారెడ్డి (నర్సంపేట), బండారి శారారాణి (పరకాల) కాంగ్రెస్‌లో చేరారు. నాడు టీఆర్ఎస్ శాసనసభాపక్షం స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరగడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో 'కమ్మంపాటి'ని టీఆర్ఎస్ మినహాయించింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని నాడు హైకోర్టు ఆదేశించడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు డాక్టర్ దుగ్యాల శ్రీనివాసరావు, బండారి శారారాణి పదవులకు రాజీనామా చేశారు. వీరి రాజీనామాలను స్పీకర్ సురేష్‌రెడ్డి ఆమోదించారు. హన్మకొండ ఎమ్మెల్యే మందాడి సత్యనారాయణరెడ్డిపై స్పీకర్ అనర్హత వేటు వేశారు. మళ్లీ 18 ఏండ్లకు అదే పరిస్థితి మళ్లీ పునరావృతమవుతుందా.. అన్న చర్చ నడుస్తోంది.

ఉప ఎన్నికలు జరిగేనా..?

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన వారిపై అనర్హత వేటు పడితే ఉప ఎన్నికలు జరిగే అవకాశముంది. హైకోర్టు తీర్పును పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసే అవకాశం ఉంది. ఒకవేళ డివిజన్‌బెంచ్ సైతం సింగిల్ జడ్జీ ఇచ్చిన ఆదేశాలనే బలపరిస్తే.. ఎమ్మెల్యేలు 'సుప్రీం' తలుపు తట్టనున్నారు. ఒకవేళ ఇదే జరిగితే ఇప్పట్లో తేలే అవకాశం లేదు. ముందుగా ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారనేది రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. సభ్యులతో మాట్లాడిన తర్వాత తన నిర్ణయాన్ని స్పీకర్ హైకోర్టుకు తెలియజేసే అవకాశముంది. ఇదిలావుంటే బీఆర్ఎస్ నేతలు మాత్రం ఉప ఎన్నికలు తప్పవని హల్‌చల్ సృష్టిస్తుండటం గమనార్హం. ఈ విషయంపై మీడియా అడిగిన ప్రశ్నలకు 'కడియం' సూటిగా సమాధానమిచ్చారు. ఇది తుది తీర్పు కాదని తెలిపారు. పార్టీ ఫిరాయింపులపై ఇప్పటికే హైకోర్టు రెండు భిన్నమైన తీర్పులనిచ్చిందన్నారు.

డివిజన్ బెంచ్ లేదా 'సుప్రీం'కూ అప్పీల్‌కు వెళ్లొచ్చు : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

పార్టీ ఫిరాయింపులపై విస్తృత చర్చ జరగాలని, సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం దీనిపై తీర్పునిస్తే రాజకీయ వ్యవస్థను, ప్రజాస్వామ్య వ్యవస్థకు బాగుంటుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అభిప్రాయపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై 4 వారాల్లో చర్యలు తీసుకోవాలని సోమవారం హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో 'కడియం' తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పు పూర్తిపాఠం తెలియదని, మీడియా ద్వారానే తెలుసుకున్నానని, తీర్పు పూర్తి పాఠాన్ని అధ్యయనం చేశాక న్యాయవాదులు, పార్టీ పెద్దలతో మాట్లాడి కార్యచరణ ప్రకటిస్తానన్నారు. ఇది తుది తీర్పు కాదని, సింగిల్ జడ్జి తీర్పు మాత్రమేనని, తాము హైకోర్టు డివిజన్ బెంచ్‌కు లేదా సుప్రీంకోర్టుకు కూడా అప్పీల్ చేసుకునే అవకాశముందన్నారు. చాలా అంచెలున్నందున ఇప్పుడే తొందరపడి ఉప ఎన్నికలు వస్తాయని ఎవరన్నా అనుకుంటే వారిని చూసి జాలిపడాల్సిందేనన్నారు. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదన్నారు. 2014 నుంచి 2023 వరకు.. కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్ సీపీ, సీపీఐ శాసనసభాపక్షాలను విలీనం చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఉప ఎన్నికలు వస్తున్నాయని బీఆర్ఎస్ నేతలు సంతోషపడుతున్నారని, తన కూతురు కావ్యను ఎంపీగా గెలవకుండా ఓడించాలని వారు చాలా ప్రయత్నాలు చేసినా ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ఎప్పటికైనా బీఆర్ఎస్ నేతలు మారుతారని ఆశించానని, కానీ మారడం లేదన్నారు.

ఉదారంగా నిధులిచ్చి ఆదుకోండి

(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపాల్టీల చైర్మెన్‌లతో ముందుగా భేటీ అయిన ఈ బృందం, అనంతరం గ్రామ పంచాయతీల మాజీ సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీపీలతో సమావేశమైంది. రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మెన్ సిరిసిల్ల రాజయ్యతోపాటు ఆ సంఘం సభ్యులు కడూఆ పరగారియా బృందంలో సమాలోచనలు జరిపింది. వ్యాపార, వాణిజ్య సంస్థలైన అలీఫ్, ఫిక్కీ, సీఐఐ ప్రతినిధులు కూడా 16వ ఆర్థిక సంఘంతో సమావేశమయ్యారు. రాజకీయ పార్టీల తరఫున కాంగ్రెస్ నుంచి సిరిసిల్ల రాజయ్య, టి.రామ్మోహన్‌రెడ్డి, సీపీఐ (ఎం) నుంచి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, బీజేపీ నుంచి ఈటల రాజేందర్, కాసం వెంకటేశ్వర్లు, ప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద, ఎంఐఎం నుంచి ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఓవైసీ, సయ్యద్ అమీన్ జాఫ్రీ, బలాల, సామా భూపాల్ రెడ్డి, ఎన్ దుర్గాప్రసాద్ (టీడీపీ), జనత్ కుమార్, ఈశ్వర్ (బీఎస్పీ), డి.సుధాకర్ (ఆప్) తదితరులు హాజరయ్యారు.

జీఎస్టీ లోటును భర్తీ చేయాలి : సీపీఐ (ఎం)

పదహారో ఆర్థిక సంఘానికి సీపీఐ (ఎం) పలు సూచనలు చేసింది. కేంద్ర పన్నుల రాబడిలో రాష్ట్రాలకు తక్కువ శాతం కేటాయింపులు చేస్తున్నారరనీ, దీనివల్ల రాష్ట్రాలు ఎఫ్ఆర్‌బీఎమ్ పరిధి దాటి అప్పులు చేయాల్సి వస్తోందని పేర్కొంది. దీంతో అవి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని తెలిపింది. పదహారో ఆర్థిక సంఘం కేంద్ర పన్నుల వాటాలో రాష్ట్రాలకు 50 శాతం కంటే తగ్గకుండా నిధులివ్వాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణకు కేంద్ర పన్నుల రాబడిలో 3.5 శాతాన్ని కేటాయించాలని కోరింది. విద్యా సెస్, రోడ్ సెస్ అంటూ కేంద్రం రాష్ట్రాలపై అదనపు పన్నులు విధిస్తోంది.. వీటిని రద్దు చేయాలని సూచించింది. ఒకవేళ తప్పనిసరిగా విధించాలనుకుంటే అందులో విధిగా రాష్ట్రాలకు 50 శాతం వాటానివ్వాలంటూ కోరింది. కేంద్ర పన్నుల విధానంలో తారతమ్యాల కారణంగా ధనికులు, పేదల మధ్య అంతరం గత పదేండ్లలో భారీగా పెరిగిందని తెలిపింది. ప్రత్యక్ష పన్నుల వాటా పెరిగేలా ఆర్థిక సంఘం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. 'జీఎస్టీ విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రాలకు ఆదాయం గణనీయంగా తగ్గుతోంది. ఆలోటును భర్తీ చేస్తామన్న వాగ్దానాన్ని కేంద్రం నిలబెట్టుకోవటం లేదు. సమాంతర పంపకం ఆధారంగా ప్రస్తుతం రాష్ట్రాలకు 15 శాతాన్ని పంపిణీ చేస్తున్నారు. భూమి, అడవులు, పర్యావరణం, తలసరి ఆదాయం, భౌగోళిక పరిస్థితుల ఆధారంగా ఈ పంపిణీ జరుగుతోంది. ఇదే కొనసాగితే రాష్ట్రాల మధ్య తీవ్ర అసమానతలు పెరుగుతాయి. అందుకే దీన్ని 50 శాతానికి పెంచాలి. తలసరి ఆదాయం కంటే రాష్ట్రాల్లోని బీపీఎల్ కుటుంబాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడి ఈ పంపిణీ జరగాలి. రాష్ట్ర బడ్జెట్లలో ఆదాయం, వ్యయాల మధ్య వ్యత్యాసాన్ని సరి చేసేందుకు కేంద్రం తీసుకొచ్చిన పాలసీ విఫలమైంది. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం తెలంగాణ పట్ల వివక్షను చూపింది. స్థానిక సంస్థలకు ప్రస్తుతం కేంద్రం ఇస్తున్న కేటాయింపులు సరిపోవు. రాజ్యాంగంలో 73, 74 సవరణల ప్రకారం స్థానిక సంస్థలకు కేటాయింపులు పెంచాలి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రాష్ట్రాలకు తక్కువ నిధులు ఇస్తున్న కేంద్రం, ఎక్కువగా చూపిస్తోంది. రాజకీయ కోణంలో రాష్ట్రాలకు కేటాయింపులు ఉండకూడదు. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా కేంద్రం రాష్ట్రాలకు వెన్నుదన్నుగా నిలవాలి. రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్ల విషయంలో కేంద్రం వివక్ష చూపుతోంది. నిటి అయోగ్ సిఫారసులను అమలు చేయాలి. తెలంగాణలో మిషన్ భగీరథకు నిధులివ్వాలంటూ నిటి అయోగ్ చెప్పినా కేంద్రం పట్టించుకోలేదు. ఇది వివక్షా పూరితమే. కాబట్టి... దేశంలో సామాన్యుల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు వీలుగా మా సూచనలు, సలహాలను స్వీకరించి నిటి అయోగ్ తన పాత్రను పోషించాలని కోరుతున్నాం...' అని సీపీఐ (ఎం) పేర్కొంది.

రాష్ట్రాలకు ఇచ్చే వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలి : బీఆర్ఎస్

కేంద్రం చెప్పేదొకటి, చేసేదొకటని బీఆర్ఎస్ విమర్శించింది. పన్నుల వాటాను 41 శాతానికి పెంచుతున్నామని చెప్పి, 31 శాతం నిధులనే విదుల్చుతున్నారని ఆ పార్టీ వాపోయింది. 'కేంద్రానికి వచ్చే ఆదాయంలో 20 శాతాన్ని సర్ ఛార్జీలు, సెస్సుల రూపంలో సమకూర్చుకుంటున్నారు. ఈ డబ్బును వాటాల ప్రకారం రాష్ట్రాలకు ఇవ్వడం లేదు. ఆ శాతాన్ని 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలి. గతంలో నాన్ ట్యాక్స్ రెవెన్యూ కేంద్రానికి చాలా తక్కువగా ఉండేది. 1961లో అది 171 కోట్లుగా ఉంటే, 2024-25 నాటికి రూ.5.46 లక్షల కోట్లకు పెరిగింది. అందువల్ల నాన్ టాక్ రెవెన్యూలో రాష్ట్రాలకు వాటాలివ్వాలి. బాగా పని చేస్తున్న రాష్ట్రాలకు శిక్ష వేస్తున్నారు. దేశంలోనే తలసరి ఆదాయం అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ఈ విషయంలో బాగున్నాం కాబట్టి, వాటా తక్కువ ఇస్తామనటం అన్యాయం. పదమూడో ఆర్థిక సంఘంలో రాష్ట్ర వాటాను 2.437 శాతంగా చూపారు. 14వ ఆర్థిక సంఘం నాటికి 2.133 శాతానికి తగ్గించారు. 15వ ఆర్థిక సంఘం నాటికి 2.102 శాతానికి తగ్గించి చూపారు. ఈ నేపథ్యంలో కనీసం పదహారో ఆర్థిక సంఘమైనా రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరుతున్నాం...' అని బీఆర్ఎస్ పేర్కొంది.

సెస్‌లు, సర్‌ఛార్జ్‌లు డివిజిబుల్ పూల్‌లో ఉండాలి : ఆప్

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు సెస్సులు, సర్‌ఛార్జ్‌లు తక్కువగా ఉండేవని ఆప్ తెలిపింది. వాటిని అవిభాజ్య పూల్‌లో చేర్చారని పేర్కొంది. బీజేపీ అధికారంలోకి వచ్చాక సెస్‌లు, సర్‌చార్జీలను అసాధారంగా పెంచారని విమర్శించింది. ఇది వెనుక తలుపు నుండి రాష్ట్రాల డబ్బు తీసుకోవడం తప్ప మరొకటి కాదని తెలిపింది. అందువల్ల సెస్‌లు, సర్‌ఛార్జ్‌లను డివిజిబుల్ పూల్‌లో చేర్చాలని కోరింది.

జనాభా ప్రాతిపదికన అంటే తెలంగాణకు అన్యాయమే : సిరిసిల్ల రాజయ్య

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా తెలంగాణ (ఉమ్మడి రాష్ట్రం నుంచే) జనాభాను నియంత్రించిందని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య తెలిపారు. ఈ క్రమంలో జనాభాను నియంత్రించినందుకుగాను అదనపు నిధులివ్వాల్సిం దిపోయి... 'జనాభా ప్రాతిపదికన' అంటూ తెలంగాణకు అన్యాయం చేయటం తగదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో చెప్పిన దాని ప్రకారం తెలంగాణకు నిధులివ్వాలని కోరారు. ఇక్కడి ప్రాజెక్టులకు కేంద్రం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన రాష్ట్రాలకు పెర్ఫార్మెన్స్ ఆధారంగా నిధులివ్వాలని కోరారు.

కాంగ్రెస్ కార్యకర్తల పార్టీ

- వారి కృషి వల్లే టీపీసీసీ చీఫ్ పదవి: టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్



నవతెలంగాణ- దుండిగల్

కాంగ్రెస్ కార్యకర్తల పార్టీ అని, వారి కృషి వల్లే తనకు టీపీసీసీ చీఫ్ పదవి అవకాశం వచ్చిందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆహ్వానం మేరకు సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దూలపల్లిలోని ఆయన నివాసానికి మహేష్ కుమార్ గౌడ్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు మైనంపల్లి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పార్టీ అని, అన్ని వర్గాలు రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో కార్యకర్తల కృషి, త్యాగాల వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకు ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయం చేసుకుంటూ పని చేస్తానని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులకు లబ్ది చేకూర్చడమే తమ లక్ష్యం అని అన్నారు. ఈ తొమ్మిది నెలల పరిపాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామని చెప్పారు. అంతకు ముందు వరద బాధితుల సహాయార్థం ఖమ్మం జిల్లాకు పంపిస్తున్న నిత్యావసర సరుకుల వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, కూన శ్రీశైలంగౌడ్, సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహేష్ కుమార్ గౌడ్‌కు అభినందనలు

నూతన పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు పలువురు అభినందనలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని హైదర్‌గూడ క్వార్టర్స్‌లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కలిశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు బాణాసంచా కాల్చుతూ, స్వీట్స్ పంచుతూ సంబరాలు చేసుకున్నారు. తనపై అభిమానంతో తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపిన అందరికీ మహేష్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

మొక్క కుళ్లిపోతోంది... పూత రాలుతోంది

- వరుస వర్షాలతో పత్తి పంట ఆగం
- వరితో పాటు మిగతా పంటలకూ నష్టం
- రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షల ఎకరాల్లో ఎఫెక్ట్
- రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి : రైతు సంఘాల నాయకులు



అధిక వర్షాలు, వరదలు పంటలను ముంచేశాయి.. పత్తి మొక్క కుళ్లిపోతోంది. పూత రాలిపోతోంది. వర్షాలకు తెగుళ్లు తోడై పత్తి పైరును దెబ్బతీస్తున్నాయి. ఈ వర్షాలకు వరి, మిగతా పంటలకు నష్టం జరిగింది. అత్యధికంగా పత్తి, వరి బాగా దెబ్బతిన్నాయని సమాచారం. పంటలను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. డ్రోన్ కెమెరాలతో పత్తికి పురుగుల మందు పిచికారీ చేస్తున్నారు. అయినా పంటలు బయట పడే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలు అన్నదాతలకు అపార నష్టాన్ని మిగిల్చాయి. ప్రభుత్వ ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. రైతులను ఆదుకోవాలని రైతు సంఘాలు కోరుతుండగా.. పంట చేలో నిలిచిన నీళ్లను వెంటనే తొలగించాలని వ్యవసాయ అధికారులు సలహాలు ఇస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షల ఎకరాల్లో పత్తి, 5 లక్షల ఎకరాల్లో వరి పంట మునిగినట్టు సమాచారం. మహబూబాబాద్, ములుగు, ఖమ్మం, నల్లగొండ, నాగర్‌కర్నూల్, నారాయణపేట, మహబూబ్‌నగర్, హన్మకొండ, భద్రాద్రి, కొత్తగూడెం, సూర్యపేట, తదితర జిల్లాల్లో నష్టం ఎక్కువగా జరిగిందని అధికారుల అంచనా.

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

మహబూబ్‌నగర్ జిల్లాలో సాధారణ సాగు 3,35,863 ఎకరాలు. వరదల వల్ల లక్ష ఎకరాలకు పైగా నష్టం వాటిల్లిందని అధికారుల అంచనా, నారాయణపేటలో సాధారణ సాగు 4,29,082 ఎకరాలకు 75 వేల ఎకరాలలో పత్తి, కంది పంటలకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. నాగర్‌కర్నూల్‌లో 5,28,279 ఎకరాలు సాగు కాగా, అందులో పత్తి లక్ష ఎకరాలు, వనపర్తిలో 2,41,726 ఎకరాలు కాగా 25 వేల ఎకరాలలో పత్తి పంట నష్టం జరిగిందని జిల్లాలోని రైతు సంఘాలు అంటున్నాయి. ఖమ్మంలో 70 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగితే పత్తి 30 వేల ఎకరాల్లో, ఆ తర్వాత వరి సాగు నష్టపోయింది. మహబూబాబాద్‌లో పత్తి 5,764 ఎకరాలు, వరి 16,810 ఎకరాలు నీటి పాలైందని రైతులు వాపోయారు. సూర్యపేట జిల్లా హుజుర్‌నగర్‌లో పత్తి, మిర్చి బాగా దెబ్బతిన్నాయని చింతలపాలెం రైతులు ఆవేదన చెందుతున్నారు. సిరిసిల్ల జిల్లాలో 700 ఎకరాల్లో పత్తి, వరి బాగా దెబ్బతిన్నాయని అధికార వర్గాల సమాచారం.

నాగర్‌కర్నూల్ జిల్లా బిజనపల్లి మండలం మంగనూర్ గ్రామంలో 2500 ఎకరాల సాగు భూమి ఉంది. ఇక్కడ అత్యధికంగా నల్లభూములే ఉన్నాయి. వెయ్యి ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. నల్ల భూములు కావడం చేత పంట చేలు ఏపుగా పెరిగాయి. భారీ వర్షాలకు పత్తి పైరు నేలకొరిగింది. కుర్వ మల్లయ్య, వెంకటయ్యకు చెందిన 10 ఎకరాల పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఐదు లక్షలు ఖర్చు పెట్టి సాగు చేస్తే.. కనీసం పెట్టుబడి కూడా వచ్చేట్టు కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా పంట పొలాలు నీటి నుంచి బయట పడలేదు. దుందుబీ నది, కృష్ణ పరివాహక ప్రాంతం, కోయిల్‌సాగర్, బీమా, నెట్టెంపాడు ప్రాజెక్టుల పరిధిలో పత్తి పైర్లు నీటిలో మునిగిపోయాయి. నాగర్‌కర్నూల్ మండలం మల్కాపూర్, పుల్జాల, తాళ్లపల్లి గ్రామాల పరిధిలో పత్తి, మిర్చి పంటలకు భారీ నష్టం వాటిల్లింది. జూరాల కింది ఆయకట్టు సైతం వరదలకు అతలాకుతలం అయింది. ఇలా ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని ఐదు జిల్లాల్లో రూ.100 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లిందని రైతు సంఘాలు తెలియజేస్తున్నాయి. రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశాయి.

అప్పు చేసి పత్తి పంటను సాగు చేశాం.. జానయ్య, మొల్గర, భూత్పూర్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా

నేను ఐదెకరాల్లో పత్తి పంట సాగు చేశాను. లక్ష రూపాయల దాకా పెట్టుబడి అయింది. వారం రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు పత్తి పంట పూర్తిగా నేలకొరిగింది. కాయలు మురిగిపోతున్నాయి. పూత రాలిపోతోంది. పంట చేతికొచ్చే అవకాశాలు లేవు. ప్రభుత్వం ఆదుకోవాలి.

పంట పొలాల్లో నీటి నిల్వ లేకుండా చేయాలి.. వెంకటేష్, డీఏఓ- మహబూబ్‌నగర్ జిల్లా

అధిక వర్షాలు రావడంతో పంట పొలాల్లో నీరు నిలిచింది. పత్తి, మిర్చి వంటి పొలాల్లో నీటిని సాధ్యమైనంత త్వరగా తొలగించాలి. ఆ తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 15కిలోల పొటాష్ చల్లాలి. ఆక్సీక్లోరైడ్ కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, గ్రాము కార్బండిజమ్‌ను మూడు సార్లు పిచికారీ చేయాలి. పడిపోయిన మొక్కలను నిలబెట్టేలా ప్రయత్నించాలి. లేనిచో ఇంకా అధిక నష్టం వచ్చే అవకాశాలు ఉన్నాయి.

మౌనం వీడే సమయం ఆసన్నమైంది

మాధబి బచ్‌ను ప్రశ్నించనున్న పీఏసీ

ఆరోపణలపై నేటికీ పెదవి విప్పని సెబీ చీఫ్

వత్తాసు పలుకుతున్న మోడీ ప్రభుత్వం

న్యూఢిల్లీ : బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్ల ట్రెజరీ విభాగాలలో పనిచేసే అధికారులకు సెబీ కఠినమైన నిబంధనలు నిర్దేశించింది. ఈ విభాగాలు ప్రతి రోజూ మార్కెట్‌లో షేర్లను కొనుగోలు చేసి విక్రయిస్తుంటాయి. నిబంధనల ప్రకారం అధికారులు తమ పేరిట కానీ లేదా కుటుంబ సభ్యుల పేరిట కానీ వాటాలు కొనుగోలు చేయడం నిషిద్ధం. మార్కెట్‌లో ఇతర అధికారుల కోసం ఇలాంటి నిబంధనలు విధిస్తున్న దర్యాప్తు సంస్థ వాటిని తాను ఎందుకు పాటించడం లేదు? దర్యాప్తు సంస్థల పనితీరుపై విచారణ జరుపుతున్న పార్లమెంటరీ కమిటీ ఎదుట సెబీ చీఫ్ మాధబి పురి బచ్ హాజరయినప్పుడు ఎదుర్కొనబోయే అతి పెద్ద ప్రశ్న ఇదే.

సెబీ పనితీరుపై సమీక్ష జరిపే అంశాన్ని ప్రతిపక్ష ఎంపీ నేతృత్వంలోని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) ఇప్పటికే తన అజెండాలో చేర్చిందని వార్తలు వస్తున్నాయి. కమిటీ సంధించే ప్రశ్నలకు సెబీ చీఫ్ ఎప్పుడో ఒకప్పుడు స్పందించక తప్పదు. మౌనాన్ని ఆశ్రయించడం ఇంకెంత మాత్రం మార్గం కాబోదు.

విరుద్ధ ప్రయోజనాల ఆరోపణలే అధికం

సెబీ అధిపతిగా మాధబి బచ్ పనితీరుపై అమెరికాకు చెందిన పరిశోధనా సంస్థ హిండెన్‌బర్గ్ ప్రతి రోజూ అసంఖ్యాకమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. అయినప్పటికీ వాటికి సమాధానమిచ్చేందుకు బచ్ ససేమిరా అంటున్నారు. తన కంపెనీల వాటాల విలువను పెంచి చూపించేందుకు అదానీ గ్రూప్ ఓ విదేశీ (ఆఫ్‌షోర్) సంస్థను వాడుకున్నదని, అందులో ఆమెకు వాటాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. ఆ తర్వాత కూడా మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థ అధిపతిగా బచ్ ఎలా కొనసాగుతారంటూ పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. బచ్‌పై వచ్చిన ఆరోపణల్లో అనేకం పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించినవే.



ప్రశ్నార్థకమైన విచారణ

గౌతమ్ అదానీ సోదరుడైన వినోద్ అదానీకి సంబంధం ఉన్న ఆఫ్‌షోర్ సంస్థలో మాధబి బచ్‌కు వాటాలు ఉన్న విషయం ఇప్పటికే దర్యాప్తులో తేలిపోయింది. గత సంవత్సరం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అదానీ వ్యవహారాలపై జరిగిన దర్యాప్తు నుండి బచ్ తనంతట తానుగా వైదొలగలేదని పేరు చెప్పడానికి ఇష్టపడని సెబీ బోర్డు సభ్యుడు గత వారం వెల్లడించారు. కోర్టు పర్యవేక్షణలో అదానీపై జరుగుతున్న మొత్తం విచారణను ఈ ప్రకటన ప్రశ్నార్థకం చేసింది. గతంలో తాను ఆర్థిక ప్రయోజనాలు పొందిన ఆఫ్‌షోర్ సంస్థపైనే తాను దర్యాప్తు జరుతున్నానా అనే విషయం బచ్‌కు తెలియదా అని పీఏసీ ప్రశ్నించవచ్చు.

సంప్రదాయానికి స్వస్తి

సెబీలో చేరకముందు బచ్‌కు ఐసీఐసీఐలో వాటాలు ఉన్నాయని రూఢీ అయింది. ప్రయివేటు కంపెనీ అయిన ఐసీఐసీఐ నుండి పదవీ విరమణ చేసిన తర్వాత ఆమెకు లభించిన ప్రయోజనాలలో భాగంగానే ఈ వాటాలు వచ్చాయని చెబుతున్నారు. ఐసీఐసీలో అధిక వాటాలు కలిగి ఉన్నప్పుడు సెబీ చీఫ్‌గా ఆమె ఎలా నిర్ణయాలు తీసుకున్నారన్నదే ఇక్కడ ప్రశ్న. ఎందుకంటే సెబీ అధిపతిగా బచ్ తీసుకున్న నిర్ణయాల కారణంగా ఆమె వాటాల విలువపై ప్రభావం పడే అవకాశం ఉంది. అంటే సెబీ నిర్ణయం కారణంగా అయినా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితం అయి ఉంటే అది పరస్పర విరుద్ధ ప్రయోజనానికి దారితీసినట్లే. భవిష్యత్తులో మాధబి బచ్ పార్లమెంటరీ కమిటీ ఎదుట హాజరైతే ఈ ప్రశ్నలన్నింటినీ ఆమె ఎదుర్కోవాల్సి ఉంటుంది.

బ్లాక్‌స్టోన్ పెట్టుబడులపై అనుమానాలు

ఇదిలావుండగా బచ్ భర్త బ్లాక్‌స్టోన్ అనే బహుళజాతి ప్రైవేట్ సంస్థకు కూడా సలహాదారుగా వ్యవహరించారు. ఈ సంస్థ మన దేశంలో కార్యకలాపాలు సాగిస్తోంది. మాధబి బచ్ భర్తకు ప్రమేయం ఉన్న డజన్ల కొద్దీ కంపెనీలలో బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు పెట్టింది. ఆ కంపెనీలు ఏ ఒక్క

ఈ వ్యవహారంలో పరస్పర విరుద్ధ ప్రయోజనం ఉన్నదన్న మాట. గతంలో దర్యాప్తు సంస్థ అధిపతులుగా పనిచేసిన వారు బాధ్యతలు స్వీకరించక ముందే తమ పేరిట ఉన్న వాటాలన్నింటినీ విక్రయించారు. ఇది ఓ సంప్రదాయంగా వస్తోంది. కానీ మాధబి బచ్ ఈ సంప్రదాయాన్ని ఎందుకు అనుసరించలేదన్నది తెలియడం లేదు.

నేతలు భరోసా ఇచ్చారా?

సెబీ చీఫ్‌గా బచ్‌ని నియమించడానికి ముందు ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని క్యాబినెట్ నియామకాల కమిటీ ఈ అంశాన్ని ఎందుకు లేవనెత్తలేదన్నది ఇక్కడ ప్రధాన ప్రశ్న. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన వ్యవహారాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని లేదా ఎవరైనా వాటిని ప్రస్తావిస్తే తాము చూసుకుంటామని రాజకీయ నేతల నుండి బచ్‌కు హామీ వచ్చి ఉండవచ్చు. వాస్తవానికి బచ్ వంటి మేధావి, విజయవంతమైన ఫైనాన్స్ మార్కెట్ నిపుణురాలికి తీవ్రమైన ఈ విరుద్ధ ప్రయోజనాల గురించి కచ్చితంగా తెలిసి ఉంటుంది. ఎందుకంటే తొలుత సెబీ బోర్డు సభ్యురాలిగా, ఆ తర్వాత చైర్‌పర్సన్‌గా వ్యవస్థలోకి ఆమే ఆ అంశాలను లాగారు.

భర్త సంస్థలో వాటాలు

మరో అడ్వైజరీ సర్వీస్ అరోగా లిమిటెడ్‌లో కూడా బచ్ వాటాదారుగా కొనసాగారు. బచ్ సెబీ బోర్డు సభ్యురాలిగా, చైర్‌పర్సన్‌గా కొనసాగిన సమయంలో అరోగా లిమిటెడ్‌ను నిర్వహించింది ఆమె భర్తే. సెబీలో బచ్ పనిచేసినప్పుడు ఈ అడ్వైజరీ సర్వీస్ చాలా ఆదాయాన్ని పొందింది. కార్పొరేట్ సంస్థలకు అరోగా సలహాలు ఇచ్చిందా లేదా అనేది తెలియడం లేదు. అలాగే అరోగా నుండి సలహాలు పొందిన కొన్ని కార్పొరేట్ సంస్థలు సెబీ విచారణ లేదా దర్యాప్తును ఎదుర్కొన్నదీ లేనిదీ కూడా తెలియదు.



వెనకేసుకొస్తున్న మోడీ ప్రభుత్వం

ఈ ఆరోపణల పర్వం ఇలా కొనసాగుతున్న సమయంలోనే బచ్‌కు మరిన్ని కష్టాలు వచ్చి పడ్డాయి. 'పని ప్రదేశంలో విష సంస్కృతి'పై కొందరు సెబీ అధికారులు బోర్డు ఎదుట గళం విప్పి నిరసన తెలిపారు. బచ్ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. దర్యాప్తు సంస్థలోనే ఆమెకు పెద్దగా మద్దతు లేదన్న విషయం ఈ ఉదంతంతో స్పష్టమై పోయింది. అయితే ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే మాధబి బచ్‌కు మోడీ ప్రభుత్వం వత్తాసు పలుకుతోంది. ఇప్పటివరకూ ఎన్ని వివాదాలు వచ్చినప్పటికీ ఆర్థిక మంత్రిత్వ శాఖ, ప్రధాని కార్యాలయం మౌనాన్ని వీడడం లేదు. అసలు ఏమీ జరగనట్లుగానే ప్రభుత్వం వ్యవహరిస్తోంది. సెబీలో బచ్ తన పని తాను చేసుకుపోయేలా అనుమతిస్తోంది. అయితే ఇది ఎంతో కాలం కొనసాగబోదు. త్వరలోనే అన్ని ప్రశ్నలకూ బచ్ సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఆ రోజు ఎంతో దూరం లేదు.



జనగామా జిల్లా, కామారెడ్డి గూడెంలో షేక్ బందగీ స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వేముల ఆనంద్,సీపీఐ(ఎం) జిల్లా నాయకులు సింగారపు రమేష్, శౌర్యయాత్ర బృందం

చరిత్రకు మతం రంగు పులిమితే ఖబర్దార్..

- భూములు పంచింది, త్యాగాలు చేసింది కమ్యూనిస్టులే..
- ప్రజానాట్యమండలి శౌర్యయాత్రలో.. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్



బందగీకి వందనాలు

నవతెలంగాణ-జనగామ

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రకు మతం రంగు పూయాలని చూస్తే ఖబర్దార్ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ హెచ్చరించారు. సెప్టెంబర్ 1 నుండి 30 వరకు ప్రజానాట్యమండలి చేపట్టిన శౌర్యయాత్ర సోమవారం జనగామ జిల్లాకు చేరింది. ఈ సందర్భంగా పట్టణంలోని నెహ్రూ పార్క్ వద్ద పార్టీ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన 'అమరుల యాదిలో శౌర్య యాత్ర' సభలో అబ్బాస్ మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4000 మంది అమరులు బలిదానం చేశారన్నారు. ఫలితంగా తెలంగాణ ప్రాంతంలో జాగిర్దారులు, భూస్వాముల వద్ద ఉన్న లక్షల ఎకరాల భూములు గుంజి పేదలకు పంచినట్టు చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటమని అన్నారు. నాటి రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి ప్రజల పక్షాన నిలిచింది కమ్యూనిస్టులేనని చెప్పారు. ఈ పోరాటంలో జనగామ గడ్డ నుంచి అనేకమంది ప్రాణాలర్పించారని గుర్తు చేశారు. ఈ పోరాటానికి ఎలాంటి సంబంధమూ లేని బీజేపీ.. ఈ ఉద్యమాన్ని వక్రీకరించి చెప్పేందుకు కుట్రలు పన్నుతున్నదన్నారు. అత్యంత కిరాతకంగా ప్రజల మానం, ప్రాణం, హక్కులను హరించిన రజాకారులపై అన్ని విధాల దోపిడీకి గురైన పేద బడుగు, బలహీన వర్గాల ప్రజలు కమ్యూనిస్టుల సారథ్యంలో చేసిన పోరాటం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని స్పష్టంచేశారు. కానీ, బీజేపీ.. సాయుధ పోరాటం హిందూ ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయుధ పోరాటంలో అనేకమంది ముస్లింలు కూడా నైజాంకు వ్యతిరేకంగా పోరాడి అమరులయ్యారని అన్నారు. సాయుధపోరాట ఫలితంగానే దేశంలో భూ సంస్కరణల చట్టం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎం. కనకారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఈ. అహల్య, బి. శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలను ఆకట్టుకున్న పీఎన్ఎం కళారూపాలు..

శౌర్య యాత్రలో భాగంగా జనగామ జిల్లా కేంద్రంలో ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కళారూపాలు ప్రజలను ఉర్రూతలూగించాయి. నైజాం రజాకారులు పేద ప్రజలను ఎలా హింసించారో, దానికి ప్రతిఘటనగా ప్రజలు ఎలా పోరాటాలు నిర్వహించారో.. కండ్లకు కట్టేలా చూపించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వీరుల చిత్రపటాలను చేత పట్టుకొని వివిధ కళారూపాలను ప్రదర్శించారు. రక్తపు మడుగుల్లో విప్లవకారులు నేలకొరిగిన రూపాన్ని ప్రతిబింబించేలా కళా రూపాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, నాయకులు వెంకన్న, ఎం.జీ వినోద్, ఎం.టి గౌసియా, జయ రజిత, రాజయ్య నాగమణి, సుధాకర్, అంజమ్మ, రజిత, సౌందర్య, లింకన్, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో మందుల కొరత

సౌకర్యాల్లేక తగ్గుతోన్న ఔట్ పేషెంట్ల సంఖ్య

సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్

ఈఎస్ఐ స్టేట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనితకు సీపీఐ(ఎం) నేతల మెమోరాండం



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణలోని ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీలలో మందుల కొరత తీవ్రంగా ఉందని, వైద్య పరీక్షలు సైతం చేయడం లేదని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ఈఎస్ఐ ఆస్పత్రుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కొనసాగుతోందన్నారు. అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ సోమవారం ఈఎస్ఐ రాష్ట్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనితకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో మెరుగైన సౌకర్యాలతోపాటు వైద్యపరీక్షలు నిర్వహించాలని, మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల పరిస్థితి అత్యంత దారుణంగా మారుతోందన్నారు. దాంతో ఔట్ పేషెంట్ల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తగిన సదుపాయాలు లేకపోవడంతో కార్మికులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డిస్పెన్సరీలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, అద్దెలు సక్రమంగా చెల్లించక పోవడంతో పలు ప్రాంతాల్లో భవనాలకు యజమానులు తాళాలు వేశారని గుర్తు చేశారు. కొన్ని నెలలుగా మందులు అందుబాటులో లేవని, వైద్య పరీక్షలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసరమైన రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలకు కిట్లు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ వ్యాధులకు అవసరమైన మందులు సైతం అందుబాటులో లేవన్నారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని, నగర వాసులు జాగ్రత్తలు తీసుకోవాలంటూ వైద్యులే అవగాహన కల్పిస్తున్నారని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో డిస్పెన్సరీల్లో మందులు, కిట్లు లేకపోవడం ఆందోళనకరమన్నారు. మందులు సరఫరా చేసే ఏజెన్సీలకు బిల్లులు చెల్లించడం లేదని, దాంతో వారు మందులు, కిట్ల సరఫరాలను నిలిపివేశారన్నారు. గత 7, 8 నెలల నుంచి ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల వైద్య సౌకర్యాలను మెరుగుపర్చాలని, మందులను అందుబాటులో ఉంచాలని కోరారు.





వరద బాధితుల సహాయార్థం సీపీఐ(ఎం), సీఐటీయూ విరాళాల సేకరణ

నవతెలంగాణ-విలేకరులు

ఖమ్మంలో ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో వరదల్లో చిక్కుకొని సర్వం కోల్పోయిన బాధితుల సహాయం కోసం సీపీఐ(ఎం), సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం విరాళాలు సేకరించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయం కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి జి.భాస్కర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలతో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన ఖమ్మం వరద బాధితులకు అండగా నిలుద్దామన్నారు. ఖమ్మం జిల్లా మధిర పట్టణంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆర్థిక, వస్తు సేకరణ విరాళాలు చేపట్టారు.

టీఎమ్ఎస్ఆర్‌యూ
రూ.50 వేల సహాయం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌కు చెక్కు అందజేత



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, అకాల వరదలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. సోమవారం హైదరాబాద్‌లో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్‌కు దానికి సంబంధించిన చెక్కును ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ భానుకిరణ్, సంయుక్త ప్రధాన కార్యదర్శి ఎ.నాగేశ్వర్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా భాను కిరణ్ మాట్లాడుతూ.. వర్షాలతో సర్వం కోల్పోయి కష్టకాలంలో ఉన్న కార్మికులను ఆదుకోవడం తమ కర్తవ్యంగా భావించి ఈ సహాయం చేశామని తెలిపారు. టీఎమ్ఎస్ఆర్‌యూ రాష్ట్ర కమిటీని పాలడుగు భాస్కర్ అభినందించారు.

ఖమ్మం నగరంలో సీపీఐ(ఎం) సాయం



నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరంలో అకాల వర్షాల వల్ల ముంపునకు గురైన ఆర్టీసీ కార్మికులకు సీపీఐ(ఎం) జిల్లా కమిటీ నుంచి 100 మందికి నిత్యావసర కిట్లను అందించారు. సోమవారం ఖమ్మం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కార్మికులకు వరద సహాయక కిట్లు అందజేశారు. అలాగే, మున్నేరు వరద ముంపునకు గురైన సుందరయ్య నగర్ ఏరియా ప్రజలకు మిత్ర స్నేహ గ్రూప్ సంస్థ సౌజన్యంతో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 100 వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. ఖమ్మంరూరల్ మండలం పెద్దతండా పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. వరంగల్ క్రాస్ రోడ్ వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ.. ఖమ్మం నగరంలో భారీ వర్షాలు వచ్చి వారం రోజులు దాటిపోతున్నా ఇంకా కాలనీలు వరదమయంలో ఉన్నాయని, ఇండ్లలో బురద, నీళ్లతో వస్తువులు ఉన్నాయని అన్నారు. ప్రజలు అనేక అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్నారని, వారికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ.. అనేక ప్రాంతాల్లో పార్టీ ఆధ్వర్యంలో నిత్యావసర ఆహార వస్తువుల కిట్స్, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేసినట్టు, పార్టీ శక్తి మేరకు సహాయ సహకారాలు అందిస్తున్నట్టు తెలిపారు.

బస్‌భవన్ వద్ద ఎస్‌డబ్ల్యూఎఫ్ విరాళాల సేకరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారంనాడిక్కడి బస్‌భవన్ వద్ద వరద బాధితుల సహాయ నిధికి విరాళాలు సేకరించారు.

ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ జోన్ అధ్యక్షులు, సోమన్న, కార్యదర్శి ప్రకాష్, జీఆర్ రెడ్డి, గౌడ్ తదితరులు బస్‌భవన్ ప్రవేశద్వారం వద్ద డబ్బాలు పట్టుకొని ఉద్యోగులను విరాళాలు కోరారు. నగదు రూపంలో రూ.4,170 వసూలుకాగా, ఫోన్ పే ద్వారా రూ.900 వచ్చాయి. మొత్తం రూ.5,070 విరాళం వసూలైనట్టు నాయకులు తెలిపారు. సహకరించిన వారందరికీ రాష్ట్ర కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు.



సామాజిక రుగ్మతల నివారణకు
మరో ఉద్యమం అవసరం

సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కాళోజీ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో కవి సమ్మేళనం



నవతెలంగాణ-కల్చరల్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా వాటి ఫలాలు ఇంకా ప్రజలకు అందలేదని, సామాజిక రుగ్మతలను తొలగించేందుకు మరో ఉద్యమం రావాలని పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అందుకు కవులు కళాకారులు బాధ్యత తీసుకోవాలని కోరారు. కాళోజీ నారాయణరావు 110వ జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో సోమవారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహాకవికి పాండిత్యం తెలిసి ఉంటే చాలని, అదే ప్రజా కవి కావాలంటే ప్రజల బాధలు, కష్టాలు తెలిసి ఉండాలని అన్నారు. శ్రీశ్రీ ప్రజల గొడవను తన గొడవగా భావించారని.. కాళోజీ 'నా గొడవలో తెలంగాణ ప్రజ గొడవ' అని చెప్పారని అన్నారు. సాంస్కృతిక శాఖ ఆట.. పాటకు మాత్రమే కాదని, సంస్కృతీ.. జీవన విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కాళోజీ కవితల స్ఫూర్తిని గ్రహిస్తే సమాజంలో పలు సంస్కరణలు అమలు చేయొచ్చని.. కవులు, కళాకారుల సహకారం అవసరమని తెలిపారు. త్వరలో వీరితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం ఉంటుందని అన్నారు. అధ్యక్షత వహించిన సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. కాళోజీ అంటేనే సామాన్య జనుల గొంతుక.. ధిక్కార స్వరం అన్నారు. నాడు పద్మ విభూషణ్ అవార్డును కాళోజీకి బహూకరించే ముందు ఆయన అంగీకరిస్తారో లేదోనని అప్పటి ప్రధాని పివి సంకోచించారని గుర్తు చేశారు. రాష్ట్ర గీత కర్త అందెశ్రీ మాట్లాడుతూ.. కవులు, రచయితలు, కళాకారులు నిజాన్ని నిర్భయంగా స్వేచ్ఛగా చెప్పాలని, పాలకులకు ఒత్తాసు పలకడం వల్లే తెలంగాణ ఆశయాలు సాకారం కాలేదని చెప్పారు. ఈ సభకు సాహిత్య అకాడెమీ కార్యదర్శి బాలా చారి స్వాగతం పలకగా.. పర్యాటక సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ యాదగిరిరావు, నేటి నిజం పత్రిక సంపాదకులు బౌస దేవదాసు పాల్గొన్నారు.

సంపాదకీయం

వారు చీకట్లను బద్దలు కొట్టారు

'సూర్య గ్రహణం వేళ నేను పుట్టడంతో అంతా నన్ను కోతి అని, పిచ్చిదని రకరకాల పేర్లతో పిలిచేవారు. అనాథ శరణాలయంలో నన్ను వదలాల్సిందిగా నా తల్లిదండ్రులపై చాలామంది ఒత్తిడి తెచ్చారు. కానీ, ఇవ్వాళ నేను దేశం గర్వపడేలా భారతావనికి పతకం సాధించాను.' పారిస్ పారాలింపిక్స్‌లో 400 మీ.ల పరుగులో కాంస్యంతో మెరిసిన మన వరంగల్ అథ్లెట్ జీవాంజి దీప్తి ఆవేదన ఇది. ఆమెదే కాదు ఒక్కొక్కరిది ఒక్కోగాథ. అడుగడుగునా ఎన్నో అనుమానాలు, అవమానాలు, మరెన్నో ప్రశ్నలు.. ఆ ప్రశ్నలన్నిటికి నేడు చేతలతోనే సమా ధానాలు చెప్పారు. 'పారీస్ పారాలింపిక్స్‌లో 25 పతకాలు సాధిస్తాం'.. ఇది క్రీడల ఆరంభానికి ముందు మన పారా అథ్లెట్ల బృందం ధీమా! దానిని కూడా హేళన చేసిన వారి నోళ్లు మరల తెరవకుండా 12 క్రీడాంశాల్లో తలపడిన 84 మంది భారతీయ పారాఅథ్లెట్లు అంచనాలకు మించి అద్వితీయ ప్రదర్శనతో ఏడు స్వర్ణాలు సహా మొత్తం 29 పతకాలు ఒడిసిపట్టారు.

> ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ తదితర దేశాలు సరికొత్త విధానాలతో వారికి ఆలంభనగా నిలుస్తుంటే.. మాట్లాడితే ఆయా దేశాలతో పోల్చుకుంటూ దేశ, రాష్ట్రాల రూపురేఖలే మార్చేస్తాం అని చెప్పుకునే మన నేతలకు.. దుర్భర స్థితిలో ఉన్న వికలాంగుల హక్కులు హరించబడ్డ విషయాలు కనబడవు. విద్య, ఉపాధుల్లో వారికి అవరోధంగా ఉన్న వ్యవస్థలకు చరమగీతం పాడాలి. పారాలింపిక్స్ వంటి ప్రతిష్టాత్మక క్రీడల్లో పోటీపడటానికి అవరోధాలుగా ఉన్న మౌలిక సదుపాయాలు, నిధులు కొరతను అధిగమించే ఏర్పాట్లు చేసి తమ కమిట్‌మెంట్‌ను చూపించాలి.



వారి వైకల్యాన్ని మనస్సు కంటన్యిక ఒంటికే పరిమితం చేసి చక్రాల కుర్చీలతో.. కృత్రిమ కాళ్లతో.. పని చేయని చేతులతో.. పారాలింపిక్స్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ ఆ అనుమానాలను పటాపంచలు చేశారు. ఆత్మవిశ్వాసం అండగా.. పోరాటమే శ్వాసగా.. ఆట మీదే ధ్యాసతో..అద్భుత ప్రదర్శనతో దేశానికి పతక వెలుగులు పంచారు. 'అవిటితనం కన్న ఆత్మవిశ్వాసం మిన్నా / అధికాస్త లేకున్నా అంగము లున్నా సున్నా' అన్న కవి శేషగిరి వాక్కులను నిజం చేస్తూ మన పారా అథ్లెట్లు ఆత్మవిశ్వాసం, పట్టుదలతో విశ్వక్రీడా యవనికపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. అన్ని అవయవాలు సక్రమంగా ఉండి.. అన్ని వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ.. తామేమీ సాధించలేమనే నిరాశలో కుంగిపోతూ చాలా మంది తమ జీవితాలను మధ్యలోనే ముగిస్తారు. కానీ, వీళ్లది కష్టాల కడలిలాంటి జీవితం.. ఆ జీవన ప్రయాణంలో అడుగడుగునా అడ్డంకులే అయినా, వెన్నుచూపలేదు. భయపడి చీకటిలోనే ఉండిపోలేదు. అన్నింటిని అధిగమించి ఆటల్లో సత్తాచాటి దేశ ఖ్యాతిని చాటారు. టోక్యో పారాలింపిక్స్‌లో 19 పతకాలు సాధిస్తే.. పారిస్‌లో 29 పతకాలతో మరో చరిత్రకు నాంది పలికారు.

వెన్నునొప్పితో అల్లాడుతున్నా వెనకడుగు వేయని సుమిత్ అంటిల్ జావెలిన్ త్రోలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఏడాదిగా అనారోగ్యం కుంగదీస్తున్నా అవని లేఖరా తుపాకీ గురి తప్పలేదు. క్లబ్‌త్రో, హైజంప్, బ్యాడ్మింటన్, ఆర్చరీల్లోనూ మన క్రీడాకారులు స్వర్ణాలు కొల్లగొట్టారు. ఆత్మవిశ్వాసంతో ప్రతికూలతలను అధిగమించి విజేతలుగా నిలిచిన పారా అథ్లెట్లకు యావద్దేశం జేజేలు పలుకుతోంది! పుట్టుకతోనే చేతుల్లేని జమ్మూకశ్మీర్‌కు చెందిన పదిహేడేండ్ల శీతల్ దేవి కాలితో విల్లు పట్టుకుని, భుజంతో నారి లాగి శరం సంధించి రాకేశ్ కుమార్‌తో కలిసి కాంస్యం సాధించింది. కరెంట్ షాక్‌తో తొమ్మిదేండ్లకే చూపు కోల్పోయిన కపిల్ పర్మార్ అంధుల జూడోలో మూడోస్థానంలో నిలిచి, ఈ విభాగంలో దేశానికి తొలి మెడల్ అందించాడు. అవమానాల కొలిమిలో రాటుదేలిన ప్రీతి పాల్ పరుగుల పోటీలో రెండు కాంస్య పతకాలను దేశానికి అందించింది. తెలంగాణ కీర్తిని ప్రపంచానికి చాటిన అథ్లెట్ జీవాంజి దీప్తి సైతం కాంస్యంతో మెరిసింది. పారాఅథ్లెట్లలో ఒక్కొక్కరిదీ ఒక్కో కన్నీటిగాథ... కానీ, వారెవరూ విధికి తలవంచలేదు. జీవితంలో గెలిచేందుకు కావాల్సినవి లక్ష్యంపై గురి, సాధన, మొక్కవోని స్థైర్యం అని తమ చేతలతో చాటిచెప్పారు. చిన్నతనంలోనే పోలియో కోరల్లో చిక్కినా, ఎదిగిన వయసులో తీవ్ర ప్రమాదాలకు గురై వైకల్యం పాలైనా చెక్కుచెదరని ఆత్మస్థైర్యంతో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన విజేతల అపూర్వగాథలన్నీ భావితరాలకు అద్వితీయ పాఠాలు.

'వికలాంగుల కోసం అమలు చేస్తున్న పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయి. తనిఖీ చేస్తే భయంకర వాస్తవాలు నిగ్గుతేలతాయి' అని తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యానించి ఏండ్లు గడుస్తున్నా... పరిస్థితి అంతే సంక్లిష్టంగా కొనసాగుతూనే ఉంది. సంఘటిత, అసంఘటిత రంగాల్లో వారికి ప్రోత్సాహం అంతంతమాత్రమే, స్వయంఉపాధికి ప్రభుత్వ పథకాలు సైతం వారికి అక్కరకురావడం లేదన్నది వాస్తవం. రాజ్యాంగం వికలాంగులకు అనేక హక్కులు కల్పించింది. కానీ క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడంలేదు. ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ తదితర దేశాలు సరికొత్త విధానాలతో వారికి ఆలంభనగా నిలుస్తుంటే.. మాట్లాడితే ఆయా దేశాలతో పోల్చుకుంటూ దేశ, రాష్ట్రాల రూపురేఖలే మార్చేస్తాం అని చెప్పుకునే మన నేతలకు.. దుర్భర స్థితిలో ఉన్న వికలాంగుల హక్కులు హరించబడ్డ విషయాలు కనబడవు. విద్య, ఉపాధుల్లో వారికి అవరోధంగా ఉన్న వ్యవస్థలకు చరమగీతం పాడాలి. పారాలింపిక్స్ వంటి ప్రతిష్టాత్మక క్రీడల్లో పోటీపడటానికి అవరోధాలుగా ఉన్న మౌలిక సదుపాయాలు, నిధులు కొరతను అధిగమించే ఏర్పాట్లు చేసి తమ కమిట్‌మెంట్‌ను చూపించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా అంతర్జాతీయ యవనికపై భారతీయ క్రీడా స్ఫూర్తిని చాటే దిశగా అడుగులేస్తాయని ఆశిద్దాం.

సంఘ చైతన్య స్ఫూర్తి - వీరనారి ఐలమ్మ కీర్తి



అనంగారి భాస్కర్
9010502255

ఆత్మ గౌరవం
ధిక్కార స్వరం
తిరుగుబాటు పతాకం...

ధీశాలి చిట్యాల ఐలమ్మ గురించి మూడు ముక్కల్లో చెప్పాలంటే సరిగ్గా సరిపోయే మాటలు.

సంఘ చేతనం...
ఐక్య సమరం..
సుస్పష్ట లక్ష్యం... పాలకుర్తి గురించి ప్రస్తావించాలంటే మదిపలికే పదాలివి.


ఇలా... ఐలమ్మ సాహసాన్ని - పాలకుర్తి ప్రస్థానాన్ని విడివిడిగా చూడటం సాధ్యం కాదు.

తెలంగాణ పేరును చరిత్రపుటల్లో శిలాక్షరాలుగా మార్చిన వీరతెలంగాణ సాయుధ సమరానికి సంఘ రూపం ఇచ్చిన... తొలి అడుగు జాడలు పాలకుర్తిలోనే పడ్డాయంటే ఆశ్చర్యం లేదు. అలాంటి పోరాటంలో ఒక మహిళ ధృవతారగా వెలిగిందనేది అతిశయోక్తి కాదు.

చింతల చెరువు జాడలు.. నల్ల తుమ్మల నీడలు.. ఎత్తైన గడి గోడలు. విస్నూరులో నేడు కనిపించె దృశ్యాలు ఇవే. కానీ... అక్కడి జాగీర్దారు అరచకాలు, నాటి భుస్వామ్య పెత్తందారుల అకృత్యాలన్నిటికి ప్రత్యక్ష సాక్షి. అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలకుర్తికి కేవలం ఈ ప్రత్యేకత మాత్రమే ఉంటే దొరగీసిన గీతల్లోనే ఉండేదేమో ఈ గ్రామం. కానీ పదిహేనవ శతాబ్దంలోనే ప్రజాకవిగా పేరెళ్లిన పోతన ఊరు "బమ్మెర" సైతం ఇక్కడికి కేవలం 3కిలోమీటర్ల దూరంలోనే ఉండటం, కాకతీయుల యుగంలోనే గొప్ప విప్లవకవిగా వర్ధిల్లిన పాలకురికి సోమనాధుని జన్మస్థలం కావడంవల్ల కాబోలు... ఇక్కడి ప్రజల్లో సహజంగానే అన్యాయంపై తిరుగుబాటుతత్వం ఉందేమో. కాకుంటే... అరవై ఊర్లను శాశించే దొరకు కూత పెట్టు దూరంలో ఉండి, ఆచారాలు, కట్టుబాట్ల చట్రంలో కుమిలే సమయాన ఓ మహిళగా ఉండి, అర్ధాకలికి చిరునామాగా తోచే చాకలి కులంలో, పేదతనంలో ఉన్న వ్యక్తి ఐలమ్మ.... అగ్ని కణంలా లేచి, సంఘమై నిలవడం సాధారణ విషయం అసలేకాదు.

> విస్నూరు దొర ఏలుబడిలోనే ఉన్న మల్లపల్లి ముఖ్తేదారు కొండల్‌రావుకు చెందిన, ఊరి చెరువుకింది భూమినే ఐలమ్మ కుటుంబం కౌలు చేసుకుంటూ జీవిస్తోంది.వెట్టిచాకిరి, దొరలు, నిజాం అరాచకాలకు వ్యతిరేకంగా ఆంధ్రమహాసభ కార్యక్రమాలు విస్తరిస్తున్న కాలమది. 1944లో భువనగిరిలో జరిగిన సంఘం మహాసభల పిలుపుతోఉత్సహం పొందిన పల్లెలు సంఘం నీడన సంఘటితమవుతున్నాయి. ఈ క్రమంలోనే పాలకుర్తిలోను ప్రజలు ఒక్కటి కాసాగారు. జీడి సోమయ్య నేతృత్వంలో ఆంధ్రమహాసభ శాఖ ఏర్పడింది. భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభకు సైతం అయన హాజరయ్యారు. సంఘం అండతో నిరక్షరాస్యులు చైతన్యవంతుయ్యారు. ఐలమ్మ తన ఇంటినే సంఘ కార్యక్రమాల కోసం ఇచ్చింది.

విస్నూరు దొర ఏలుబడిలోనే ఉన్న మల్లపల్లి ముఖ్తేదారు కొండల్‌రావుకు చెందిన, ఊరి చెరువుకింది భూమినే ఐలమ్మ కుటుంబం కౌలు చేసుకుంటూ జీవిస్తోంది.వెట్టిచాకిరి, దొరలు, నిజాం అరాచకాలకు వ్యతిరేకంగా ఆంధ్రమహాసభ కార్యక్రమాలు విస్తరిస్తున్న కాలమది. 1944లో భువనగిరిలో జరిగిన సంఘం మహాసభల పిలుపుతోఉత్సహం పొందిన పల్లెలు సంఘం నీడన సంఘటిత మవుతున్నాయి. ఈ క్రమంలోనే పాలకుర్తిలోను ప్రజలు ఒక్కటి కాసాగారు. జీడి సోమయ్య నేతృత్వంలో ఆంధ్రమహాసభ శాఖ ఏర్పడింది. భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభకు సైతం అయన హాజరయ్యారు. సంఘం అండతో నిరక్షరాస్యులు చైతన్యవంతుయ్యారు. ఐలమ్మ తన ఇంటినే సంఘ కార్యక్రమాల కోసం ఇచ్చింది.



ఈ జన చైతన్యాన్ని దెబ్బకొట్టకపోతె... ముప్పని భావించిన దొరలు... కొత్త ఎత్తులు వేయసాగారు. చాకలివృత్తి వద్దనుకుని ఆత్మగౌరవంతో బతకాలని భావించే చిట్యాల ఐలమ్మ, నర్సయ్య దంపతులతో పాటు, కొందరు దళితులు, దూదేకుల ఖాసీంలు ఏండ్లుగా సాగుచేసుకున్న భూమిని స్థానిక పూజారి వెంకట రమణకు ఇనంగా రాసిచ్చే కుట్ర చేశారు దొరలు. వెంటనే విషయం తెలుసుకున్న జనం... ఇది సరైన పద్ధతి కాదని పూజారిని హెచ్చరించగా... భూస్వాముల అండతో... స్థానిక పోలీస్ పటేల్ శేషగిరిరావు గుండాలను దింపి సంఘం కార్యలయంపై దాడికి యత్నించారు. ప్రతివ్యూహంతో సిద్ధమైన సంఘం సభ్యులు.... వడిసెలు, రాళ్లతో సమరానికి సై అనగా... గుండెలు జారిన గుండాలు పారిపోయారు. ఈ జనచైతన్యం సెగ విస్నూరు గడిని తాకింది. అణుచరులపై గుర్రుమన్న... దేశ్‌ముఖ్ రామచెంద్రారెడ్డి... స్వయంగా రంగంలోకి దిగాడు. ఐలమ్మ, ఇతర పేదలు సాగు చేసుకునే భూమిలో కోతకొచ్చిన పంటను కోసుకురమ్మని తన మనుషులను పంపాడు. ఈ కుట్రలన్నిటిని ఎదుర్కొనేందుకు సిద్ధమై ఉన్న సంఘం నేతలు... ప్రజాదండును కూడగట్టారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంతంలో పోరాటానికి నేతృత్వం వహించిన యోధుడు ఆభీరెడ్డి నర్సింహ్మారెడ్డి, చకిలం యాదగిరిరావు వంటి నేతలు స్వయంగా పాల్గొని ప్రజలకు ధైర్యాన్నిచ్చారు. దొర మనుషులను తన్ని తరిమారు. పంటను కాపాడి పేదల ఇళ్లకే చేర్చారు. మరో ఓటమితో కక్కలేని, మింగలేని పరిస్థితిలో పడ్డ విస్నూర్ దేశ్‌ముఖ్... నైజాం సాయంకోరి పోలీసుల్ని రంగంలోకి దింపారు. సంఘ నాయకుల్ని అడ్డుకున్న పోలీసులు కొంత ధాన్యాన్ని జప్తుచేయగా... అది తనశ్రమ ఫలితమేనని ధైర్యంగా ముందుకొచ్చింది ఐలమ్మ. ఈ ఘటనను సాకుగా చూపి సంఘనేతలపై దొమ్మీ సహా అనేక కేసులు పెట్టి.. సంఘం నేతలు భీంరెడ్డి, శ్రీనివాసరావు, ఐలమ్మ భర్త, కొడుకుతో సహా పలువురిని జైలుకు పంపి చిత్రహింసలకు గురిచేశారు.

ఇలా.... పాలకుర్తి పోరాటకేంద్రంగా మారిన నేపథ్యంలో... అనేకసార్లు భూస్వాములు చేయించిన దాడుల్లో... కుమ్మరి లక్ష్మీనర్సు, కన్నెబోయిన సోవయ్య, కొత్త శ్రీహరి వంటి వారు అమరులు కాగా... జీడం సోమయ్య వంటి సంఘ సభ్యుల్ని గడ్డివాములో వేసి సజీవంగా కాల్చి చంపిన దుర్మార్గాలు చోటు చేసుకున్నాయి.

దాడులు, హత్యలు.... కేసులు..... దొరలెన్ని వేషాలేసిన.... జన చైతన్యం పెరిగిందే తప్ప ఏమాత్రం తగ్గలేదు. ఎర్రజెండ అండ ఉండటంతో... దొరల కుట్రలకూ తలొగ్గలేదు. సంఘమై, రణరంగానికి ఎప్పుడైనా సిద్ధమే అని నిలిచిన పాలకుర్తి ... పలు గ్రామాలకు వెలుగు దారిచూపిన కేంద్రమైంది. స్వాతంత్ర్యానంతరమూ ఆ చైతన్యం కొనసాగింది. ఎన్నికల సమయంలోనూ సత్తా చాటిన సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో... రెండు దశాబ్దాలపాటు అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచింది పాలకుర్తి. ప్రభుత్వంచే ఏడెనిమిదిసార్లు ఉత్తమ గ్రామ పంచాయతీగా గుర్తించబడటమే....అందుకు ఉదాహరణ. ప్రస్తుత రాజకీయ సమీకరణాలు మారినా.... పోరు జెండానింపిన చైతన్యం ఆ గ్రామంలో నేటికి సజీవంగానే ఉంది.

చెమట మాది....
చేను మాది....
పంట మాది...
ఫలం మాది...
మా బతుకులపై మీ పెత్తనమేందీ!

అని దోపిడీ దొరలకు ఎదురు తిరిగి వీరవనితగా నిలిచిన మన ఐలమ్మ

మన పాలకుర్తి గడ్డ వీర తెలంగాణ పోరులో రాలని మోదుగుపూల కొమ్మ.వీరనారి ఐలమ్మ కీర్తి

(నేడు ఐలమ్మ 39వ వర్ధంతి)

> ఈ జనచైతన్యం సెగ విస్నూరు గడిని తాకింది. అణుచరులపై గుర్రుమన్న... దేశ్‌ముఖ్ రామచెంద్రారెడ్డి... స్వయంగా రంగంలోకి దిగాడు. ఐలమ్మ, ఇతర పేదలు సాగు చేసుకునే భూమిలో కోతకొచ్చిన పంటను కోసుకురమ్మని తన మనుషులను పంపాడు. ఈ కుట్రలన్నిటిని ఎదుర్కొనేందుకు సిద్ధమై ఉన్న సంఘం నేతలు... ప్రజాదండును కూడగట్టారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంతంలో పోరాటానికి నేతృత్వం వహించిన యోధుడు ఆభీరెడ్డి నర్సింహ్మారెడ్డి, చకిలం యాదగిరిరావు వంటి నేతలు స్వయంగా పాల్గొని ప్రజలకు ధైర్యాన్నిచ్చారు. దొర మనుషులను తన్ని తరిమారు. పంటను కాపాడి పేదల ఇళ్లకే చేర్చారు.

అస్సాం ముఖ్యమంత్రిని తొలగించాలి

అస్సాంలో పరిస్థితి ఎప్పటికప్పుడు దిగజారిపోతున్నది. కొన్ని వర్గాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలూ, ప్రజలను మత ప్రాతిపదికన దురభిమాన తరహాలో విభజించేందుకు కొన్ని ధోరణులూ ఇందుకు కారణమవుతున్నాయి. ప్రస్తుత ఈ పరిస్థితులకు ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం మాత్రమే పూర్తి బాధ్యత వహించవలసి వుంటుంది. ముస్లింలపై విద్వేషం పెంచే తన తన ప్రచారకాండలో హిమంత బిశ్వశర్మ అన్ని హద్దులూ దాటేశారు. దేశీయకు వ్యతిరేకంగా బయటివారు అనే తన విభజన రాగం లోనూ ఆయన హద్దు మీరారు. మతపరమైన మైనార్టీలను బయటి వారు అంటూ ముద్ర వేస్తూ వారిపైన ఏదో ఒక విశఅంఖల ఆరోపణ చేయకుండా ఒక్క రోజు కూడా గడవడం లేదు. ఆయన పనిగట్టుకుని చేస్తున్న విభజన రాజకీయ ప్రసం గాల చిచ్చు ప్రజల్లో కొన్ని తరగతుల ప్రజలను రెచ్చగొడుతున్నది. మైనారిటీలకు వ్యతిరేకంగా హింసాత్మక వాతావర ణానికి దారి తీస్తున్నది. లైంగిక పరమైన దాడులకు సంబంధించిన రెండు కేసులలో వ్యవహరించిన తీరు ఇందుకు నిదర్శనం గా వుంది.

శివసాగర్ పట్టణంలో మార్వారీ వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పదిహేడేళ్ల అమ్మాయిపై చేసిన దాడి ప్రజ్వలనకు దారితీసింది. బయటివారిపై కొన్ని సంస్థలు బెదిరింపులకు



PEOPLE'S DEMOCRACY

పాల్పడ్డాయి. నేరస్తులపై చర్య తీసుకోవాలని కోరడానికి బదులు మొత్తం మార్వారీ వర్గాన్ని ఈ నేరానికి బాధ్యులైనట్టు నిందాప్రచారం సాగింది. ఎగువ అస్సాంలో అస్సామీ యేతర వ్యాపార వర్గం మొత్తానికి వ్యతిరేకంగా పెద్ద నిసనగా మారింది. చివరకు శివనగర్‌లో ఆ వర్గం ప్రతినిధులు రాష్ట్ర కేబినెట్ మంత్రి, పోలీసు సూపరిండెంటు సమక్షంలో మోకాళ్లపై వంగి క్షమాపణలు చెప్పాలని ఒత్తిడి చేసి చెప్పించే పరిస్థితికిది దారి తీసింది. నాగాన్ జిల్లాలో ముగ్గురు ముస్లిం యువకులు పద్నాలుగేళ్ల మైనర్ బాలికపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఘటన ఇంతకన్నా తీవ్రమైన పరిస్థితికి దారితీసింది. దీనిపై నిరసనను తూర్పు బెంగాల్ కు చెందిన ముస్లింలు అందరిపైకి మళ్లించి వారిని మియాలు అంటూ అవమానించారు. ఆరెస్సెస్, బీజేపీలకు చెందిన కొన్ని సంస్థలు మియాలకు బెదిరింపులు జారీ చేస్తూ అస్సాం వదిలి పొమ్మని భయపెడుతున్నాయి. మియా వర్గానికి చెందిన నిర్మాణ కార్మికులను విచక్షణా రహితంగా కొట్టిన ఘటన తర్వాత బెంగాలీ మాట్లాడే ముస్లింలు వేలాదిమంది ఎగువ అస్సాం నుంచి పారిపోయే పరిస్థితి ఏర్పడింది.

ఒకవైపునే ముఖ్యమంత్రి

ఈ విషయంలో తాను ఒక వైపునే వుంటాననీ, మియాలు అస్సాంను స్వాధీనం చేసుకోవడాన్ని అనుమతించబోననీ ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ శాసనసభలో ప్రకటించారు. అన్ని రంగాల్లో విఫలమైన తన ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసం ఆయన పూర్తి స్థాయిలో ముస్లిం వ్యతిరేక ప్రచారానికి దిగారు. మహిళల రక్షణలో ఘోరంగా విఫలమవడంతో ఘోరమైన లైంగికదాడులు, హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయి. ఆరు వెనకబడిన తరతులకు ఎస్టీ ప్రతిపత్తి కల్పించాలనే కోర్కె అపరిష్కృతంగానే వుండిపోయింది. భూమిని కాపాడాలనీ, 1971 నుంచి దశాబ్దాలుగా అస్సాంలో వుంటున్న భూమి లేని ప్రజలకు భూ పంపిణీ చేయాలనే డిమాండు కూడా పూర్తిగా ఉపేక్షించబడింది. వరదలు, భూమి కోత సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చిటికెన వేలు కదిల్చింది లేదు. నిరుద్యోగం ఎప్పటికప్పుడు పెరుగుతూ పోతున్నది. శర్మ, ఆయన సర్కారు పచ్చి మతతత్వ ప్రచారం ప్రారంభించడానికి ఇదే నేపథ్యం. సరిగ్గా ఇదే. మహిళలపై లైంగికదాడులతో సహా ఈ నేరాల విజృంభణకు అన్ని మతాల వారున్నప్పటికీ ముస్లింలపై మాత్రమే నేరస్తులుగా ముద్ర వేసి నిందించడం జరుగుతున్నది. రాజధాని గౌహతిలో కఅత్రిమమైన వరదల సమస్యను కప్పిపుచ్చడం కోసం వరద జిహాద్ నినాదాన్ని కనిపెట్టింది కూడా హిమంత శర్మనే.

18 ప్రతిపక్షాల విజ్ఞప్తి

ముఖ్యమంత్రి పదవి నిర్వహించడానికి సంబంధించిన రాజ్యాంగ ప్రమాణాలన్నిటినీ హిమంత శర్మ ఉల్లంఘించారు. "ఎలాంటి భయం, పక్షపాతం, ప్రేమ, వ్యతిరేకత లేకుండా రాజ్యాంగం, చట్ట నిబంధనల మేరకు ప్రజలకు అన్ని విధాల న్యాయం చేస్తాన"ని ముఖ్యమంత్రిగా ఆయన చేసిన ప్రమాణాన్ని బాహాటంగా ఉల్లంఘించారు. శాసనసభ లోపలా వెలుపలా ముఖ్యమంత్రి ఉవాచలు ఈ అధికార ప్రమాణాన్ని వమ్ము చేసేలా వున్నాయి. రాజకీయ రాజ్యాంగ నైతికతను ఆయన అవమానకరమైన రీతిలో తొక్కిపారేశారు.అందువల్లనే ముఖ్యమంత్రి హిమం త బిశ్వశర్మను పదవి నుంచి తొలగించవలసిందిగా కోరుతూ 18 ప్రతిపక్ష పార్టీలు ఆగష్టు 29న అస్సాం గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి ఒక మెమోరాండం సమర్పించాయి. మత విద్వేషాన్ని వ్యాపింప చేస్తున్నందుకు, రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తున్నందుకు ఆయనను డిస్మిస్ చేయాలని ఆమెను కోరాయి. పదవీ ప్రమాణాన్ని రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఒక ముఖ్యమంత్రిపై చర్య తీసుకోదగిన సందర్భమంటూ ఏదైనా వుందంటే ఇంతకన్నా మరొకటి వుండబోదు.

(సెప్టెంబరు 4 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

సోషలిజం వైపు.. ఆస్ట్రేలియా యువత చూపు..

అక్కడేమీ ప్రభావితం చేసే విధంగా కమ్యూనిస్టు పార్టీ లేదు, పురోగామి ఉద్యమాలూ లేవు. వాటి పట్ల వ్యతిరేకత ఉన్న పాలకవర్గం, మీడియాదే ఆధిపత్యం. కమ్యూనిస్టులు కూడా కొన్ని పత్రికలు, వెబ్‌సైట్లు నడుపుతున్నప్పటికీ వాటి ప్రభావం పరిమితమే. అయినా ఆస్ట్రేలియాలో యువత సోషలిజం పట్ల సానుకూలత చూపుతున్నట్లు తాజా సర్వే వెల్లడించింది. అభివఅద్ధి చెందినట్లు చెబుతున్న దేశాలన్నింటా జనం ప్రత్యేకించి యువత పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల విముఖత చూపుతున్నారు. 2024 జూన్ 24న 'యుగవ్' అనే సంస్థ ఆస్ట్రేలియాలో జరిపిన సర్వేలో 18-24 ఏళ్ల మధ్య యువతలో 53 శాతం మంది సోషలిజం పట్ల సానుకూలత చూపగా తటస్తంగా 25 శాతం, పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుకూలత వెల్లడించిన వారు 22 శాతం ఉన్నట్లు తేలింది. అదే మొత్తం అన్ని వయసుల వారిలో అలాంటి అభిప్రాయాలు వెల్లడించినవారు 27-42-31 శాతాల చొప్పున ఉన్నారు. 2019 అక్టోబరులో 'యుగవ్' ప్రశ్నలకు 28 శాతం మంది ఆస్ట్రేలియన్లు తమకు సోషలిజం అంటే ఏమిటో తెలియదని చెప్పగా 13 శాతం మంది ఆ వ్యవస్థ కలుపుగోలుతనంతో ఉంటుందని చెప్పారు. సోషలిజాన్ని నిర్వచించమని అడిగిన ప్రశ్నకు అమెరికా యువత 60 శాతం మంది సరైన సమాధానం చెప్పగా ఆస్ట్రేలియన్లు 30 శాతమే ఉన్నారు. అలాంటి యువత 2024లో 53 శాతం మంది సానుకూలత చూపటాన్ని గమనించాలి. దీని అర్ధం వారందరికీ సోషలిజం అంటే పూర్తిగా తెలిసిందని కాదు. సోషలిజం అంటేనే అణచివేత అని భావించిన స్థితి నుంచి బయటపడి "సోషలిజం" తాము జీవిస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థకంటే మెరుగ్గా ఉంటుందనే అభిప్రాయం ఏర్పరుచుకోవటాన్ని ఇక్కడ గమనించాల్సిన, ఆహ్వానించాల్సిన అంశంగా చూడాలి. వీరి శాతం ఏటేటా పెరుగుతున్నది. 'యుగవ్' 2019 అక్టోబరులో "కమ్యూనిజం బాధితులు" పేరుతో ఏర్పడిన ఒక సంస్థ తరపున అమెరికా, ఆస్ట్రేలియాల్లో సర్వే చేసింది. యువతలో సోషలిజం అంటే సమ్మతి లేదా ఆదరణ పెరుగుతున్నదని ఆ సర్వేలో తేలినట్లు ప్రకటించింది.ఇదంతా ఎప్పుడు? సోషలిజంలో అణచి వేస్తారు, భావ ప్రకటన స్వేచ్ఛ ఉండదు, భవిష్యత్ లేదు, అది విఫలమైంది అని ప్రచారం పెద్ద ఎత్తున జరుపుతున్న తరుణంలోనే అన్నది గమనించాలి. ప్రచ్ఛన్న యుద్ధం పేరుతో కమ్యూనిస్టు వ్యతిరేకతను పెద్ద ఎత్తున రెచ్చగొట్టిన పరిణామాలను చూసిన పాత తరం వారిలో ఉన్న వ్యతిరేకభావం యువతరంలో లేదని ఆ సర్వేలో తేలింది.ఇప్పుడు కమ్యూనిజానికి వ్యతిరేకంగా తక్కువ ప్రచారం జరుగుతోందా? కానే కాదు, ఏ మాత్రం తగ్గలేదు.



> ఒకవైపు అమెరికాలో కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం ఇప్పటికీ పెద్ద ఎత్తున కొనసాగుతూనే ఉంది. అయితే అక్కడ దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులు యువతను ఆలోచింపచేస్తున్నాయి. కమ్యూనిజం, సోషలిజం గురించి వక్రీకరణలు కొనసాగుతున్నప్పటికీ టీచర్లు బోధిస్తున్న అంశాలలో డెన్మార్క్, నార్వే వంటి చోట్ల స్కాండినేవియన్ సోషలిజం గురించి చెబుతున్న అంశాలు వారిని ఆకర్షిస్తున్నట్లు కొందరు చెబుతున్నారు. అమెరికా కంటే అక్కడి పరిస్థితి మెరుగ్గా ఉన్నందున అలాంటి సోషలిజాన్ని ఎందుకు అమలు చేయకూడదనే ప్రశ్నకు సరైన సమాధానం వారికి దొరకటం లేదు.

తాజా సర్వే జరిగిన నేపథ్యాన్ని చూస్తే అనేక దేశాల్లో యువత సోషలిజం గురించి అధ్యయనం చేయటంతో పాటు నయా ఫాసిస్టు, మితవాద శక్తులు తమ సమస్యలకు పరిష్కారం చూపగలవేమో అన్న భ్రమలతో అటువైపు కూడా మొగ్గుతున్నారు. ఫ్రాన్సులో, తాజాగా జర్మనీలోని తూర్పు ప్రాంతంలో జరిగిన ఒక రాష్ట్ర ఎన్నికల్లో పచ్చి మితవాదులు పెద్ద పార్టీగా అవతరించారు. జీవన ఖర్చు పెరగటం, గఅహ సంక్షోభం ఆస్ట్రేలియన్ యువతను సోషలిజం గురించి ఆలోచింప చేస్తున్నదని తేలింది. జనాభాలో 18-34 ఏళ్ల వయస్సు వారిలో 41 శాతం మంది సోషలిజాన్ని సమర్ధించగా, 35కు పైబడిన వారిలో 21 శాతం మంది ఉన్నారు. అదే వయసులో ఉన్నవారు పెట్టుబడిదారీ విధానాన్ని 34 శాతమే సమర్థించినట్లు విశ్లేషణలో తేలింది. యువత సోషలిజం వైపు ఎందుకు మొగ్గుతున్నారన్న ప్రశ్నకు యుగవ్ డైరెక్టర్ పాల్ స్మిత్ మాట్లాడుతూ యువతరం ఎంతో భిన్నమైన ఆర్థిక పరిస్థితిని చవిచూస్తున్నారని, 2008 ద్రవ్య సంక్షోభం తరువాత శ్రామికశక్తిలో చేరిన యువత అసంతృప్తికి లోనై సోషలిజం వైపు మొగ్గుతున్నట్లు చెప్పాడు. పెద్ద తరాలు మంచివేతనాలతో కూడిన జీవితాలను గడపగా యువతకు అలాంటి హామీ లేదని, విద్య, గృహాలకు ఎక్కువగా చెల్లిస్తున్నారని అన్నాడు. ఒక స్థిరమైన ఉపాధి లేకపోవటం, తాత్కాలిక పనివారిని తీసుకొనే వాతావరణం ఎక్కువగా ఉండటంతో వారసత్వంగా వచ్చినవి ఉంటే తప్ప అద్దె ఇళ్లలో నివసించలేని స్థితి ఏర్పడింది. ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. గాజా వంటి చోట్ల జరుగుతున్న దారుణాలను సామాజిక మాధ్యమాల్లో చూస్తున్న వారు పెట్టుబడిదారీ విధానం యుద్ధాలను ప్రోత్సహిం చటం ఎందుకని ప్రశ్నలు సంధించటం పెరిగింది. ఆస్ట్రేలియాలో పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుకొనే వారు 64 శాతం మంది సోషలిజాన్ని అభిమానించగా, లేబర్ పార్టీ 31, సంకీర్ణ కూటమి మద్దతుదార్లలో కేవలం 12 శాతమే ఉన్నారు. కార్పొరేట్ల లాభాలకంటే జనం ప్రయోజనాలు, భూగోళాన్ని పరిరక్షించాలని కోరుకొనే వారు పెరుగు తున్నారు.

యువతలో ఎందుకీ మార్పు?

కమ్యూనిజం విఫలమైందని ప్రచారం జరిగిన చోటే పెట్టుబడిదారీ విఫలమైందని ఆ విధాన గట్టి సమర్ధకుడైన థామస్ పికెట్టి వంటి వారు సాధికారికంగా స్పష్టం చేసిన తరువాత యువత ఆలోచించకుండా ఎలా ఉంటుంది? సోషలిస్టు చైనా, వియత్నాం నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులనే నిత్యం వాడుతున్నపుడు ఆ వస్తువులను మన దేశంలో ఎందుకు తయారు చేసుకోలేకపోతున్నాం అని ఎక్కడికక్కడ యువత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు లేరు. 1995-2010 మధ్య జన్మించిన వారిని జడ్ తరం అని పిలుస్తు న్నారు. వీరిని సోషలిజం (ఆకర్షిస్తున్నదని) కవ్విస్తున్నదని కొందరు వర్ణించారు. ముఖ్యంగా అమెరికాలో ఈ ధోరణి కనిపిస్తోంది. అనేక మంది 'మేం సోషలిస్టులం' అంటూ గర్వంగా చెప్పుకుంటున్నారు. ఒకవైపు అమెరికాలో కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం ఇప్పటికీ పెద్ద ఎత్తున కొనసాగుతూనే ఉంది. అయితే అక్కడ దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులు యువతను ఆలోచింపచేస్తున్నాయి. కమ్యూనిజం, సోషలిజం గురించి వక్రీకరణలు కొనసాగుతున్నప్పటికీ టీచర్లు బోధిస్తున్న అంశాలలో డెన్మార్క్, నార్వే వంటి చోట్ల స్కాండినేవియన్ సోషలిజం గురించి చెబుతున్న అంశాలు వారిని ఆకర్షిస్తున్నట్లు కొందరు చెబుతున్నారు. అమెరికా కంటే అక్కడి పరిస్థితి మెరుగ్గా ఉన్నందున అలాంటి సోషలిజాన్ని ఎందుకు అమలు చేయకూడదనే ప్రశ్నకు సరైన సమాధానం వారికి దొరకటం లేదు. అయితే ఆ దేశాల్లో ఉన్న జనాభా మొత్తం కూడా అమె రికాలో ఒక రాష్ట్రంలో ఉన్నవారికి సమానమని. 30 కోట్ల మందికి సోషలిజాన్ని అమలు చేయటం, దీర్ఘకాలం కొనసాగించటం సాధ్యం కాదని మాత్రమే చెప్పటం వారికి సంతృప్తిని కలిగించటం లేదు. ఆయా దేశాల జీడీపీతో పోలిస్తే అమెరికా జీడీపీ ఎక్కువగా ఉన్నపుడు ఎందుకు సాధ్యం కాదు?

మొత్తం మీద చెప్పాలంటే సోషలిజం గురించి ఆసక్తి కనపరుస్తున్న యువతను దారి మళ్లించేందుకు అక్కడి కమ్యూనిస్టు వ్యతిరేకులు నానా పాట్లు పడుతున్నారు. వారి జీవితానుభవం నుంచే అలాంటి ఆసక్తి కలుగుతున్నదని సామాజిక మాధ్యమం, మీడియా తప్పుదారి పట్టిస్తున్నదని, వ్యక్తిగత స్వార్ధం యువతలో పెరిగిందని, దేశం ఏమైనా ఫర్వాలేదన్నట్లుగా తయారవుతున్నారని పెడబబ్బలు పెడుతున్నారు. దీనికి తమను తామే నిందించుకోవాలంటున్నారు.

అందరికీ ఆరోగ్య రక్షణ కావాలన్న డిమాండ్‌కు యువత మద్దతు ఇవ్వటానికి మేధావుల సైద్ధాంతిక బోధన కారణం కాదని, పెరుగుతున్న ఖర్చు, బీమా సౌకర్యం లేకపోవటమే అంటున్నారు.

అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేనట్లుగానే వాస్తవాలు, జీవిత అనుభవాల నుంచి పక్కదారి పట్టించాలంటే కుదరదు.అనేక దేశాల్లో ఇప్పుడు సోషలిజాన్ని యువత కోరుకోవటానికి పెట్టుబడిదారీ వ్యవస్థలలో వారి కలలు కల్లలు కావటమే కారణం. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారంతో జనాల బుర్రలు నిండటం తప్ప కడుపు నిండదని తేలిపోయింది.

- సత్య

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

టిజియస్ జిల్లా కార్యదర్శి భూక్య వీరభద్రం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మున్నేరు వరదల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం(టిజియస్) జిల్లా కార్యదర్శి భూక్య వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కస్నాతండా, వాల్యా తండా, తనగంపాడు, గుండాల తండా తదితర గ్రామాల్లోని రైతులను సమీకరించి తడిసిపోయిన వడ్లను కొనుగోలు చేయాలని కోరుతూ ఖమ్మంరూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భూక్య వీరభద్రం మాట్లాడారు. సర్వం కోల్పోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో ఇప్పటికే కలెక్టర్, అడిషినల్ కలెక్టర్‌తో మాట్లాడటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రాంప్రసాద్‌కు అందజేశారు. అడిషినల్ కలెక్టర్ ఆదేశాలతో తడిసిన ధాన్యాన్ని నష్టపరిహారం అంచనా వేసి నివేదిక ఉన్నతాధికారులకు అందించామని,



రైతులందరికీ ప్రభుత్వం ద్వారా తగిన స్థాయిలో నష్టపరిహారం అందించే విధంగా కృషి చేస్తానని తహశీల్దార్ రాంప్రసాద్ హామీనిచ్చారు. కార్యక్రమంలో అవిరేణి గురవయ్య, బాణోత్ రాజేశ్, అవిరేణి సీతారాములు, చిన్న గురవయ్య, వీరభద్రం, కిషన్, బాబురావు, సూర్య పాల్గొన్నారు.

'నా ఖమ్మం కోసం నేను'లో

సర్టిఫికెట్ల జారీకి చర్యలు : కలెక్టర్

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ -ఖమ్మం



ముంపు ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదల వల్ల సర్టిఫికెట్లు, విలువైన డాక్యుమెంట్లు పోగొట్టుకున్న వారికి 'నా ఖమ్మం కోసం నేను' కార్యక్రమంలో భాగంగా సర్టిఫికెట్ల జారీకి చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సర్టిఫికెట్ల జారీకి చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి భారీ వర్షాలు, వరదలతో సామాగ్రితో పాటు, సర్టిఫికెట్లు, పత్రాలు పోగొట్టుకున్న ముంపు ప్రాంతాల వారికి సర్టిఫికెట్ల, పత్రాల జారీకి పకడ్బందీ కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ నిమిత్తం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధి మినహాయించి, గ్రామీణ ప్రాంతాలు, సత్తుపల్లి, వైరా, మధిర పట్టణ ప్రాంతాల్లో 72 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు ముంపు ప్రాంతాల్లో పర్యటించి దరఖాస్తులు స్వీకరిస్తాయన్నారు. ఇంటి యజమాని నుండి దరఖాస్తుల స్వీకరణ భాగంగా, తమకు, తన పిల్లలకు సంబంధించిన సర్టిఫికెట్ల వివరాలు దరఖాస్తులో పొందుపర్చాలని ఆయన తెలిపారు. దరఖాస్తులో పొందుపరిచిన సర్టిఫికెట్ల వివరాల ఆధారంగా సంబంధిత శాఖల అధికారులతో సర్టిఫికెట్ల జారీకి చర్యలు చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. దరఖాస్తుల స్వీకరణ 10 రోజులపాటు చేపట్టనున్నట్లు తెలిపారు. ఏరోజుకారోజు సాయంత్రం శాఖల వారిగా క్రోడీకరించి, రిజిష్టర్‌లో నమోదులు చేయాలన్నారు. సర్వేలో మిస్సయిన దరఖాస్తుదారులకు సర్వే ప్రక్రియ ముగిశాక ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రెండో వారంలో సర్టిఫికెట్ల జారీకి చర్యలు చేపట్టబడునని, ఒక దరఖాస్తుదారునికి సంబంధించిన అన్ని సర్టిఫికెట్లను పొందిన మీదట, లామినేషన్ చేపట్టి, ఒక ఫోల్డర్‌లో దరఖాస్తుదారునికి తిరిగి ఇంటివద్దనే అందజేయనున్నట్లు ఆయన అన్నారు. సర్టిఫికెట్ల జారీకి మీ సేవ, ధరణి, ఇతరత్రా రుసుము, లామినేషన్ ఖర్చు అంతయు ప్రభుత్వమే చెల్లిస్తుందని, దరఖాస్తుదారునికి ఉచితంగా సర్టిఫికెట్లు అందజేస్తామని కలెక్టర్ అన్నారు. విదేశాల్లో అడ్మిషన్లు, ఉపాధి తదితర అత్యవసర అవసరాల ఉన్నవారు తమ హెల్ప్ లైన్ నెంబర్ టోల్ ఫ్రీ నెం. 1077కి సంప్రదించాలని, 9063211298 నెంబర్‌కి వాట్సాప్ ద్వారా అత్యవసరానికి సంబంధించి రుజువులు సమర్పించాలన్నారు. వారికి ప్రోవిజనల్ సర్టిఫికెట్లు వారంలో అందజేసేలా చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ అన్నారు. అత్యవసరమైన వారు, అత్యవసరానికి ఆధారాలు తప్పక సమర్పించాల్సి ఉంటుందన్నారు. పై సర్టిఫికెట్ల జారీ కేవలం ఇటీవలి భారీ వర్షాలు, వరదల వల్ల సర్టిఫికెట్లు, విలువైన డాక్యుమెంట్లు కోల్పోయిన ముంపు ప్రాంతాల వారికి మాత్రమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్. పి.శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా విద్యాధికారి సోమశేఖర శర్మ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవి బాబు, ఎల్డీఎం శ్రీనివాస రెడ్డి, ఈడీఎం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వరద బాధిత విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగులు ఇవ్వాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



వరద బాధిత విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌తో పాటు బ్యాగులు ప్రభుత్వమే విద్యాశాఖ ద్వారా అందించాలని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 31, సెప్టెంబర్ 1న వచ్చిన భారీ వర్షాలు, వరదలకు ఖమ్మం నగరంతోపాటు అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయన్నారు. 22 వేల కుటుంబాలకు పైగా వరద బారిన పడ్డాయన్నారు. ప్రాథమిక తరగతుల నుండి ఉన్నత విద్య వరకు చదువుతున్న విద్యార్థుల పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులు అన్నీ పూర్తిగా తడిసి బురదలో కలిసిపోయినాయన్నారు. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికపై విద్యార్థులకు వారు కోల్పోయిన వాటిని అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఇప్పటికే ఈ విషయమై జిల్లా అధికారుల దృష్టికి తెచ్చామన్నారు.

ఆర్టీసి కార్మికులకు సహాయం

ఖమ్మం నగరంలోని అకాల వర్షాల వలన ముంపునకు గురైన ఆర్టీసి కార్మికులకు పార్టీ జిల్లా కమిటీ నుండి 100 మందికి కిట్లు అందించడం జరిగింది. సోమవారం ఖమ్మం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనం నందు పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కార్మికులకు వరద సహాయక కిట్లు అందజేశారు. ఖమ్మం నగరంలో భారీ వర్షాలు వచ్చి వారం రోజులు దాటిపోతున్నా ఇంకా కాలనీలలో వరదమయంలో వున్నాయని, ఇళ్ళలో బురద, నీళ్ళతో వస్తువులు వున్నాయని, ప్రజలు అనేక అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్నారని, వారిని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయం అందించి ఆదుకోవాలని నున్నా కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రం, జిల్లా కమిటీ సభ్యులు తుమ్మ విష్ణు, ఎస్‌కె.బషీరుద్దీన్, నాయకులు వై.శ్రీనివాసరావు, నెల్లూరి వీరబాబు, ఎస్‌కె.అఫ్జల్, జె.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వాటర్ క్యాన్లు పంపిణీ



మున్నేరు వరద ముంపుకి గురైన సుందరయ్య నగర్ ఏరియా ప్రజలకు సోమవారం మిత్ర స్నేహ గ్రూప్ సంస్థ వారి సౌజన్యంతో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 100 వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. ఇంకా అనేక ప్రాంతాలలో పార్టీ ఆధ్వర్యంలో నిత్యావసర ఆహార వస్తువుల కిట్స్, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేసినట్టు, పార్టీ శక్తి మేరకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అన్నారు. ఈ ఆపద కాలంలో ముందుకొచ్చి వరద బాధితులకు అన్ని స్వచ్ఛంద సంస్థలు పెద్దలు ముందుకొచ్చి తమ వంతు కర్తవ్యంగా సహకరించటం అభినందనీయమన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాస్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు వజినేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

ఘనంగా సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



మైదాన ప్రాంత గిరిజనులకు ప్రత్యేక ఐటిడిఏ ఏర్పాటు చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నెహ్రూ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవాన్ని మండల పరిధిలోని పెద్దతండాలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నెహ్రూ సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం లంబాడిలకు రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. ఎటువంటి షరతులు లేకుండా గిరిజన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. రాష్ట్ర క్యాబినెట్లో లంబాడిలకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులకు స్కాలర్షిప్ తక్షణమే మంజూరు చేయాలన్నారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన గిరిజన రైతులకు పంట నష్టపరహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పృథ్వీరాజ్ రాథోడ్, నాయకులు మత్రు నాయక్, భద్ర నాయక్, సుశీలబాయి, విజయబాయి, రమేష్, రాజేందర్, నాగేందర్, రామ్మూర్తి, శ్రీకాంత్, సురేశ్ పాల్గొన్నారు.

వైరా ప్రభుత్వ కళాశాలలో ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-వైరాటౌన్



జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ ముజుముల్ ఖాన్ సోమవారం వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైరా చెరువు వరద పరిస్థితిని గమనించడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ వైరా చెరువు పరిశీలన అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ అభ్యర్థన మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల సందర్శించారు. శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను పరిశీలించారు. కళాశాల గ్రౌండ్‌లో ఉన్న వరద నీటిని పరిశీలించి వెంటనే నీటిని బయటకు పంపించే ఏర్పాటు చేయవలసిందిగా స్థానిక మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. అనంతరం కళాశాల సమస్యల్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ నవీన్ జ్యోతి జిల్లా కలెక్టర్ వివరించారు. కళాశాలలో విద్యార్థులు మంచినీరు తాగటానికి ఆర్‌ఓఆర్ ప్లాంట్ పనిచేయటం లేదని, అదే విధంగా తగినంత తరగతి గదులు లేవని వివరించారు. అసంపూర్ణంగా ఉన్న రెండు తరగతుల గదుల నిర్మాణాన్ని తొందరగా పూర్తి చేయించాలని కోరారు. కలెక్టర్ ముజుముల్ ఖాన్ వెంటనే స్పందిస్తూ తరగతి గదుల నిర్మాణం తొందరగా పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి రవి బాబుకు ఫోను ద్వారా ఆదేశించారు. అనంతరం కళాశాల విద్యార్థిని, విద్యార్థులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులందరూ మంచిగా చదువుకొని ఉత్తమ పౌరులుగా తయారు కావాలని విద్యార్థులకు సూచించారు. త్వరలో కళాశాలలో ఉన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



బాణాల పార్వతమ్మకి నివాళి

నవతెలంగాణ-వైరా

లింగన్నపాలెం సీపీఐ(ఎం) నాయకులు బాణాల శ్రీనివాసరావు, కృష్ణమాచారి మాతృమూర్తి పార్వతమ్మ వృద్ధాప్య సమస్యలతో ఆదివారం సాయంత్రం మరణించారు. పార్వతమ్మ మరణ వార్త తెలుసుకున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యవీరభద్రం, బొంతు రాంబాబు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, మాగంటి తిరుమలరావు, విప్పులమడక మాజీ సర్పంచులు మరియు పార్టీ సీనియర్ నాయకులు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్ పాపయ్య, మండల కమిటీ సభ్యులు షేక్ జానిమియా, రుద్రాక్షల వెంకటాచారి, తోటకూర బాబురావు, శాఖ సభ్యులు చెంగల తిరుపతమ్మ, సజ్జ నాగేశ్వరావు, గ్రామ మాజీ సర్పంచ్‌లు తోటకూర రామయ్య, బాణాల వెంకట్రావమ్మ, వెంకట రావమ్మ, జుంజునూరు కృష్ణ, షేక్ ఉద్దండ్ సాహెబ్, ఆర్ఎం పి.కారుమంచి సత్యనారాయణలు పార్వతమ్మ భౌతిక కాయంపై ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఆమె కుమారులు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు (సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు), నాగ బ్రహ్మాచారి, కృష్ణా చారి (సిపిఎం శాఖ కార్యదర్శి గరికపాడు సొసైటీ డైరెక్టర్)లకు సానుభూతి తెలిపారు.

జర్నలిస్ట్ సమ్మయ్య సేవలు మరువలేనివి

నవతెలంగాణ- ఖమ్మం



సీనియర్ జర్నలిస్ట్, వార్త ఖమ్మం కార్పొరేషన్ రిపోర్టర్ అబ్బుగాని సమ్మయ్య (48) సేవలు మరువలేనివని, ఆయన మరణం జర్నలిస్టు లోకానికి తీరనిలోటని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవిలు పేర్కొన్నారు. అనారోగ్య సమస్యతో సమ్మయ్య అకాల మరణం బాధాకరమన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ ఆధ్వర్యంలో ముస్తఫా నగర్‌లోని సమ్మయ్య నివాస గృహానికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనమైన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సమ్మయ్య కుటుంబ సభ్యులకు తక్షణ సాయంగా 12 వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కీ గోపి, ఉపాధ్యక్షులు ముత్యాల కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి మూల జీవన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు టిఎస్ చక్రవర్తి, పిన్ని సత్యనారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్, నాయకులు వెంకటకృష్ణ, సాయి, రవీందర్, లక్ష్మణ్, డెస్క్ జర్నలిస్టులు ప్రసాద్, శివ, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



వీరబాబు సంస్మరణ సభ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

గ్రామంలో సీపీఐ(ఎం) అభివృద్ధికి వీరబాబు మృతి తీరని లోటని పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య పేర్కొన్నారు. తొలుత పార్టీ నాయకులు వీరబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని గుంటుపల్లి, గోపవరం గ్రామంలో జరిగిన మందడపు వీరబాబు సంస్మరణ సభ మేడగాని తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వీరయ్య మాట్లాడుతూ వీరబాబు తుది శ్వాస విడిచే వరకు పార్టీ సిద్ధాంతాలకి కట్టుబడి నిరంతరం పార్టీ అభివృద్ధి కొరకు కృషి చేశాడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నల్లమోతు హనుమంతరావు, మందడపు ప్రభాకరరావు, తేనే రాజారావు, సామినేని హనుమంతరావు, కోట శ్రీనివాసరావు, అనుమోలు సాంబశివరావు, కోలా వెంకటనారాయణ, గొల్లపూడి నారాయణ, దివ్వెల వీరాంజనేయులు, షేక్ జానీ, యనమల వెంకటనారాయణ రెడ్డి, సుబ్బారావు, కోటేశ్వరరావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) విరాళాల సేకరణ

నవతెలంగాణ-మధిర

ఇటీవల భారీ వర్షాల కారణంగా ఖమ్మంలో చాలా ప్రాంతాలు పూర్తిగా నష్టపోయాయి. ఇలాంటి ప్రాంతాల్లో నివసించే వారి కోసం మధిర సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం వరద బాధితుల సహాయార్థం మధిర పట్టణంలో ఆర్థిక వస్తు సేకరణ విరాళాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శీలం. నరసింహారావు, మండవ ఫణీంద్ర కుమారి, రామ నరసయ్య మందా సైదులు, తెల్లబ్రోలు రాధకృష్ణ, పడకండి మురళి, మద్దాల ప్రభాకర్, మధు, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు బస్ పాస్ మేళా

నవతెలంగాణ-ఎర్రుపాలెం



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సౌజన్యంతో వికలాంగులకు బస్ పాస్ మేళా నిర్వహించారు. ఇనగాలి గ్రామ పంచాయతీ కార్యాలయం నందు దివ్యాంగులకు గ్రామ పంచాయతీ సెక్రెటరీ రాజ్యలక్ష్మి, మండల దివ్యాంగుల అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దివ్యాంగులకు బస్సు పాస్ క్యాంపును సోమవారం నిర్వహించారు. 20 మంది దివ్యాంగులకు 50% రాయితీతో కూడిన బస్ పాసులను అందించారు. మంగళవారం మండల పరిధిలోని సఖీనవీడు గ్రామపంచాయతీ నందు దివ్యాంగులకు బస్ పాస్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు .

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ - బోనకల్



నారాయణపురం గ్రామానికి చెందిన పలువురికి సిఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు సూర్యదేవుడు సుధాకర్‌బాబు, పత్తినేని తిరుపతయ్య సోమవారం నారాయణపురం గ్రామంలో అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి కృషితో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్ సహకారంతో నారాయణపురం గ్రామంలో కట్టా నాగమ్మ రూ.27వేలు, చెన్నా లక్ష్మి రూ.27వేలు, మారుతి రామకోటమ్మ రూ.17వేలు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు అయింది. ఇందుకు సంబంధించిన చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నారాయణపురం నాయకులు పాల్గొన్నారు. అనంతరం మల్లు భట్టి విక్రమార్క క్యాలెండర్లను వచ్చిన వారందరికీ అందజేశారు. అదేవిధంగా ఇంటింటికి వెళ్లి క్యాలెండర్లను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.

'క్రాంతి'లో కాళోజీ జయంతి వేడుకలు

నవతెలంగాణ-వైరాటౌన్



స్థానిక క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాళోజి చిత్రపటానికి విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ భాషలోని యాసను, మాధుర్యాన్ని, తన రచనల్లో పొందుపరిచి తెలంగాణ వానిని ఎలుగెత్తి చాటిన ప్రజాకవి, ప్రజల మనిషి, చైతన్య మూర్తి కాళోజీ నారాయణరావని, బతుకు తప్పదు, బతకక తప్పదు అన్న గొప్ప సందేశం కాళోజీ నారాయణరావు ఇచ్చారని, పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిదే అంటూ ఆయన జీవితకాలమంతా ప్రజా ఉద్యమాలకు ధారపోసిన మహా మనిషని, అన్యాయాన్ని ఎదిరించిన కాళోజీ కలము నుండి జాలువారిన ప్రతి అక్షరం ఒక్కొక్క తూటాల భావితరాలకు పోరాట స్ఫూర్తిని నింపిన నిరసన కెరటం కాలోజీ అని, ఆయన భాషకు, తెలంగాణ సాహిత్యానికి చేసినటువంటి సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవటం గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ప్రిన్సిపల్ కృష్ణారావు, ఎన్ఎస్ఎస్, పిఓ లింగారావు, అధ్యాపకులు మజీద్, వేణు, చైతన్య, నాగలక్ష్మి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేయాలి

పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ-నేలకొండపల్లి



రైతు రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేయాలని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అన్నారు. సోమవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో మాజీ ఎంపీటీసీ శీలం వెంకటలక్ష్మి మనమరాలు జగదీశ్వరి ఓణీల ఫంక్షన్‌కు ఆయన హాజరయ్యారు. జగదీశ్వరికి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, మాజీ ఎంపీటీసీ శీలం వెంకటలక్ష్మి, నాయకులు పైనంపల్లి సొసైటీ చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు, కోటి సైదారెడ్డి, మరికంటి రేణుబాబు, చెరువు నరసింహారావు, గొలుసు రవి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు నష్టపోయిన బాధితులను ఆదుకోవాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్

నవతెలంగాణ- ఖమ్మం



అకాల వర్షాలకు నష్టపోయిన వరద బాధితులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో పార్టీ ఖమ్మం టూ టౌన్ కమిటీ సమావేశం మాజీ కౌన్సిలర్ నర్రా రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరదలు నగరాన్ని ముంచెత్తాయని తెలిపారు. నగరంతో సహా జిల్లాలో సుమారు పదివేల కుటుంబాలు నష్టపోయాయని, నగరంలో వేలాదిమంది గృహాలు పూర్తిగా మునిగిపోయి కట్టు బట్టలతో మిగిలారన్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో పంటలు దెబ్బతిన్నాయని, సర్వం కోల్పోయిన ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచి వారిని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పూర్తిగా మునిగి దెబ్బతిన్న గృహాలకు మూడు లక్షల పరిహారం ఇవ్వాలని, పాక్షికంగా దెబ్బతిన్న గృహాలకు లక్ష రూపాయలు పరిహారం ఇవ్వాలని, వరదల్లో కొట్టుకుపోయి మరణించిన వారికి 20 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, దెబ్బతిన్న పంటలకు ఎకరాకు 20వేలు నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి.తిరుపతి రావు, టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు జె వెంకన్న బాబు, సిహెచ్. భద్రం, ఎస్కే హుస్సేన్, చిరంజీవి, ఫకీరు సాహెబ్, మల్లికార్జున్‌రెడ్డి, గుమ్మడి బిక్షం, శాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సీపీఐ(ఎం) ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ముదిగొండ



ఖమ్మం మున్నేరు వరద బాధితులకు సహాయర్థం మండల పరిధిలో వల్లాపురం సీపీఐ(ఎం) గ్రామ శాఖ సభ్యులు యంద్రపల్లి రవికుమార్(50 కేజీల బియ్యం), మద్దినేని దశరథరామయ్య(1500), అయినాల అప్పయ్య(1500), తాటికొండ సత్యనారాయణ (రూ.1500, 12 కేజీల బియ్యం), మాసారపు జీవన్ (500) తోపాటు, మిగతా సభ్యులు, మరో 2 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు, 62 కిలోల బియ్యాన్ని ఖమ్మం సుందరయ్య భవనంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య, ఎర్ర శ్రీకాంత్‌కు సోమవారం తమ వంతుగా అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, వై.విక్రమ్, బండారు రమేష్, మెరుగు సత్యనారాయణ, బివికె మేనేజర్ వెనగండ్ల శ్రీనివాసరావు, ఆఫీస్ కార్యదర్శి ఆర్.ప్రకాష్, సీపీఐ(ఎం) గ్రామ శాఖ సభ్యులు యంద్రపల్లి రవికుమార్, మద్దినేని దశరథరామయ్య, తాటికొండ సత్యనారాయణ, అయినాల అప్పయ్య, మాసారపు జీవన్ పాల్గొన్నారు.



సమన్వయంతో పనిచేద్దాం

- భారీ వర్షాలపై రెవెన్యూ, పోలీస్, పీఆర్, విద్యుత్,

- మున్సిపల్ శాఖల అధికారుల సమీక్ష

నవతెలంగాణ-సత్తుపల్లి

గత వారం రోజులుగా ఎడతెరిపీ లేకుండా కురుస్తున్న భారీవర్షాల కారణంగా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు, సమస్యల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పలు శాఖలకు చెందిన అధికారులు సమావేశమయ్యారు. తహసీల్దారు కూర్మా యోగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమీక్షలో రెవెన్యూ, పోలీస్, పీఆర్, విద్యుత్, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. అలాగే గణేశ్ నవరాత్రోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో చివరిరోజు నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవ కమిటీల బాధ్యులకు సూచనలు, సలహాలను అందించడంతో పాటు శాఖాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు చర్చించారు. నిమజ్జనం జరిగే చెరువుల వద్ద క్రేన్లు, అందుబాటులో గజ ఈతగాళ్లు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమీక్షలో పట్టణ సీఐ తెల్లబోయిన కిరణ్, ఎంపీడీవో ఆర్సీహెచ్ నాగేశ్వరరావు, ఐబీ డీఈఈ సంపతి వెంకటేశ్వరరావు, మండల పంచాయతీ అధికారి త్యాగరాజన్ కృష్ణ, విద్యుత్‌శాఖ ఏఈఈ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ మంద రవిబాబు పాల్గొన్నారు.

గౌడ జన పోరాట హక్కుల సమితి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ గా గడ్డం వెంకటేష్ ఎన్నిక

నవతెలంగాణ-ముదిగొండ

గౌడ జన హక్కుల పోరాట సమితి, మోకు దెబ్బ కమిటీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా మండల పరిధిలో న్యూలక్ష్మీపురం గ్రామానికి చెందిన గడ్డం వెంకటేష్ ఎన్నికయ్యారు. ఖమ్మంలో జరిగిన ఆసంఘం సమావేశంలో గడ్డం వెంకటేష్ ఎన్నిక చేసినట్లు ఆ సంఘం జిల్లా నాయకులు సోమవారం తెలిపారు. మోకు దెబ్బ జిల్లా కమిటీ నూతన సోషల్ మీడియా కన్వీనర్ ఎన్నికైన గడ్డం వెంకటేష్‌ను, ఆ సంఘం జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు పూలమాలలు, శాలువాతో ఆత్మీయంగా ఘన సన్మానం చేశారు. మోకు దెబ్బ కమిటీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ గా ఎన్నికైన గడ్డం వెంకటేష్ ను మండలంలోని పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఐలమ్మ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలి

నవతెలంగాణ - బోనకల్

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల ఐలమ్మ 39 వర్ధంతిని సెప్టెంబర్ 10న జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని తెలంగాణ రజక సేవా సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తమ్మారపు బ్రహ్మయ్య, నిమ్మటూరి రామకృష్ణ కోరారు. మండల కేంద్రంలో సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రజక సంఘం నాయకులు తలుపుల విజయబాబు, వేలప్రోలు వెంకటప్పయ్య, కావేటి అప్పారావు, గండారపు వెంకటప్పయ్య, గడసందుల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

270 కుటుంబాలకు చేయూత

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం నగరంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన వివిధ కుటుంబాలను ఆదుకోవాలని బిఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అన్నారు . ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 46, 30, 04, 17, 34 డివిజన్‌ల పరిధిలో 270 మంది కుటుంబాలకు సుమారు రెండు లక్షలా 30 వేల రూపాయల విలువచేసే నిత్యావసరాల కిట్లను వరద బాధితులకు స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నగర పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత కోణంలో ప్రభుత్వం స్పందించకముందే మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ సహకారంతో బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం ఇప్పటికే మున్నేరు వరద బాధితులకు 10 వేల మందికి నిత్యావసర సరుకులు అందించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముక్కాల కమల, కన్నం వైష్ణవి ప్రసన్న, దండ జ్యోతి రెడ్డి, కోడి లింగయ్య, బొల్లేపల్లి విజయ్, సారిక రాము, మధు, మేడిదెల మల్లేష్, దెల్లి బిక్షం, సుబ్బా చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశరావు ఆశయాలను కొనసాగిస్తాం: సీపీఐ

నవతెలంగాణ - బోనకల్

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, అమరజీవి తూము ప్రకాశరావు ఆశయాలను కొనసాగిస్తామని సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. మండలంలోని రాయన్నపేట గ్రామంలో తూము ప్రకాశరావు భవన్ లో సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టీవిక్రమార్క సిఫార్సు మేరకు తోటపల్లి కొండలరావు కుటుంబసభ్యులు సిఎంఆర్ఎఫ్ దరఖాస్తుకు చేసుకోగా చెక్కును సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కలకోట సొసైటీ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావు చేతుల మీదుగా లబ్ధిదారులైన కొండలరావు సతీమణి తోటపల్లి మరియమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి ఏలూరి పూర్ణచంద్రరావు, సిపిఐ మండల నాయకులు వల్లెబోయిన వీరభద్రం, మేఘశ్రీ హాస్పటల్ నిర్వాహకులు ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు తయారుచేసిన గణపయ్య నిమజ్జనం

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

చిన్న పిల్లలు వారి స్వహస్తాలతో మట్టితో తయారు చేసిన వినాయకుడి ప్రతిమను మూడో రోజైన సోమవారం జల్లేరు వాగులో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఆళ్ళపల్లి మండల పరిధిలోని మర్కోడు గ్రామంలో బొడ్రాయి సెంటర్ కు చెందిన పలువురు విద్యార్థులు స్వతహాగా తయారు చేసిన వినాయకుని ప్రతిమను మూడు రోజుల పాటు భక్తి, శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మూడో రోజు సమీపాన గల జల్లేరు వాగులో నిమజ్జనం చేశారు. చిన్నవయసులోనే చిన్న పిల్లలు భక్తితో పాటు, కాలుష్య రహిత మట్టితో వినాయకుని తయారు చేసి, పూజలు నిర్వహించడంపై ఆ గ్రామంలోని పలువురు విద్యార్థులను కొనియాడారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ- ముదిగొండ



ముదిగొండ గ్రామానికి చెందిన అంతోటి రాజు, నాయిని వెంకటేశ్వర్లు, మల్లెల దమయంతి అనే అనారోగ్య బాధితులు రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 65 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఐఎన్టియుసి మండల అధ్యక్షులు ఉసికల రమేష్, మాజీ జెడ్పిటిసి సభ్యులు మందరపు నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మందరపు ఉపేందర్ రావు, నాయకులు కొమ్ము నరసింహారావు, వాకదాని చెన్నారావు, హరి తదితరులు పాల్గొన్నారు.

చిరుమర్రిలో సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.25,500 విలువైన చెక్కును మండల పరిధిలోని చిరుమర్రి గ్రామానికి చెందిన సామినేని మంగయ్యకు సోమవారం సిపిఐ(ఎం) నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల నాయకులు కోలేటి ఉపేందర్ రావు, గ్రామ శాఖ కార్యదర్శి సామినేని రామయ్య నాయకులు చావగాని మాధవరావు, గాలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరదలకు దెబ్బతిన్న ఈత చెట్ల వనం

• ప్రభుత్వం ఆదుకోవాలని కల్లు గీత కార్మికులు ఎదురుచూపులు..

నవతెలంగాణ-కూసుమంచి

గత పది రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయానికి భారీ వరద పోటెత్తింది. దీంతో పాలేరు జలాశయం తన ఉగ్రరూపాన్ని చూపించింది. దీంతో చుట్టుపక్కల గ్రామాలలో ఇండ్లలోకి నీరు చేరి అతలాకుతలం చేసింది. అలానే వేల ఎకరాల పంటలను ముంచేసింది. ఈ వరద గీత కార్మికులను కూడా కోలుకోలేని దెబ్బ చేసింది.

సుమారు 1500 ఈత వనం ధ్వంసం..

మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో పాలేరు జలాశయం అలుగు ప్రాంతంలో ఉన్న సుమారు 1500 ఈత చెట్లను (వనం) నమ్ముకుని సుమారు 70 కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నారు. గీత కార్మికులు ఈ సంవత్సరం ఈత చెట్లను నమ్ముకుని కల్లు గీసి జీవనం సాగిస్తున్న వారికి వరదల వల్ల ఊహించని పెద్ద దెబ్బ తగిలింది. మండలంలో వందల సంఖ్యలో ఈత చెట్లు ఉన్న గ్రామం నాయకన్ గూడెం మాత్రమే చుట్టుపక్కల ఏ గ్రామంలోనైనా ఇన్ని ఈత చెట్లు లేవని గీత కార్మికులు చెబుతున్నారు. పాలేరు అలుగు తగ్గుముఖం పట్టడంతో గీత కార్మికులు మొత్తం అలుగు ప్రాంతంలోని ఈత వనంలోకి వెళ్లి పరిశీలించగా పూర్తిగా చెట్లు మొత్తం ఏర్లతో సహా నేలకూలాయి. దీంతో గీత కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తాము జీవనోపాధి కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా మా గీత కార్మికులకు ప్రభుత్వమే ఆర్థికంగా సహాయం చేసి ఆదుకోవాలని వారు ప్రభుత్వం వేడుకుంటున్నారు.

కల్లుగీత కార్మిక సంఘం నాయకులు పరిశీలన...

వరదల కారణంగా పాలేరు ప్రాంతంలో ఈత చెట్లు వేర్లతో సహా ఈత చెట్లు పడిపోవటంతో పనికిరాకుండా అయ్యాయి. దీంతో గ్రామ కల్లుగీత కార్మికులు నేతలు దొంతగాని నరసయ్య గౌడ్, బుడిగ వెంకన్న, బుడిగే ఎల్లయ్య, గుండా వెంకటనారాయణ, సంఘం నేతలు పరిశీలించారు.

ఉపాధిని కోల్పోయాం : గ్రామ గీత కార్మిక సంఘం



కార్యదర్శి మండల వీరయ్య గౌడ్

ప్రతి సంవత్సరం తాటి, ఈత చెట్లను నమ్ముకొని తాటి, ఈత, కల్లు గీసి జీవనం సాగిస్తున్నాము. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలలో ఈత చెట్ల నుండి కల్లు తీయటం ప్రారంభిస్తామని, కానీ ఈ సంవత్సరం పాలేరు జలాశయం నుండి వచ్చిన వరదల కారణంగా ఈత చెట్లు సుమారు 1500 నేలకూలడంతో మా జీవనోపాధికి కోలుకోలేని రీతిలో దెబ్బ తగిలింది. ఈ సంవత్సరం ఉపాధి అవకాశాన్ని కోల్పోయాం.

డాక్టర్ నాదెండ్ల కిషోర్ కుమార్‌కి మిత్ర బృందం ఘన నివాళి



నవతెలంగాణ-బోనకల్

మండల కేంద్రమైన బోనకల్ గ్రామానికి చెందిన డాక్టర్ నాదెండ్ల కిషోర్ కుమార్ ప్రథమ వర్ధంతిని బోనకల్ లోని స్టేషన్ రోడ్ నందు ఉన్న ఆయన స్వగృహంలో సోమవారం మిత్ర బృందం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెల కిషోర్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సీపీఐ(ఎం) బోనకల్ గ్రామ శాఖ కార్యదర్శి తెల్లాకుల శ్రీనివాసరావు మాజీ జెడ్పిటిసి బానోతు కొండ మాట్లాడుతూ బోనకల్ చుట్టుపక్కల గ్రామాల రోగులకు ఆయన విశిష్ట సేవలు అందించారన్నారు. దాదాపు మూడు సంవత్సరాల పాటు కిషోర్ కుమార్ తన సతీమణి అరుణ మెమోరియల్ పేరున నెలనెల హైదరాబాదు నుంచి ప్రత్యేకంగా వచ్చి బోనకల్లు గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించారన్నారు. ప్రతి నెల తన సొంత ఖర్చులతో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా వేలాది రూపాయలు విలువ చేసే మందులను కూడా అందజేశారని కొనియాడారు. తన మానవత్వాన్ని చాటుకున్నారన్నారు. నిగర్వి, అజాతశత్రువు అయిన మనందరికీ దూరం కావటం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్ కుమార్ మిత్ర బృందం గుగులోతు పంతు, బంధం శ్రీనివాస రావు, డాక్టర్ కొంగర గోపి, ఉప్పర శ్రీను, ఆవునూరి వీరయ్య, రంగా జనార్ధన్ రావు, వజ్రాల సత్యనారాయణ, మణిరాజు, వరికల్లు శివ, దొప్ప సంజీవులు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, నేరడ పున్నయ్య, భాష, బాజీ షరీఫ్, బంటు ఝాన్సీ, బొబ్బిళ్ళ యశోద, బంటు మంగమ్మ, పమ్మి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురంలో నివాళులు

గార్ల మండలం సత్యనారాయణపురంలో నాదెండ్ల కిషోర్ కుమార్ ప్రథమ వర్ధంతిని కుటుంబ సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కుమారులు నాదెండ్ల మనోజ్, మనీష్ కుమార్ కుటుంబ సభ్యులు కిషోర్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా బోనకల్ మండలానికి చెందిన కిషోర్ కుమార్ మిత్ర బృందం తేనె వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, పల్లా కొండలరావు, గుప్త శివ శంకర ప్రసాద్, పారా శ్రీనివాసరావు, బోడేపూడి కోటేశ్వరరావు తదితరులు కిషోర్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

షరతులు లేకుండా రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పార్టీ మండల ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి జనరల్ బాడీ సమావేశం పద్మనాభుల సుధాకర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో బండి రమేష్ మాట్లాడుతూ ఇప్పటికే తుపాను ఫలితంగా రైతులందరూ పంట నష్టపోయారని, ఇబ్బందుల్లో ఉన్న రైతన్నను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో రాకాసి తండా వరద ముంపుకు గురై తండాను ఆనుకొని వందలాది ఎకరాలు గిరిజన రైతుల భూములు నష్టపోయారని, ఇసుక మేటలు వేసి వ్యవసాయానికి పనికి రాకుండా పోయిందని, వారిని ఆదుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బుగ్గవీటి సరళ, జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే బషీరుద్దీన్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, తుళ్లూరు నాగేశ్వరరావు, బింగి రమేష్, అంగిరేకుల నరసయ్య వర్షపొంగు వీరన్న, ఇప్పుల పుష్పవతి, దొండేటి సుగుణమ్మ, దాసరి మహేందర్, పప్పుల ప్రసాద్, పుసులూరి వీరభద్రం, దొండే నిర్మల్‌రావు, నాగాటి సురేష్, ఉపేందర్, కొమ్ము వెంకన్న, నెరసుల వెంకటేష్, కొత్తపల్లి దామోదర్ రెడ్డి, మాచర్ల రాజశేఖర్, బండారి సైదులు, దొడ్డ లింగస్వామి, పల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జీవితాన్ని తెలంగాణ జాతికి అంకితం చేసిన మహనీయుడు

ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఇల్లందు

కాలోజీరావు తన జీవితాన్ని తెలంగాణ జాతికి అంకితం చేసిన మహనీయుడని కళాశాల ప్రిన్సిపాల్ రామ లింగేశ్వర రావు అన్నారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో సోమవారం ప్రసిద్ధి ప్రజాకవి, తెలుగు రచయిత కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నిజాం నిరంకుశపాలనను తన కవితల ద్వారా కాళోజి దుయ్య బట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తొర్తి జాన్, మరో ప్రోగ్రాం ఆఫీసర్ విలియం ప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

అశ్విని కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-కారేపల్లి

అకాల మృత్యువాత పడ్డ వ్యవసాయ శాస్త్రవేత డాక్టర్ నూనావత్ అశ్విని కుటుంబానికి తెలంగాణ ట్రైబర్ టీచర్స్ ఫెడరేషన్ సోమవారం ఆర్థికసాయం అందజేసింది. కారేపల్లి మండలం గంగారంతండాలో జరిగిన సంస్మరణ కార్యక్రమానికి హాజరైన టీజీటీటీఎఫ్ నేతలు మృతులు అశ్విని, మోతీలాల్ చిత్రపటాలకు నివాళ్లు అర్పించారు. అశ్విని తల్లి నేజికి రూ.25 వేలను అందజేశారు. ఈకార్యక్రమంలో టీజీటీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ వీరునాయక్ గౌరవ అధ్యక్షులుమాలోత్ శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.భాస్కర్, నాయకులు బోజ్య, బీ.వీరు, కేలోత్ నరేష్, అజ్మీర రవి, బానోత్ శ్యామ్, ఉపాధ్యయులు రమేష్, చిన్న, జీ.వీరభద్రం, బీ.హచ్య, సిర్దార్, జీ.కుటుంబరావు, ఆదివాసి టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు మోకాళ్ల రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.



మున్నేరు వరదలో నష్టపోయిన జర్నలిస్టులకు ఎస్‌బీఐ సహాయం



నవతెలంగాణ-ఖమ్మం

మున్నేరు వరద తాకిడికి సర్వం కోల్పోయిన నవతెలంగాణ జర్నలిస్టులకు ఎస్బిఐ బాసటగా నిలిచింది. సోమవారం ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులో గల ఎస్బిఐ కార్యాలయంలో మున్నేరు బట్టలు పంపిణీ చేశారు. కాగా నవతెలంగాణ రీజనల్ మేనేజర్ ఎస్డి వరదకు ఇండ్లు నీట మునిగి సర్వం కోల్పోయిన ఐదుగురు జర్నలిస్టులకు నిత్యావసరాలు, జావిద్ బ్యాంకు మేనేజర్, ఉద్యోగులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు నందన్, కృష్ణవేణి, మురళీ, ప్రశాంత్, చీఫ్ మేనేజర్, చెన్నాపరెడ్డి, హరిప్రసాద్, రాకేష్ పాల్గొన్నారు.



ఘనంగా ప్రజాకవి కాళోజి జయంతి వేడుకలు

నవతెలంగాణ-నేలకొండపల్లి

ప్రముఖ కవి కాలోజీ నారాయణరావు జయంతి వేడుకలను సోమవారం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి మాట్లాడుతూ పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిదంటూ నిరంతరం తన రచనల ద్వారా చాటి చెప్పిన ప్రజాకవి కాలోజీ అని కొనియాడారు. తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ మార్థియనా మాట్లాడుతూ ప్రతి అణువు గొడవకు తన గొడవగా చేసుకుని నిరంతరం గొడవ చేసిన నా గొడవ అనే కవితా సంపుటి తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డ ఆర్తి, ఆవేదన, ఆక్రందన అని అన్నారు. చరిత్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ వెంకటరాజం మాట్లాడుతూ కాళోజీ ప్రజాకవి మాత్రమే కాదని ఆయనకు గొప్ప మానవతావాదని, అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడంటూ తన తుది శ్వాస వరకు పోరాడిన యోధుడన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటికి మాజీ ఎంపీపీ నివాళి

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త తాళ్లూరి వెంకటి ఇటీవల మృతి చెందారు. సోమవారం ఆయన దశదినకర్మ కుటుంబ సభ్యులు నిర్వహించారు. మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. ఆయన సేవలను కొనియాడారు.

గజ్జల జ్యోతికి నివాళులర్పించిన మాజీ ఎంపీపీ

అన్నారుగూడెం గ్రామానికి చెందిన గజ్జల రమణ, రేణుక దంపతుల కుమార్తె జ్యోతి ఇటీవల అనారోగ్యంతో, మృతి చెందారు. సోమవారం దశదినకర్మ నిర్వహించారు. గజ్జల జ్యోతి చిత్రపటానికి డి.శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయా కార్యక్రమాలలో ముచ్చింతల చెన్నయ్య, పావురాల కృష్ణయ్య, తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు, మోటర్లను అంటుకోరాదు

నవతెలంగాణ-కల్లూరు

మండల ప్రజలు మీ దగ్గరలో ఉన్న విద్యుత్ స్తంభాలు, కరెంటు మోటర్లను తాకరాదనిఎస్సై ఎస్కే షాకీర్ తెలిపారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు విద్యుత్ ఎర్త్ అయితే షాక్ కొడితే ప్రమాదమని ప్రజలు సూచించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వాగులు, వంకల, చెరువు అలుగులను దాటే ప్రయత్నం చేసి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దన్నారు. భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిందని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకొని రాగల 24 గంటల వరకు బయటకు రావద్దని కోరారు. కల్లూరు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

పాఠశాలపై కూలిన చెట్టు తొలిగింపు

నవతెలంగాణ-కల్లూరు

స్థానిక ప్రాథమిక పాఠశాలలో 30 సంవత్సరాల క్రితం నాటిన వృక్షం శనివారం వచ్చిన గాలి దుమ్ముకి వేర్లతో సహా పడిపోయింది. ఆ రోజు వినాయక చవితిపండగ కావటంతో పాఠశాలకు సెలవు ఇవ్వడం వల్ల ఎలాంటి ప్రమాదం జరగలేదు. పాఠశాలలో పడ్డ వృక్షం తొలగించాలని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాసిరెడ్డి నాగ పద్మ ఉపాధ్యాయులు, మేజర్ పంచాయతీ ఈవో ఎం.నాగేశ్వరావు దృష్టి తీసుకోవడంతో సోమవారం ఆ చెట్టును తొలగించారు. దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాగేశ్వర రావు మాట్లాడుతూ గత రెండు రోజుల నుండి పట్నంలోని సైట్ లైన్‌లో ఉన్న జేసీబి పెట్టి పూడికలు తీస్తున్నట్లు తెలిపారు.

సీడీప నిధులతో చేతిపంపు ప్రారంభం

వెల్ఫేర్ లైఫ్ అధినేత మైఖేల్ వైజర్

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని రఘునాథ బంజర గ్రామంలో సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్(సిడిఎ) ఆధ్వర్యంలో ఏర్పటు చేసిన మంచినీటి చేతిపంపును, వెల్ఫేర్ లైఫ్ అధినేత మైఖేల్ వైజర్‌తో కలసి సోమవారం ప్రారంభించారు.మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు సిడిఏ కార్యదర్శి యోనోష్ కుమార్‌కి వివరించగా వెంటనే స్పందించి సుమారు 80 వేల రూపాయల విలువగల చేతిపంపును ఏర్పాటు చేయడం జరిగింది. ఇంత గొప్ప సహాయం చేసి నందుకు గ్రామస్తులు వారికి పూలతో స్వాగతం పలికారు. వారే స్వయంగా బిందెల్లో నీటిని నింపి మహిళలకు అందించారు. మంచినీటి సమస్యను తెలియజేసిన వెంటనే స్పందించి గ్రామంలో చేతిపంపును ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా గ్రామస్తులు వారిని పూల మాలలతో, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుక్కా అంజన్ రావు, ఉప సర్పంచ్ చల్లగుండ్ల వెంకటేశ్వరరావు, బొక్కా వెంకటేశ్వర్లు, బండి నరసింహారావు, జానపాటి రామారావు, రాజరత్నం, సుదర్శనం, శారద, సావిత్రి, కవలమ్మ, రాణి, శాంతవాణి, రమాదేవి, మరియమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

- కళాజాతను జెండా ఊపి ప్రారంభించిన డిఎంఅండ్‌హెచ్వో

నవతెలంగాణ-ఖమ్మం

జిల్లాలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై పోలూరి రాము కళాబృందం ద్వారా పల్లె సుద్దులు కళాజాత కార్యక్రమాన్ని సోమవారం ఖమ్మం పాత బస్టాండ్‌లో జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి సుబ్బారావు, జిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ (ఎయిడ్స్ అండ్ లెపరసి) సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ హెచ్ఐవి పై ప్రజలందరూ అవగాహన కలిగి ప్రతి ఒక్కరూ విధిగా హెచ్ఐవి టెస్ట్‌లు చేయించు కోవాలని, అలాగే జిల్లాలో ఉన్న అన్ని ఆయుష్ ఆరోగ్య మందిరాలలో హెచ్ఐవి టెస్ట్ ఉచితంగా చేస్తారని, ఈ సదవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని అన్నారు. అందరూ సమిష్టి కృషితో ఖమ్మం జిల్లాను హెచ్ఐవి రహిత జిల్లాగా మార్చాలని కోరారు. జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ ఈ పల్లె సుద్దులు కార్యక్రమం ద్వారా జిల్లాలో ఉన్న ప్రధాన కూడళ్లలో హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధులు, కండోమ్ వలన ఉపయోగాలపై అవగాహన కలిపిస్తారని, హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా వారితో అందరూ కలిసి మెలసి ఉండాలని తెలిపారు. అలాగే హెచ్ఐవి అంటుకునే వ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాలు అక్టోబర్ 31 వరకు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ సిబ్బంది డి.సత్య కుమార్, మహమూద్ అలీ, జాగృతి స్వచ్ఛంద మేనేజర్ కొండల్‌రావు, సిబ్బంది, జనవాణి స్వచ్ఛంద సేవ సంస్థ మేనేజర్ సుందర్, సిబ్బంది, లింకు వర్కర్స్ డిఆర్పి. శివ, సిబ్బంది పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | సెప్టెంబర్ 10, 2024 | www.navatelangana.com



ఉపాధ్యాయులు సమ సమాజ నిర్మాతలు

- వివేకవర్ధిని వైద్యాసంస్థల చైర్మెన్ లయన్ ఎంవి.చౌదరి

నవతెలంగాణ-కొత్తగూడెం

ఉపాధ్యాయులు సమ సమాజ నిర్మాతలని వివేకవర్ధిని వైద్యా సంస్థల చైర్మెన్, లయన్ ఎంవి.చౌదరి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి, ఘనంగా సన్మానించారు. కొత్తగూడెం క్లబ్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం అధ్యక్షులు షేక్ దస్తగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ లయన్ ఎంవి.చౌదరి మాట్లాడుతూ అన్ని వృత్తుల కన్నా పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అన్నారు. విశిష్ట అతిది కోనేరు ట్రస్ట్ చైర్మన్ లయన్ కోనేరు పూర్ణ చంద్ర రావు మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామం నుండి, తెలంగాణ పోరాటం వరకు క్రియాశీలక పాత్ర పోషించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన చరిత్ర ఉపాధ్యాయులకే దక్కిందన్నారు. ఉమ్మడి కొత్తగూడెం మండలంలోని 19 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, 9 కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న 30 మంది ఉపాధ్యాయులను శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ లయన్ మన్నెం జవహర్ రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ లగడపాటి రమేష్, లయన్ సభ్యులు మొరిశెట్టి మోహనరావు, చంద్ర మధు, కూర శ్రీధర్, కొయ్యాడ నగేష్, ఛందర్ రావు, కరేముల్లా, ఉపాధ్యాయులు జహంగీర్ షరీఫ్, నీరజ సీత, రాజయ్య, శ్రీనివాసరావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి జి.భానుమతి

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులో సెప్టెంబర్ 28వ తేదీ శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీమీద కానీ, మీకు తెలిసిన వాళ్ల మీద కానీ, మీ బంధువుల మీద కాని ఏమైనా కేసులు ఉన్నట్లైతే వాటిని (కాంప్రమైజ్) రాజీ చేసుకోవచ్చని తెలిపారు. యాక్సిడెంట్ కేసులు, సివిల్ కేసులు, చీటింగ్ కేసులు, చిట్ ఫన్డ్ కేసులు, భూతగాదాలుకు సంబంధించిన కేసులు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చిన్నచిన్న దొంగతనం కేసులు, ట్రాఫిక్ చాలాన్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, కుటుంబ తగాదాలు, బ్యాంకు కేసులు, టెలిఫోన్ కేసులు, కొట్టుకున్న కేసులు, సైబర్ క్రైమ్ కేసులు, ఈ లోకదాలత్‌లో రాజీ చేసుకుని, కేసును పూర్తిగా క్లోజ్ చేసుకునే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కోర్టు చుట్టూ కక్షిదారులు తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దనే ఉద్దేశంతో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు.

బీఎన్‌ఆర్‌ని వరించిన గురుబ్రహ్మ అవార్డు

- బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత పై ప్రశంసల జల్లు

నవతెలంగాణ-బూర్గంపాడు



జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకల సందర్భంగా విద్యారంగంలో విశిష్ట ప్రతిభను కనబరిచి విద్యార్థులచే ఉత్తమ గురువుగా ప్రశంసలు పొందుతున్న వారిని గుర్తించి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కేంద్రంలో రవీంద్ర భారతి ఆరిటోరియంలో అతిరథ మహారథుల సమక్షంలో గురుబ్రహ్మ అవార్డు ప్రధాన ఉత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించగా బూర్గంపాడు మండలం బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత బీఎస్‌ఆర్‌కి గురుబ్రహ్మ అవార్డుతో సత్కరించి ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా గురుబ్రహ్మ అవార్డు పొందిన బీఎస్‌ఆర్‌ని జిల్లాకి చెందిన పలువురు, ప్రముఖులు అభినందిస్తున్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలలో భాగంగా ఎమ్మెల్యే గోపాలరావు, సినీ హీరో సుమన్, ప్రభుత్వ చీఫ్ బిర్ల ఐలయ్యతోపాటు, ఇతర ప్రముఖుల సమక్షంలో బిఎన్నార్‌కి అవార్డు రావడం కొత్తగూడెం జిల్లాకే గర్వకారణం అన్నారు. బీఎస్‌ఆర్ వద్ద ఎంతోమంది విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అభివృద్ధించారని ఇటువంటి ఉత్తమ గురువుని గుర్తించి గురుబ్రహ్మ అవార్డుతో ప్రోత్సహించడం ప్రశంసనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు.

వర్షాకాలంలో ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గాభవాని

నవతెలంగాణ-పినపాక

వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యం అని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు దుర్గాభవాని తెలియజేశారు. సోమవారం పినపాక మండల పరిధిలోని చింతల బయ్యారం, రావిగూడెం గ్రామాలలో హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేశారు. జ్వర లక్షణాలు ఉన్న వారిని పరీక్షించి రక్త నమూనాలను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో వాతావరణ మార్పుల వల్ల, పరిశుభ్రత లోపం వల్ల నీరు నిలిచి అనేక రకాల వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అప్పుడప్పుడు ప్రాణాంతకమైన వ్యాధులు కూడా వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అందుకే వర్షాకాలంలో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పరిమితికి మించి ఆర్‌ఎంపీలు వైద్యం చేయరాదు

- నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుభాష్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఆర్‌ఎంపీ వైద్యులు పరిమితికి మించి వైద్యం చేయరాదని నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుభాష్ అన్నారు. సోమవారం జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్ ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆర్‌ఎంపీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్‌ఎంపీలు ఇంజక్షన్లు, ఐవీ ఫ్లూయిడ్స్, వంటి యాంటీ బయోటిక్ ఇంజక్షన్లు, స్టెరాయిడ్ ఇంజక్షన్లు చేయవద్దని సూచించారు. జ్వర పీడితులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు లేదా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేయాలని అన్నారు. టీ హబ్ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని రకాల రక్త పరీక్షలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆర్‌ఎంపీ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసమే పీఆర్‌టీయూ

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని పలు గ్రామాల్లో వున్నటువంటి పాఠశాలను పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు డి.వి రమణ మండల నాయకులు జయకర్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా డి.వి రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కారం కోసమే పీఆర్‌టీయూ పని చేస్తుందని, గ్రామాల్లో గల పాఠశాలలో విద్యార్థులు ఎక్కువ మంది హాజరు అయ్యే విధంగా చూసుకొని పాఠశాలలు బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో శంకర్ మహదేవన్, సంజీవ్ రావు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆపన్న హస్తం దానధర్మ ట్రస్ట్

నవతెలంగాణ-మణుగూరు

పినపాక నియోజకవర్గం వరద ప్రభావిత ప్రాంతాల్లో దానధర్మ ట్రస్ట్ నిర్వాహకురాలు గంటా రాధా సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె నియోజకవర్గంలోని మణుగూరు మండలంలోని మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్, సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని బేడబుడగజంగాల గుంపు, అశోక్ నగర్ వాగోడ్డు, అశ్వాపురం మండలంలోని మల్లెల మడుగు ప్రాంతాల్లో పర్యటించి, దానధర్మ ట్రస్టు ద్వారా వరదల వల్ల సర్వం కోల్పోయిన 120 వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్‌ను అందజేశారు. ఆమె మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, ఇతర సరుకులను పంచినట్టు తెలిపారు. వరదలతో అతలాకుతలమైన నియోజకవర్గ ప్రజలకు తన వంతుగా దానధర్మ ట్రస్ట్ ద్వారా సహాయం చేస్తున్నానని, మా ట్రస్టుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామ్య విధానాలకు చెంపపెట్టు

నవతెలంగాణ-దమ్మపేట



ఎమ్మెల్యేల అనర్హత పిటీషన్‌లపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామ్య విధానాలకు చెంప పెట్టు అని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ హైకోర్టు తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురికావడం తథ్యం తెలిపారు. హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్పూర్తిని నిలబెట్టే విధంగా ఉందిని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురై ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం తథ్యమే అని వ్యాఖ్యానించారు. అనర్హత కారణంగా ఉప ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ గెలుపు తథ్యం అని అన్నారు. హైకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర శాసనసభాపతి నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడతారని తాను ఆశిస్తున్నానని మెచ్చా అన్నారు.

ఏజెన్సీలో తీరుమారని ఉపాధ్యాయులు

మద్యం మత్తులో పాఠాలు బోధన

- తాగుబోతు ఉపాధ్యాయులు మాకొద్దంటున్న గ్రామస్తులు

నవతెలంగాణ-చర్ల

చంద్రుడు పైకి చక చక అడుగులు మోపి అంతా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా ఏజెన్సీలో కొంతమంది సరస్వతీపుత్రుల తీరు మారటం లేదని పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు. కొన్ని లక్షల మంది ఎంతో ఉన్నతమైన చదువులు చదివి నిరుద్యోగ సమస్యతో సతమతమవుతూ ఉంటే ఉద్యోగ భద్రత ఉన్న కొంతమంది ఉపాధ్యాయులు మాత్రం మద్యం సేవించి సరస్వతి ఆలయాలలో హల్చల్ చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. మద్యం మత్తులో పాఠాలు బోధిస్తూ ముక్కుపచ్చలారని మా చిన్నారులను వారి ఇష్టానికి ఇష్టం వచ్చినట్టు కొట్టడం, తిట్టడం, దుర్భాషలాడడం చేస్తున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నత చదువులు చదివి, ఉపాధ్యాయ శిక్షణ పొంది విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన కొంతమంది ఉపాధ్యాయులు విద్యార్థులు ఎదురుగా ధూమపానం చేయడం, పాన్ పరాకులు తినడం వంటి అసాంఘిక కార్యకలాపాలు చేయడం వలన విద్యార్థులకు ఏమి సందేశం ఇస్తున్నారని పలువురు సూటిగా ప్రశ్నిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఏదో ఒక పాఠశాలలో ఎప్పుడో అప్పుడు కొంతమంది ఉపాధ్యాయులు మద్యం మత్తులో హల్చల్ చేయడం విద్యా వ్యవస్థలో పరిపాటయింది. ఆ మధ్యకాలంలో జీపీ పల్లి యూపీఎస్ పాఠశాలలో ఓ హిందీ ఉపాధ్యాయుడు మద్యం మత్తులో పిల్లలను చితకబాదిన



చింతగుప్ప పాఠశాల ఉపాధ్యాయుడిపై విచారణ నిర్వహిస్తున్న దృశ్యం

వైనం మరువక ముందే ఈ మధ్యకాలంలో మండల పరిధిలోని చింతగుప్ప ఆదివాసీ గ్రామంలో ఐటీడీఏ పరిధిలో ఉన్న జీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడు మద్యం మత్తులో పూనకం వచ్చినట్టు ఊగిపోతూ పాత్రికేయులకు దర్శనమిచ్చాడు. ఆ క్రమంలో గ్రామస్తులు మద్యం తాగి పాఠాలు బోధించే ఈ ఉపాధ్యాయుడు మాకు వద్దు అంటూ తమ నిరసనను తెలిపారు. ఐటీడీఏ అధికారులను నవతెలంగాణ ఫోన్లో సంప్రదించగా ఆ ఉపాధ్యాయుడు పై ఎంక్వయిరీ చేపించామని, పీఓ దృష్టికి తీసుకువెళ్లామని బదులిచ్చారు. మండలంలో ఉన్న 85 పాఠశాలలకు గాను అందులో ఐటీడీఏ పరిధిలో కొనసాగే జీపీఎస్‌లు 14 పాఠశాల ఉండగా ఆయా పాఠశాలలలో పనిచేసే ఉపాధ్యాయులు కొందరు సమయపాలన పాటించకపోవడం, ఉదయం ఒకరు, మధ్యాహ్నం ఒకరు లేకపోతే ఒకరోజు ఒకరు మరుసటి రోజు మరొకరు చొప్పున మంచి సమన్వయంతో వంతుల వారిగా విధులకు హాజరు కావడంతో ఆయా పాఠశాలలో చదివే విద్యార్థుల్లో భవితవ్యం అగమ్య గోచరంగా ఉందని పలువురు విద్యా విశ్లేషకులు వాపోతున్నారు.

ఏజెన్సీలో ప్రశ్నార్థకం ప్రాథమిక విద్య

పాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం పాఠశాలకు వచ్చినా మొబైల్‌లో నిమగ్నమవడం, లేదా తోటి ఉపాధ్యాయులతో కాలక్షేపం చేయడం మినహా విద్యార్థులకు ఒక్క అక్షరం ముక్క కూడా నేర్పని దుస్థితి ఏజెన్సీలో గోచరిస్తుందని పలువురు విద్యా విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు. చర్ల మండలం జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతంలో ఉండడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం స్థానికంగా ఉండే కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, ఎస్‌సీఆర్‌పీ పర్యవేక్షణ చేయకపోవడం వెరసి ఏజెన్సీలో విద్య మూనిగే నక్క పైన తాటి పండు పడ్డ చందంగా ఏజెన్సీ విద్య తయారైందని పలువురు ప్రముఖులు ఘాటుగా విమర్శిస్తున్నారు. 30% విద్యార్థులకు కనీసం తెలుగు చదవడం కూడా రావటం లేదని ఉపాధ్యాయులు ఏమి నేర్పిస్తున్నారు? విద్యార్థులు ఏమి నేర్చుకుంటున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే తల్లిదండ్రులు సైతం పొరపాటు చేస్తున్నారని తమ తమ పిల్లలు నిత్యం పాఠశాలకు వెళ్తున్నారా? లేదా? వెళ్తే పాఠశాలలో ఏమి నేర్చుకుంటున్నారు? వెళ్లకపోతే అసలు వీరు ఏమి చేస్తున్నారు? అనే దానిపై కొంతమంది తల్లిదండ్రులు దృష్టి సారించట్లేదని విద్యావంతులు విమర్శిస్తున్నారు. మండల వ్యాప్తంగా 271 మంది ఉపాధ్యాయులు ఉండవలసి ఉండగా అన్ని మేనేజ్మెంట్‌లు కలిసి కేవలం 180 మంది ఉపాధ్యాయులు మాత్రమే మండలంలో విద్యావ్యవస్థలో పనిచేస్తున్నారు. మిగతా 91 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గణాంకాలు తెలుపుతున్నాయి. కొన్ని కొన్ని పాఠశాలలో విద్యార్థులు తక్కువ ఉపాధ్యాయులు ఎక్కువ మంది ఉండడం, కొన్ని కొన్ని పాఠశాలలో విద్యార్థులు ఎక్కువమంది ఉండి ఉపాధ్యాయుడు, ఒక్కరు మాత్రమే ఉండడం వలన విద్యా బోధన సమతుల్యం అవటం లేదని ఉపాధ్యాయులు సైతం వాపోతున్నారు. కొన్ని చోట్ల పాఠశాల భవనాలు సరిగా లేక... సరైన వసతులు లేక.. విద్యా వ్యవస్థ నత్తనడకన నడుస్తుందని విద్యావేత్తలు తెలుపుతున్నారు. ఇకనైనా కలెక్టర్, పీఓ, జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారి విద్యా వ్యవస్థ పై దృష్టి సారించి విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

చింతగుప్ప ఉపాధ్యాయుడిపై శాఖా పరమైన చర్యలు చేపడతాం

మద్యం మత్తులో పాఠశాలకు వెళ్లి చిన్నారులు దండించడం, తిట్టడం చాలా పొరపాటు. ఆ ఉపాధ్యాయుడు పై ఎంక్వైరీ చేపించాం. పీవో శాఖాపరమైన చర్యలు చేపడతారు. మరొకసారి ఇటువంటి చెడు పనులకు తావు లేకుండా చూస్తాం.

- ఏటీడీఏ జి.అశోక్



చింతగుప్ప మాస్టార్ మాకొద్దంటున్న గ్రామస్తులు

కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకం

- అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్

నవతెలంగాణ-పాల్వంచ



కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను సోమవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్ర పటానికి వేణుగోపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ యాసకు కాళోజీ నారాయణరావు చేసిన సేవలు కొనియాడారు. 'హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు' అంటూ 'సామాన్యుడే నా దేవుడు' అని ప్రకటించిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర, పరిపాలన అధికారి గన్యా, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ, డీసీఓ సయ్యద్ హుర్షీద్, ఉప కోశాధికారి వెంకటేశ్వర్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

విష జ్వరాల నుండి ప్రజలను కాపాడాలి

- ప్రభుత్వ హాస్పిటల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే.రమేష్

నవతెలంగాణ-కొత్తగూడెం



ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో వస్తున్న విష జ్వరాల నుండి ఏజెన్సీ ప్రజలను కాపాడటానికి ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే.రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మంచి కంటి భవన్‌లో జరిగిన టౌన్ కమిటీ సమావేశంలో ఏజే.రమేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్‌లో సౌకర్యాల కొరత, డాక్టర్ కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. ఓవైపు జ్వరం ఇతర అనారోగ్య కారణాలతో ప్రజలు హాస్పిటల్‌కి వస్తే మెరుగైన వైద్య సదుపాయం లేక, ప్రైవేట్ హాస్పిటల్‌కి వెళ్లడం, లేదా ఆర్థిక స్తోమత లేక ఖమ్మం, వరంగల్ లాంటి సుదూర ప్రాంతాలకు ప్రభుత్వ హాస్పిటల్‌లో వైద్య సదుపాయం కోసం వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జిల్లా కేంద్రంగా ఉన్న ప్రభుత్వ సర్వజన హాస్పిటల్ సమస్యలు పరిష్కరించి డాక్టర్లు, మందుల కొరత, డ్రైనేజీ, మంచి నీరు, టాయిలెట్లు ఇతరత్రా సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి జ్వరాలు వస్తున్నాయని ఈ జ్వరాలకు సంబంధించిన వైద్యం ప్రభుత్వ ఆసుపత్రులు అందే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, అలాగే వార్డుల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ హాస్పిటల్లో మౌలిక సదుపాయాలు కల్పన కొరకు భవిష్యత్తు పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో టౌన్ కార్యదర్శి లిక్కీ బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, టౌన్ కమిటీ సభ్యులు డి.వీరన్న, సందకూరి లక్ష్మి, జునుమాల నగేష్, నందిపాటి రమేష్, ఆవుల శ్రీరాములు, ఆలేటి శ్రీను, ప్రమోద్, వందన, శివ, నాగ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసర ప్రాంతాలను ముంచేస్తున్న సింగరేణి ఓబీ వరద

- వణుకుతున్న పట్టణం
- కోట్ల లాభం గడుస్తున్నా బుక్కెడు అన్నం పెట్టని పరిస్థితి
- ప్రాణాలు పోయినా పట్టించుకోలేదు
- ఆశాస్త్రీయంగా ఓబీ గుట్టలు



నవతెలంగాణ-మణుగూరు

ఆగస్టు 31 శనివారం మణుగూరు వరద విపత్తు సింగరేణి కాలరీస్ మణుగూరు కారణంగానే జరిగిందని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. గాంధీనగర్, మేదర బస్తి, సుందరయ్య నగర్, ఆదర్శ్ నగర్ గ్రామాలలో విపరీతమైన వరద ప్రవహించింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రజలు వణికిపోయారు. అధికంగా బొగ్గు, బురద వరద వచ్చింది. బొగ్గుచూరతో కూడిన బురద ఇండ్లలో మోకాటి లోతులో పేరుకుపోయింది. ఈ వరద మొత్తం సింగరేణి బొగ్గు వెలికి తీసే ప్రాంతాల నుండి నివాసాల వైపు ప్రవహించడం కారణంగానే భారీ ముప్పు ఏర్పడిందని, ప్రజల ప్రాణాలు పోయినా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు విమర్శించినా సింగరేణి అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహించారు. గ్రామాలకి అతి దగ్గరలో ఉన్న ఓబి గుట్టలకు బలహీనమైన బండ్ తెగిపోవడం కారణంగానే బొగ్గుతో కూడిన బురద గ్రామాలపై విరుచుకుపడింది. ఓసీ-4 పూర్తిగా ఓబి బొగ్గు వెలికితీత ప్రైవేట్ కంపెనీలో నిర్వహిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు లోపం కారణంగానే ఈ విపత్తు జరిగిందని, ఆరోపణలు ఉన్నవి. ప్రజలు నివసించే గ్రామాల వైపు స్లోప్ లేకుండా చూడాలి, లేదా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గ్రామాలకు ఇబ్బంది లేకుండా వరద నీటిని మళ్ళించాలి. సింగరేణి యాజమాన్యం వరదను గ్రామాల్లోకి రాకుండా కొన్ని సంవత్సరాలుగా మళ్ళించింది. రైల్వే ట్రాక్ నిర్మాణం కారణంగా వరద నీటిని మళ్లించే మార్గాలు లేని కారణంగా బండ్ తెగి భారీ విపత్తుకు దారి తీసింది. ఓసి 2 ఓసి 4ల ఓబి, బొగ్గు ప్రైవేట్ కంపెనీలు వెలికి తీస్తున్నాయి. 15 మీటర్ల వెడల్పు, 15 మీటర్ల ఎత్తుతో ఓబిని పోసుకుంటూ వెళ్లాలి గ్రామాలకు, ఓబీలకు వరదరాకుండా ఓబి పోసుకుంటూ వెళ్లాలి. ఓబి వరదతోపాటు ప్రస్తుత పాత కొండాపురం గుట్టపై నుండి వచ్చే వరద గతంలో గుర్రంపెంట వాగులులో కలిసేది. అలుగును మళ్లించేందుకు నిర్మించిన చెక్ డాం అశాస్త్రీయంగా ఉండడంతో ఆవరణ కూడా సుందరయ్య నగరం పై విరుచుకుపడింది. ఒక్కో కుటుంబానికి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. సింగరేణి యాజమాన్యం సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద మంచినీళ్లు, ఆహార పదార్థాలు ఆపదలను ప్రజలను రక్షించాల్సిన బాధ్యత ఉంటుంది. వరదలు వచ్చి వారం గడిచినా సింగరేణి యాజమాన్యం కనీసం పట్టించుకోకపోవడం విచారకరమని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సింగరేణి వరద వలన లక్షలలో నష్టం

ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మెన్ ఎండి యూసఫ్ షరీఫ్



సింగరేణి ఓబీ వరద ముంపు కారణంగా ఎక్సలెంట్ పాఠశాలకు రూ.10 లక్షల నష్టం జరిగింది. తమ ఇంట్లో ఉన్న మూడు వాహనాలకు నీటిలో నానడం కారణంగా పనికిరాకుండా పోయాయి. సింగరేణి ముందు చూపు లేని కారణంగానే ఈ వరద సంభవించింది. కట్ట వాగులో సిల్ట్, పేరుకుపోయిన చెత్త, పెరిగిన మొక్కలను తొలగించిన కారణంగా వరద వెనక్కి నటి వేయడంతో పాఠశాల ముంపు గురైంది. ఆరడుగుల ఎత్తులో క్లాసులోకి నీరు చేరాయి.

అనేక గ్రామాలు ముంపుకు గురయ్యాయి

ఎస్.వెంకట్రావు సుందరయ్య నగర్

గతంలో గోదారి వరదల సమయంలో ప్రజలకు సహాయ సహకారాలు అందించిన సింగరేణి ఇప్పుడు పట్టించుకోవడం లేదు. బురదతో ఇప్పటివరకు కోలుకోలేదు. ఇంకా ఇబ్బందులు పడుతున్నాం. సరైన సౌకర్యాలు లేక ప్రజల అవస్థ పడుతున్నారు. వరద కారణంగా సర్వం కోల్పోయిన ప్రజలను సింగరేణి ఆదుకోవాలి. ఇలాంటి విపత్తులు జరగకుండా యాజమాన్యం జాగ్రత్తలు తీసుకోవాలి.

మణుగూరు ముంపునకు సింగరేణి వరద కారణం కాదు

జీఎం దుర్గం రామచందర్



ఆగస్టు 31 శనివారం భారీ వర్షాల కార ణంగానే మణుగూరు ముంపునకు గురి అయింది. సింగరేణి వరద కారణం కాదు. భారీ వర్షం కారణంగా ఉపరితల గనులలోకి భారీ నీరు చేరడంతో పని ఒత్తిడి వలన ప్రజలకు సేవలు చేయలేకపోయాం. సీఎస్‌ఆర్ నిధుల నుండి రూ.10 లక్షలు మున్సిపాలిటీ కి ఇచ్చాం. బొగ్గు ఉత్పత్తికి యంత్రాంగమంతా కేంద్రీకరించి ఉపరితల గనులలో భారీగా చేరిన వరద నీరుని తొలగించే పనుల కారణంగానే సహాయక చర్యల్లో పాల్గొనలేకపోయాం.

కార్పొరేట్ ఏరియా వర్క్‌పీపుల్స్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంటల్ క్రీడలు

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కార్పొరేట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సర వార్షిక క్రీడలను సోమవారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జీఎం (సెక్యూరిటీ) కె.శ్రీనివాస రావు అధ్యక్షతన జరిగిన జరిగిన కార్యక్రమంలో జీఎం(పర్సనల్) పి.సామ్యూల్ సుధాకర్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ క్రీడాకారుల కోసం సుశిక్షితులైన కోచ్‌లతో కోచింగ్ క్యాంప్‌లను నిర్వహిస్తు, క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. మంచి క్రీడా ప్రతిభతో స్నేహభావంతో క్రీడలలో రాణించాలని, క్రీడలు అనేవి శారీరక ధృడత్వానికి, ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ సిఎంఓఎఐ ప్రతినిధి ఆర్. కేశవ రావు, గుర్తింపు సంఘం (ఎఐటియుసి) ప్రతినిధి పి.నితిన్ కుమార్,



ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టియుసి) ప్రతినిధి సిహెచ్.మహేష్, కమ్యునికేషన్ అండ్ హనరరీ సెక్రటరీ శ్రీనివాస రావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పేదలకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటాం

- నిత్యావసరాలు పంపిణీ చేసిన నేతలు

నవతెలంగాణ-పాల్వంచ రూరల్



పేదలకు ఏ కష్టం వచ్చినా సీపీఐగా ఆదుకుంటామని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఉలవనూర్, కిన్నెరసాని గ్రామాల్లో 60 కుటుంబాలు వరద వంపుకు గురికాగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచనలతో రూ.2లక్షల విలువ చేసే నిత్యావసర వస్తువులు, దుస్తులు సీపీఐ ఆధ్వర్యంలో ఉలవనూర్, కిన్నెరసాని గ్రామాలలో బాధితులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితుల కష్టాలు తీరేంతవరకు వెన్నంటే ఉంటామని ప్రజలకు భరోసా కల్పించారు. స్థానిక శాసనసభ్యులు కూనంనేని ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించారని అతి త్వరలో భద్రత పనులు మొదలవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, వి.పద్మజ, నాయకులు ముత్యాల కిరణ్ కుమార్, శనగరపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, మన్నెం వెంకన్న, వేములపల్లి శ్రీను, వైస్ గిరి, ఉప్పుశెట్టి రాకేష్, ఆదినారాయణ, సత్యనారయణ, తదితరులు పాల్గొన్నారు.

కట్టం సాయి మృతి పార్టీకి తీరనిలోటు

- మంత్రి సీతక్క కుమారుడు సూర్య
- సాయి కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సహాయం అందించిన ఎంపీఓ, సెక్రెటరీలు

నవతెలంగాణ-పినపాక



కట్టం సాయి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని మంత్రి సీతక్క కుమారుడు సూర్య అన్నారు. సోమవారం పినపాక మండలం జానంపేట గ్రామంలో నిర్వహించిన దశదినకర్మలకు ఆయన హాజరయ్యారు. మంత్రి సీతక్క సైతం కుటుంబ సభ్యులను చరవాణి ద్వారా పరామర్శించారు. కట్టం సాయి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కుటుంబ సభ్యులకు పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు, సెక్రటరీలు రూ.30 వేల ఆర్థిక సహాయంను మంత్రి సీతక్క కుమారుడు సూర్య చేతుల మీదుగా అందజేశారు. సాయి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామనాథం, కరకగూడెం మండల అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్, మండలం ఎంపీడీవో రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. జానంపేట గ్రామపంచాయతీకి సర్పంచ్‌గా ఎదుగుతాడు అనుకున్న సాయి రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం బాధాకరమైన విషయం అన్నారు. పినపాక అక్రిడేషన్ ప్రెస్ క్లబ్ సభ్యులు శ్రీరామ్ బృహస్పతి, అత్తె లక్ష్మణ్, సత్యమేవ జయతే ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నిట్ట వెంకటేశ్వర్లు నివాళులర్పించారు.

నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
8
మంగళవారం | సెప్టెంబర్ 10, 2024 | www.navatelangana.com

శంకర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-చంద్రుగొండ

మండల కాంగ్రెస్ యువ నాయకులు సంక శంకర్ జన్మదిన సందర్భంగా వారి స్వగ్రామం చంద్రుగొండలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ధారం గోవిందరెడ్డి, జిల్లా నాయకులు మాల్లోత్ భోజ్య నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షులు బొర్రా సురేష్, సీనియర్ నాయకులు సరేపల్లి శేఖర్, సేవాదళ్ నాయకులు ఎండీ ఫాజల్ భాక్స్, ఆళ్లకుంట రాందాస్, సురేష్, పుల్లయ్య, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మావో ఆలోచన విధానాన్ని దృఢంగా పాటిద్దాం

నవతెలంగాణ-టేకులపల్లి

కామ్రేడ్ మావో ఆలోచన విధానాన్ని దృఢంగా ముందుకు తీసుకువెళ్దామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ టేకులపల్లి మండల కార్యదర్శి కామ్రేడ్ భూక్య హర్ష్య సోమవారం అన్నారు. పీడిత ప్రజల రాజ్య స్థాపనే ధ్యేయంగా పోరాడి చైనాలో సోషలిస్టు రాజ్యాన్ని ఏర్పాటు చేసిన జనచైన నేత చైనా కమ్యూనిస్టు పార్టీ చైర్మెన్ కామ్రేడ్ మావోకు న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో మరణించి 48 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మావో చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నోమల భానుచందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి హర్ష్య మాట్లాడారు. వ్యవసాయక దేశమైన చైనాలో విప్లవపార్టీ నాయకత్వంలో ప్రజాయుద్ధపంథా ద్వారా సోషలిస్టు రాజ్యాన్ని 1949లో కామ్రేడ్ మావో సాధించారన్నారు. మావో చూపిన విప్లవబాట వెనకబడిన దేశాలన్నింటికీ ఆదర్శంగా అనుచర నీయంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నోముల భానుచందర్, తోటకూరి సతీష్, వీర్య, బాదవత్ ఈరియా, ధరావత్ బిక్ష, శంకర్, మంచ, బోడ లింబ, శంకర్, భీముడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతుగా సహాయ సహకారాలు

- తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

లక్ష్మీనగరం ప్రైమరీ పాఠశాల మౌలిక సదుపాయాల కల్పన కోసం తనవంతుగా సహాయ సహకారా లు అందిస్తానని తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. పాఠశాలకు కావలసిన సదుపాయాలను లక్ష్మీనగరం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గుడ్ల రామ్మోహన్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు సమన్వయంతో పాఠశాలను అభివద్ధి చేసుకోవాలని, పాఠశాలకు కావలసిన గ్రావెల్ కోసం తనవంతుగా సహకరిస్తానని తెలిపారు. అనంతరం ఆయన దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది కొరత తదితర విషయాలను వైద్యాధికారి పుల్లారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి వైద్యశాలలో వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

గర్భిణీలు పోషకవిలువలతో కూడిన ఆహారం తీసుకోవాలి

- పోషణ పక్షోత్సవాల్లో సీడీపీవో ప్రమీల

నవతెలంగాణ-బూర్గంపాడు

గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సీడీపీవో ప్రమీల అన్నారు. సోమవారం మండల కేంద్రమైన బూర్గంపాడు-4 అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షో త్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషక విలువలు, అనీమియా వ్యాధి గురించి ఆమె అవగాహన కల్పించారు. ఆకుకూరలు, పండ్లు, క్యారెట్, బీట్రూట్ వంటి ఆహారపదార్థాలు ఎక్కువగా తీసుకో వాలన్నారు. అనంతరం కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషకా హార ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సూపర్వై జర్ సక్కుబాయి, అంగన్వాడీలు ఎల్.పద్మ, సుమిత్ర, విజయలక్ష్మి, నాగమల్లేశ్వరి, ఆయాలు పాల్గొన్నారు.

ఆంధ్రాకు తరలిస్తున్న మద్యం పట్టివేత

నవతెలంగాణ-బూర్గంపాడు

అనుమతులు లేకుండా ఏపీకి తరలిస్తున్న మద్యాన్ని సోమవారం బూర్గంపాడు పోలీసులు సారపాకలో పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఏపీలోని ఎటపాక మండలం తోటపల్లి గ్రామానికి చెందిన సునీల్ అనే వ్యక్తి పాల్వంచలోని ఓ వైన్షాపులో మద్యం కొనుగోలు చేసి కారులో ఏపీకి తరలిస్తున్నాడు. ఈ క్రమంలో బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో ఎస్ఐ రాజేష్ సోమవారం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా కారులో తరలిస్తున్న మద్యాన్ని గుర్తించారు. రూ.96,000ల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వ్యక్తితో పాటు మద్యం అమ్మిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా పట్టుబడిన ఏపీకి చెందిన వ్యక్తి మీడియా ముసుగులో మద్యం దందా కొనసాగిస్తున్నట్లు విశ్వస నీయ సమాచారం. తెలంగాణాలో మద్యాన్ని కొనుగోలు చేసి ఏపీలో అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

తొలకరి నుండి వదలని వానలు

- ఎడతెరిపి లేని వర్షాలకు జనజీవనం అతలాకుతలం
- గ్రామాలలో లోపిస్తున్న పారిశుధ్యం
- ప్రబలుతున్న వ్యాధులు, విష జ్వరాలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఈ ఏడాది తొలకరి జల్లులతో ప్రారంభమైన వర్షాలు నేటికీ వదలడం లేదు. జిల్లా రైతాంగం సైతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అదునుగా పత్తి చేలు వేసి వరి నాట్లు వేసినప్పటికీ, అధికంగా కురుస్తున్న భారీ వర్షాలతో పలుచోట్ల పత్తి చేలు ఎర్రబారిపోవడంతో పాటు, పూత, కాతా రాలిపోయే పరిస్థితి నెలకొంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి రైతుల పై పాటు పనులు కూడా సాగడం లేదు. వర్షం వరదలకు వరి చేలకు చీడ పీడ సోకడంతో రైతులు మోతాదుకు మించి మందులు పిచికారి చేయాల్సి వస్తుంది. దీంతోపాటు వరి చేలు దుబ్బు కట్టకపోవడంతో పంట దిగుబడి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలకు వేసిన వరి నాట్లు కొట్టుక పోవడంతో పాటు పలుచోట్ల మేటలు పోసి పంట పొలాలకు భారీ గండ్లు పడ్డాయి. రైతులు వర్షం వరదలతో పడిన గండ్లను పూడ్చుకునేందుకు అనేక అవస్థలు పడుతున్నారు.

జనజీవనం అతలాకుతలం :

తొలకరి ప్రారంభం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం అతలాకుతనం అవుతుంది. గోదావరి వరదలు మరోపక్క వాగులు వంకలు పొంగి రహదారులను ముంచెత్తడంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు వెళ్లొద్దని సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ రాత్రి పగలు తేడా లేకుండా గడుపుతున్నారు. గోదావరిలో చేపల వేట జీవనాధారంగా జీవిస్తున్న జాలర్ల పడవలు, వలలు సైతం కుట్టు పోయాయి.

గ్రామాలలో లోపిస్తున్న పారిశుధ్యం :

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాలలో పారిశుధ్యం లోపిస్తుంది. గ్రామీణ రహదారులు చిత్తడిగా మారడంతో పాటు దీర్ఘకాలిక నీటి నిల్వలతో లార్వా వ్యాప్తి చెంది దోమ కాటుతో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. వైద్య నిపుణులు సైతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వ్యాధుల రుగ్మతలు ప్రబలే ప్రమాదం ఉందని జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

నిరాశ్రయుల ఆకలి తీర్చిన గాదె కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-జూలూరుపాడు

ఖమ్మం పట్టణం మున్నేరు నది పరివాహక ప్రాంతం, వరద ఉధృతికి జనావాసాలన్నీ నీట మునిగాయి. అకస్మాత్తుగా వచ్చిన వరదల కారణంగా కొంతమంది ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వీరిలో జూలూరుపాడు గ్రామానికి చెందిన, మాజీ సర్పంచ్ గాదె నరసింహారావు కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. కుమారుడు గోవర్ధన్, అల్లుడు వెంకటేశ్వరరావు (టీచర్), హరీష్, కిట్టు, భార్గవ్, రాకేష్ వీరంతా వెంకటేశ్వర నగర్ బస్తీలో నిరాశ్రయులకు తమ వంతు సాయం అందిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం 1000 మందికి ప్రత్యేకంగా ఆహారం తయారు చేయించి, స్వయంగా దగ్గర ఉండి అందిస్తున్నారు.

భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-బూర్గంపాడు

బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా రెండు రోజులపాటు అతి భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో మండల ప్రజలు అత్యంత అప్రముత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప బయటికి రావద్దని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు కోరారు. గత వారం రోజుల నుండి కురుస్తున్న అతి భారీ వర్షాల ప్రభావంతో వాగులు పొంగుతున్నాయని, కిన్నెరసాని ప్రాజెక్టు సైతం గేట్లు ఎత్తి నీటిని దిగుకు వదులుతున్నారని కిన్నెరసాని పరివాహక ప్రాంత ప్రజలు ప్రముత్తంగా ఉండాలని కోరారు. పశువుల కాపర్లు రెండు రోజుల పాటు పశువులని ఇంటి వద్ద మేపాలని, మేకలు, గొర్రెలతో అటవీ ప్రాంతంలోకి వెళ్ళవద్దని విజ్ఞప్తి చేశారు. విపత్కర పరిస్థితిలో ముంపు బాధితులకు సీపీఐ(ఎం) అండగా ఉంటుందని, అవసరమైన ప్రాంతాలకు పార్టీ కార్యకర్తలు వెళ్లి సహాయ సహకారాలలో పాల్గొనాలని బత్తుల పిలుపునిచ్చారు.

గోరంత మాఫీతో కొండంత ప్రచారం

అప్పుకు లేని షరతులు రుణమాఫీకి ఎందుకు?

- ఆన్‌లైన్ తప్పిదాలకు రైతు బాధ్యుడా?
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య



నవతెలంగాణ-అశ్వారావుపేట

గోరంత రుణం మాఫీ సేసిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొండంత ప్రచారం చేసుకుంటుందని, కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలు అన్నీ హామీలకు ఎక్కువ అమలుకు తక్కువ చందంలా ఉన్నాయి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వ పాలనా తీరు పై ఎద్దేవా చేసారు. సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కమిటీ సభ్యుడు ముళ్ళగిరి గంగరాజు అధ్యక్షతన స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం సుందరయ్య భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశానికి కనకయ్య హాజరై మండల కమిటీ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలో 5 లక్షల 7 వేల 987 మంది అర్హులైన రుణ గ్రహీతలకు రూ.415 కోట్ల 34 లక్షలు 86 వేల 332లు రద్దు చేయాల్సి ఉండగా, 1 లక్షా 88 వేల 34 మందికి 1 వేయి 816 కోట్లు మాత్రమే రద్దు చేసారని వీరి శాతం 23 మాత్రమేనని అన్నారు. అప్పు ఇచ్చేటప్పుడు లేని షరతులు రుణమాఫీ సమయంలో విధించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని ఎన్నికల వాగ్దానం చేసి అంతకంటే ఎక్కువ ఉన్న అప్పు తీర్చి తేనే ఈ రూ.2 లక్షలు అప్పు మాఫీ చేస్తాను అనడం పొమ్మనలేక పొగ పెట్టిన సామెతగా ప్రభుత్వం వ్యవహారం ఉందని అన్నారు. అర్హులు అయిన రైతుల పేర్లలోని అక్షర దోషాలు, ఆధార్‌లోని లోపాలు, రేషన్ కార్డు లేని కారణాలు చూపుతూ రుణమాఫీ ఎగవేత కే ప్రభుత్వం చూస్తున్నట్లు అనిపిస్తుంది అని అనుమానం వ్యక్తం చేసారు. రూ.30 వేలు, 50 వేలు, 75 వేలు చిన్న మొత్తాలు ఉన్న రైతులకు కొందరికి రద్దు కాకపోవడం అత్యంత బాధాకరం అని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. షరతులు లేని రుణమాఫీకి ప్రభుత్వం ఇప్పటికైనా నడుం బిగించాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గం సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, మండల కన్వీనర్ చిరంజీవి, మండల కమిటీ సభ్యురాలు తగరం నిర్మల, కారం సూరిబాబు, మడిపల్లి వెంకటేశ్వరరావు, తుట్టి వీరభద్రం, కుంజ మురళి, కలపాల వీరభద్రం, నారం అప్పారావులు పాల్గొన్నారు.



వరద బాధితులకు సీఐటీయూ విరాళాల సేకరణ

నవతెలంగాణ-కొత్తగూడెం

తెలుగు రాష్ట్రాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల సర్వం కోల్పోయిన ఖమ్మం, మహబూబాద్, విజయవాడ పట్టణాలలో వరద బాధితులకు సీఐటీయూ విరాళాల సేకరణకు పూనుకుంది. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిఐటియూ ఆధ్వర్యంలో పట్టణ, కార్మిక ప్రాంతాలలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మచారి మాట్లాడుతూ సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వరద బాధితులను ఆదుకోవాలని వరదల్లో నిరాశ్రయులై, అనాధలుగా మిగిలిన ప్రజలను, కార్మికులను, వారి కుటుంబాలను అక్కున చేర్చుకొని సిఐటియు ఆఫీసులలో వారికి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయా కుటుంబాలకు వస్తువులు, డబ్బులు, సర్వం కోల్పోయిన వారికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి డి.వీరన్న, జిల్లా నాయకులు భూక్య రమేష్, సూరం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-పాల్వంచ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), పాల్వంచలో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఈ నెల 11వ తేదీ (బుధవారం) సాయంత్రం 5 గంటల వరకు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.పద్మ ఒక ప్రకటనలో తెలియ జేశారు. పీహెచ్‌డీ /నెట్/ సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 12వ తేదీన కళాశాలలో ఉదయం 10 గంటల నుండి జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలియజేశారు. సబ్జెక్టుల వారీగా పోస్టులు ఖాళీలు ఇలా ఉన్నాయి. ఇంగ్లీష్-01, తెలుగు-01, హిందీ-01, హిస్టరీ-01, ఎకనామిక్స్ 01, ఫిజిక్స్-01, కెమిస్ట్రీ 01, జువాలజీ-01, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్-01, కామర్స్-02. మొత్తం 11 పోస్టులు ఉన్నాయి.

డెడ్ లైన్...4 వారాలు

- తెల్లంకి ముంచుకొస్తున్న అనర్హత ముంపు
- కోర్టు ఆదేశాలతో భద్రాచలంలో ఉత్కంఠ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావుకి అనర్హత ముంపు ముంచుకొస్తుంది. పార్టీ ఫిరాయింపు పై మరో నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కార్యాలయాన్ని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఒక్కసారిగా భద్రాచలంలో రాజకీయ ఉత్కంఠ నెలకొన్నది. గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కారు గుర్తుపై గెలిచిన ఏకైక ఎమ్మెల్యే భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు. కాగా మారిన రాజకీయ సమీకరణ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నుండి గెలుపొందిన వెంకట్రావు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం తన రాజకీయ గురువు అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. తెల్లంతో పాటు అతికొద్ది కాలంలోనే దానం నాగేందర్, కడియం శ్రీహరి సైతం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోగా పార్టీ మారిన ఈ ముగ్గురిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ నుండి పాడి కౌశిక్ హైకోర్టును ఆశ్రయించగా పలు దఫాలుగా వాయిదా పడుతూ వస్తున్న ఈ కేసు విచారణ సోమవారం హైకోర్టు ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారిన ముగ్గురు ఎమ్మెల్యేలపై నాలుగు వారాలలోగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఈ కేసు సుమోటోగా స్వీకరించి హైకోర్టు విచారించి నిర్ణయం తీసుకుంటుందని ఆదేశాలు జారీ చేసింది.

హైకోర్టు ఆదేశాలతో భద్రాచలంలో ఒక్కసారిగా రాజకీయ ఉత్కంఠ నెలకొన్నది. స్పీకర్ ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తాడా లేక కాంగ్రెస్ పార్టీయే రాజకీయ నిర్ణయం తీసుకొని ముగ్గురు ఎమ్మెల్యేలతో స్వచ్ఛందంగా రాజీనామాకు ప్రేరేపిస్తారా అన్నది ఇప్పుడు విస్తృతంగా నడుస్తున్న చర్చ. ఒకవేళ రాజీనామా చేసిన స్పీకర్ కార్యాలయం వేటు వేసిన భద్రాచలం నియోజకవర్గంలో ఉప ఎన్నిక రావటం తప్పనిసరి అయిన పరిస్థితులలో భద్రాచలం నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల అనంతరం రాజకీయ బలం పెరగటంతో పాటు తెల్లం వెంకటరావు రాజకీయ గురువు అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర మంత్రి బాధ్యతలలో ఉండటం అదే సందర్భంలో భద్రాచలంలో గులాబీ దళం బలహీనపడటం మరోసారి తెల్లం వెంకట రావుకే కలిసివచ్చే అవకాశాలు స్పష్టంగా కనబడు తున్నాయి. ఏదైనాప్పటికీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఒకే ఒక స్థానం గులాబీ జెండా ఎగిరేసి సంచలన సృష్టించగా మరోసారి హైకోర్టు ఆదేశాలతో భద్రాచల రాజకీయం సంచలనానికి వేదికగా మారిందని చెప్ప క తప్పదు. ఇప్పటికే భద్రాచలం అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరానని బీఆర్ఎస్ చేస్తున్న చుల కన రాజకీయాలకు భయపడే ప్రసక్తే లేదని పార్టీ అధిష్టానం తీసుకున్న ప్రతి నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్థానిక శాసన సభ్యులు తెల్లం వెంకటరావు స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

అభివృద్ధి కోసమే పార్టీ మారాను...



నియోజకవర్గం న వం గ్రా బి వృద్ధి చేసేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరాను. తాటాకు చప్పులకు భయపడే ప్రసక్తే లేదు. పార్టీ ఫిరాయింపు పై నాలుగు వారాలలో చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో నవతెలంగాణతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాభిమానంతో కార్యకర్తల కృషితో ఎన్నికల్లో గెలుపొందానే తప్ప గులాబీ పార్టీని చూసి ఇక్కడ ప్రజలు ఓటు వేయలేదని స్పష్టం చేశారు. 2014 సంవత్సరం నుండి ఫిరాయింపులను ప్రోత్సహించిన పార్టీ బీఆర్ఎస్ అన్నది జగమెరిగిన సత్యమైనప్పటికీ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పార్టీ మారిన మాపై అనవసరపు రాద్ధాంతం బీఆర్ఎస్ వాళ్ళు చేస్తున్నారు. కోర్టు తీర్పుని పూర్తిగా ధ్యానం చేసి పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి పని చేస్తానని ఈ సందర్భంగా వెంకట్రావు మరో మారు నవతెలంగాణకు స్పష్టం చేశారు.

- శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు

ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

నవతెలంగాణ-కొత్తగూడెం



ప్రజల గొడవే తన గొడవని తెలిపిన విప్లవ కవి కాళోజి నారాయణరావు జయంతిని సోమవారం సింగరేణి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సాయి సుజాత మాట్లాడుతూ ప్రజాకవి పద్మవిభూషణ్ కాళోజీ తెలంగాణ భాషాభివృద్ధికి ఎనలేని సేవ చేశారని కీర్తించారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా మన ప్రాంత భాషకు విలువనివ్వాలని చిన్నారులనుద్దేశించి మాట్లాడారు. కార్యాక్రమంలో తెలుగు భాషోపాధ్యాయినులు సీర ప్రసన్న, స్వర్ణకుమారి, సుజాత, సరస్వతి, పూల్ సింగ్. నాగలక్ష్మి, జయమ్మ మురళీధర్, శ్రీదేవి, సాబేరా, నాగదిలీప్, సంజీవ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వ్యాసరచన, వక్తృత్వ కవితా రచన పోటీలు నిర్వహించారు. బహుమతులు అందజేశారు.

గ్రంధాలయంలో : చావు, పుట్టుకలు కాకుండా బతుకునంతా తెలంగాణాకు ధారపోసిన వైతాళికుడు కాళోజి అని కొత్తగూడెం జిల్లా గ్రంధ పాలకురాలు జి.మణిమృధుల అన్నారు. జిల్లా గ్రంధాలయ సంస్థ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో : కొత్తగూడెం పురపాలక సంఘ కార్యాలయము నందు మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతా లక్ష్మి అధ్యకత జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా చిత్రపటాన్ని పూల మాల వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రములో మున్సిపల్ కమీషనర్ టి.శేషాంజన్ స్వామి, మున్సిపల్ డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ రవి కుమార్, మున్సిపల్ మేనేజర్ ప్రసాద్ రవి బాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దమ్మపేట : మండల కేంద్రం దమ్మపేటలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా కవి కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ కాళోజి నారాయణరావు జయంతిని తెలంగాణ తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవడం సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ఉపాధ్యాయులు రాంబాబు, వెంకట కృష్ణారావు, భాస్కరాచారి, మోహన్‌రావు, అమృత, పాఠశాలలో చదివిన 91-92 టెన్త్ పూర్వ విద్యార్థులు దాసరోజు రామారావు, జి.ఎస్.వెంకటేశ్వరరావు, విద్యా కమిటీ తరపున పాకనాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : అశ్వారావుపేటలోని తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాసంస్థ (టీజీ ఎంఆర్ఈ ఎస్) కు చెందిన బాలికల కళాశాల, ఉన్నత పాఠశాలల్లో సోమవారం కాళోజి జయంతి వేడుకలు పురస్కరించుకుని తెలంగాణ మాతృభాషా దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టీ.సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు సమావేశమై కాళోజి చిత్రపటానికి పూలమాలను అలంకరించి నివాళులు అర్పించారు.

పినపాక : ఉద్యమమే ఊపిరిగా జీవించిన మహనీయుడు, కవి కాళోజీ నారాయణ రావు అని ఎంపీడీవో రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య అన్నారు. సోమవారం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలో కాళోజీ జయంతి వేడుకలు నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కార్యాలయం సూపర్డెంట్ శ్రీనివాసరావు, తాసిల్దార్ కార్యాలయం సూపర్డెంట్ రమేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు బాలకృష్ణ, రమేష్, రెవిన్యూ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మా కోర్కెలు తీర్చండి...

- మధ్యాహ్న భోజన కార్మికులను కాపాడండి
- అధికారులకు మధ్యాహ్న భోజన కార్మికులు వినతి

నవతెలంగాణ-బూర్గంపాడు



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజన వంట కార్మికుల కోరికలను తీర్చండి అంటూ మండల మధ్యాహ్న భోజన వంట కార్మికులు సోమవారం మండల కేంద్రంలో నిరసన చేపట్టి విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 22 సంవత్సరాల నుండి మధ్యాహ్న భోజనం వంటను వండుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని అలాంటి భోజనాన్ని అందిస్తున్న కార్మికులు ఇప్పుడు వేతనాల ఇబ్బందితో కన్నీరు పెట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల పెంచాలని ఎన్నిసార్లు ప్రభుత్వాలకి మొర పెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కారం లభించ లేనందున త్వరలో కలెక్టర్ దృష్టికి తీసు కెళ్తామని తెలిపారు. 22 సంవత్సరాల క్రితం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించిన రోజు నుండి నేటి వరకు మధ్యాహ్నం భోజనాన్ని తయారు చేస్తున్నామని ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చిన వదిలి వేయలేదని తెలిపారు. నెలకు వెయ్యి రూపాయల జీతంతో మొదలయి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో పలు ధర్నాల రూపంలో 2000కు పెంచి ప్రతి నెల అందించే వారని అన్నారు. అప్పటి నుండి గ్రామాల్లో చిన్నాచితక కారణాలతో డ్వాక్రా గ్రూపుల పేరుతోని కార్మికులను తొలగించడానికి ప్రయత్నం చేస్తున్నారని వంట కార్మికుల సమస్యల ప్రభుత్వానికి పూర్తిగా అవగాహన ఉన్నందున న్యాయమైన కోరికలు పరిష్కరించి రాష్ట్రంలో ఉన్న 54,200 మంది వంట కార్మికులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా వంట కార్మికులకు పదివేల వేతనం చెల్లించేందుకు కృషి చేయాలని అన్నారు. కోడిగుడ్డు ప్రభుత్వ సరిపడా చేసే విధానంను అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇస్తున్న మెనూ చార్జీలు సరిపోవడం లేనందున మెనూ చార్జీలు 25 రూపాయలకు పెంచాలని అదేవిధంగా గ్యాసు వంట సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫ్రా చేసే విధంగా ప్రయత్నం చేయాల్సిందిగా కోరు తున్నామన్నారు. కోడుగుడ్లు, రాగిజావ, అల్పారం సంబంధించిన ఐదు నెలల నుండి పెండింగ్ బిల్లులు వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే తీర్చాలని నిత్యావసర సరుకులు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో తమ సమస్యలపై స్పందించి న్యాయం చేయ గలరని కోరారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని తలపెట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వంట కార్మికుల అధ్యక్షురాలు ఆకుల పద్మావతి, సెక్రెటరీ ధారావత్ బుజ్జి, ఉపాధ్యక్షురాలు వెంకటలక్ష్మి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్

నవతెలంగాణ-బూర్గంపాడు



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్ఓ) ఎల్.భాస్కర్ నాయక్ అన్నారు. సోమవారం బూర్గంపాడు మండల కేంద్రంలో మోరంపల్లిబంజర్ పీహెచ్సీ పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రంలో పీహెచ్సీ వైద్యురాలు లక్ష్మిసాహితీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్యశిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జ్వర పీడితులతో మాట్లాడి ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆయన అన్నారు. సీజనల్‌గా వ్యాధులు ప్రబలే సమయం కావడంతో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి వైద్యం అందించాలన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలతో పాటు గ్రామాల్లో ఆరోగ్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆయన వైద్యురాలిని ఆదేశించారు. 15 రోజుల కొకసారి గ్రామాల్లో బ్లీచింగ్ చల్లించాలని కార్యదర్శి సమ్మయ్యకు సూచించారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్బాల్స్, యాంటీ లార్వా ఆపరే షన్ చేయాలని వైద్యులు, సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో పాయం శ్రీను, ఎస్యూవో జీతు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వానంగా ప్రధాన రహదారులు

నవతెలంగాణ-పినపాక



గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అక్కడక్కడ రహదారులు మండల వ్యాప్తంగా అస్తవ్యస్తమయ్యాయి. ముఖ్యంగా పినపాక మండల పరిధిలోని పాత రెడ్డిపాలెం గ్రామపంచాయతీ వెంకటరావుపేట గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో నిర్మించిన కల్వర్టు బ్రిడ్జి వద్ద రహదారి పూర్తిగా దెబ్బతిని వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటువైపుగా పాఠశాల బస్సులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపై గుంటలను పూడ్చాలని రైతులు, గ్రామస్తులు వేడుకుంటున్నారు. చింతల బయ్యారం, వెంకటరావుపేట, సింగిరెడ్డిపల్లి వెళ్లాలంటే అనేకమంది రైతులు ఈ రహదారి గుండానే వెళ్తుంటారు. రాత్రి వేళలో గమనించకుండా వస్తే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కావునా అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చాలని వేడుకుంటున్నారు.

గండిపడ్డ మేడికుంట చెరువును పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-జూలూరుపాడు



మండలంలోని గుండెపుడి-రామచంద్రపురం మధ్యగల రహదారికి ఆనుకొని ఉన్న మేడికుంట చెరువు గండి పడింది. ఈ సందర్భంగా సోమవారం ఎంపీడీవో, ఇరిగేషన్ డిపార్ట్మెంట్, ఎస్సై, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు కలిసి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. విషయం తెలుసుకున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్, తహసీల్దార్ స్వాతి బిందు పరిశీలించారు.

9

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | సెప్టెంబర్ 10, 2024 | www.navatelangana.com

వయోజన విద్యా కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-ముదిగొండ

మండలంలోని 15 గ్రామాల్లో నిరక్షరాస్యుల కోసం వయోజన విద్యా కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు జీసస్ బ్లెస్సింగ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవ.డాక్టర్ జి రత్నకుమార్ చెప్పారు. మండలపరిధిలో మల్లారంలో జీసస్ బ్లెస్సింగ్ మినిస్ట్రీస్, ఇండియా ట్రస్ట్ చెన్నై వారి ఆర్థిక భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న వయోజన విద్యా కేంద్రాల కోసం శిక్షణ పొందిన టీచర్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్స్‌కు ప్రైమర్ సెట్స్, బ్లాక్ బోర్డ్స్, లైట్స్, పుస్తకాలు, పలకలను సోమవారం ఆయన పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో వయోజన విద్య శిక్షకులు ఎజ్రా, కమల, నరసరావు, మల్లారం గ్రామ మాజీ సర్పంచ్ కుక్కల లాజర్, మాజీ ఉపసర్పంచ్ నిమ్మకాయల ముత్యాలరావు, గ్రామ పెద్దలు కోలేటి రవి, నిమ్మకాయల రాజు, వెంకట్, రాజు, జయరాజు, గోపి పాల్గొన్నారు.

కొనకళ్ల సుధారాణికి విమెన్ ఎక్సలెన్స్ పురస్కారం

నవతెలంగాణ-సత్తుపల్లి

సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అభాగుల్యకు ఆపన్నహస్తం అందిస్తున్న సత్తుపల్లికి చెందిన సనాతన ఆయుర్వేద వైద్యురాలు, సుధా ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు డాక్టర్ కొనకళ్ల సుధారాణి విమెన్ ఎక్సలెన్స్ పురస్కారాన్ని అందుకుంది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జీసీఎస్ వల్లూరి ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 136వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుధారాణిని విమెన్ పురస్కారంతో ట్రస్ట్ బాధ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీసీఎస్ వల్లూరి ట్రస్ట్ ఛైర్మెన్ శ్రీనివాసరాజు, సినీ నటుడు తిరుపతి దొర్రై, మల్కాజ్‌గిరి కోర్టు జడ్జి బూర్గుల మధుసూదన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ గుత్తికొండ కిరణ్ పాల్గొన్నారు. తాను చేస్తున్న సేవలను గుర్తించి విమెన్ ఎక్సలెన్స్ పురస్కారాన్ని అందించిన జీసీఎస్ వల్లూరి ట్రస్ట్ బాధ్యులకు ఈ సందర్భంగా సుధారాణి కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు భోజనం ఏర్పాటు

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం గన్నవరం గ్రామంలో సోమవారం వృద్ధులకు మధ్యాహ్న భోజనాన్ని వైరాకు చెందిన ప్రముఖ వైద్యులు టి.శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు వారి తల్లిదండ్రులు డాక్టర్ టి.వెంకటరెడ్డి, అనసూయల పేరుతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ టి.కవిత, డాక్టర్ టి.సహృద్, టి.శౌరిలకు బహుజన అభ్యుదయ సేవా సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బహుజన అభ్యుదయ సేవా సమితి అధ్యక్షురాలు ఆదూరి మణి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో పేదరికంలో ఉన్న వృద్ధులు ప్రతిరోజూ కనీసం వంట చేసుకొనే శక్తి లేక అర్ధాకలితో పడుకొంటున్నారని, అటువంటి వారిని గుర్తించి కనీసం ఒక పూట భోజనం అయినా ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో తాము పనిచేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సొసైటీ రాష్ట్ర కన్వీనర్, లీగల్ అడ్వైజర్ ఐ.మహేందర్ నాథ్, హ్యూమన్ రైట్స్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిల్లిముంత వెంకటేశ్వరావు, హ్యూమన్ రైట్స్ సొసైటీ రాష్ట్ర ఇంచార్జ్ టి.చిన్న ఏసు, హ్యూమన్ రైట్స్ సొసైటీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కువ్వారపు విజయరావు, బహుజన అభ్యుదయ సేవా సమితి, హ్యూమన్ రైట్స్ సొసైటీ వ్యవస్థాపకులు ఆదూరి ఆనందం, పాస్టర్ ఆదూరి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి

నవతెలంగాణ - బోనకల్

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. సిపిఐ మండల కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను మండలంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 11 ముష్టికుంట్ల గ్రామంలోని బస్టాండ్‌లో పోరాట వారోత్సవాలను ప్రారంభిస్తున్నామని, ఈ ప్రారంభ సభకు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ములు జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు హాజరవుతారని ఆయన తెలిపారు.

త్రివేణిలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

స్థానిక లక్ష్మీదేవి పల్లి త్రివేణి పాఠశాలలో కాళోజీ నారాయణరావు జయంతిని, తెలుగు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రివేణి పాఠశాల డైరెక్టర్ డా.గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ కాళోజి తెలంగాణ సాహిత్యానికి చేసిన సేవలు ఎనలేనివని, మాతృభాషను కన్నతల్లిని మరిచిన నాడు మనిషి మనుగడే ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి జగదీశ్, సీఆర్‌ఓ కె.మురళీకృష్ణ, ప్రిన్సిపల్ వైవి సురేష్, శ్రీనివాస్ సింగ్, వైస్ ప్రిన్సిపల్ సౌజన్య క్యాంపస్ ఇంచార్జ్ శ్రీకాంత్ లు పాల్గొన్నారు.

రామాంజిగూడెంలో అన్నదాన కార్యక్రమం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 3వ రోజు మండల పరిధిలోని రామాంజిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద ఉత్సవ కమిటీ, గ్రామంలోని యువత ఆధ్వర్యంలో సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. దీనికి ముందు మహిళలు మండపం వద్ద పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో గ్రామ దొర, పటేల్, పలువురు రాజకీయ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కాళోజి జయంతి వేడుకలు

మణుగూరు : శివలింగాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో కాళోజి జయంతి సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘనంగా సన్మానం చేశారు. శివలింగాపురం మున్సిపాలిటీ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కే.ఉపేంద్ర ఆధ్వర్యంలో కాలోజీ నారాయణ రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ భాష దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు ఆయన మాలోత్ భద్రం, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పాఠశాలలో వకృత్వ, వ్యాసరచన, పద్య పఠన, చిత్రలేఖనం వంటి పోటీలను నిర్వహించి బహుమతులు ఇచ్చారు. ఈ సందర్భంగా మాలోత్ భద్రు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకదుర్గ, సావిత్రి, రాము, పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాకవి పద్మవిభూషణ్ కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్, పాఠశాలల్లో ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులు కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నరసాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ఐటిసి వాష్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజనానికి ముందు చేతులు ఏ విధంగా శుభ్రపరచుకోవాలో అందులోని మెళుకువలు తెలియజేశారు.

తుపాను, వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్

నవతెలంగాణ-ఇల్లందు

బొగ్గు గనులు అంతరించిన ఇల్లందులో పూర్వ వైభవం తీసుకురావడానికి పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యగులకు ఉపాధి కల్పించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సిపిఎం పార్టీ నెహ్రూ నగర్ శాఖా 5వ మహాసభలు సోమవారం కారం సంజీవయ్య నగర్ లో దేవులపల్లి యాకయ్య, కూకట్ల శంకర్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఆర్సీ జనార్ధన్ రాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మహాసభలో ప్రజా సమస్యలను గుర్తించి శాఖా సభ్యులు పనిచేయాలని పిలుపునిచ్చారు. మన రాష్ట్ర కేంద్ర మంత్రులు, ఎంపీలు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. తుపాను వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై వత్తిడి తెచ్చి వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. ఈ మహాసభలలో పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు తెచ్చిన మానిఫెస్టో పై వత్తిడి తేవాలని అన్నారు. అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. మున్సిపాలిటీలో పరిశుభ్రమైన నీరు మిషన్ భగీరథనీరు, పారిశుధ్యం పనులు ప్రతీ రోజు ఇవ్వాలని ,కోతులు, కుక్కలు మనుషులను ముఖ్యంగా వృద్ధులు, స్త్రీలు చిన్న పిల్లలు కరచి భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయని వాటిని నివారించాలని స్థానిక సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని కోరారు. ఈ సభలలో మన్యం మోహన్ రావు, ఆలేటి కిరణ్ కుమార్, తాళ్లూరి కృష్ణ, సుల్తాన, తాండ్ర కాంత, మన్యం మమత, బత్తుని సత్యనారాయణ, ఆడేపు కష్ణఅన్నం నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్

నవతెలంగాణ- ఖమ్మం



రాగల 3 రోజులు వాతావరణ శాఖ జిల్లాకు భారీ వర్ష సూచన చేసిందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ నుండి ఆర్డీవోలు, తహశీల్దార్లతో వర్షాల జాగ్రత్తలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో తహశీల్దార్లు, పోలీస్, పంచాయతీ, ఇరిగేషన్ అధికారులతో టచ్‌లో ఉండి, పరిస్థితులను బట్టి సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. గతంలో ప్రమాదకరంగా మారిన కల్వర్టులు, క్యాజ్ వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సమస్యలు తలెత్తే పరిస్థితి వస్తే, గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను అడ్డుగా పెట్టి రాకపోకలు నిషేధించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రధాన కార్యస్థానంలో ఉండేలా పర్యవేక్షణ చేయాలన్నారు.

పునరావాస కేంద్రాల్లో సమస్యలు తలెత్తకుండా చూడాలి

రాకాసితండా, జల్లేపల్లి పునరావాస కేంద్రాలను సందర్శించిన జడ్పీ సీఈవో

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



మండల పరిధిలోని రాకాసి తండా, జల్లేపల్లి గ్రామాలలో సోమవారం జడ్పీ సీఈవో దీక్షత రైనా సందర్శించారు. వరదలు వచ్చి నిరాశ్రయులైన రాకాసి తండా వరద బాధితులను చూచి చలించిపోయారు. బాధితులకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకారం ఉంటుందని ఆమె ధైర్యం చెప్పారు. అనంతరం జల్లేపల్లి గ్రామంలోని పునరావాస కేంద్రాన్ని సందర్శించి నిరాశ్రయులైన ప్రజలకు అన్ని విధాలుగా భోజనం ఏర్పాట్లు సమస్యలు తలెత్తకుండా చేయాలని మండల అధికారులకు సూచించారు. జల్లేపల్లి పునరావాస కేంద్రంలో రాకాసి తండా వరద బాధితులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈవో మాట్లాడుతూ..ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన గ్రామపంచాయతీలలో పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఎంపీఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అనూష, జల్లేపల్లి పంచాయతీ కార్యదర్శి రమేష్, రెవిన్యూ జూనియర్ అసిస్టెంట్ షేక్ అజీజ్, ఏఎన్ఎం సుగుణ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వైరా ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-వైరా



వైరా మున్సిపాలిటీ నాలుగో వార్డ్‌లో వరద ముంపు గురైన రాజీవ్ నగర్ కాలనీని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం రిజర్వాయర్‌ను ఆనుకొని ఉన్న రాజీవ్ నగర్ కాలనీ రిజర్వాయర్లో తెప్పపై ప్రయాణించి కలెక్టర్ పరిశీలించారు. వరద ముంపుకు గురైన కాలనీ ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. వరద తగ్గే వరకు ప్రభుత్వం కల్పించిన వసతి గృహంలోనే ఉండాలని కోరారు. కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ శ్రీనివాసరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, మండల అధికారులు పాల్గొన్నారు.

మావోయిస్టుల బంద్ ప్రశాంతం

- నిఘా కట్టు దిట్టం చేసిన పోలీసులు

నవతెలంగాణ- చర్ల:



అటు చత్తీస్‌గఢ్ ఇటు తెలంగాణలో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ సోమవారం మావోయిస్టులు పిలుపునిచ్చిన బంద్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా, పాక్షికంగా జరిగింది. చత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతవాడ జిల్లా ఆండ్రి గ్రామంలో ఈ నెల 3న జరిగిన ఎన్కౌంటర్‌లో 9 మంది మావోయిస్టులు మృతి చెందగా అందులో రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏసూబ్ కూడా ఉన్నారు. అదేవిధంగా తెలంగాణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రఘునాథపాలెం వద్ద జరిగిన ఎన్కౌంటర్లో లచ్చన్న మృతి చెందడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చని అడవుల్లో రక్తపుటేర్లు ప్రవహించేలా చేస్తున్నాయని వరుస ఎన్కౌంటర్లకు నిరసనగా సోమవారం మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ బందుకు పిలుపునిచ్చారు.

-కట్టుదిట్టం చేసిన పోలీసులు

పోలీసులు అడవులను జల్లెడ పడుతూ వచ్చే పోయే వాహనాలను తనిఖీ చేస్తూ బంద్ పాక్షికంగా జరిగే విధంగా చర్యలు చేపట్టారు. సిఐ రాజు వర్మ నేతృత్వంలో నర్సారెడ్డి కూంబింగ్ నిర్వహిస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చేపట్టారు. పోలీసులు ఏర్పాటుచేసిన భద్రత వలయాన్ని మావోయిస్టు చేదించలేక చెప్పబడ్డారని పలువురు విశ్లేషిస్తున్నారు. ఏది ఏమైనా ఏజెన్సీలో యుద్ధమేఘాలు అలుముకున్నాయని చెప్పవచ్చు. అరణ్య గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాలు కల్పన జరగాలని ఒకపక్క పోలీసులు అంటూ ఉంటే బడా కంపెనీలకు అడుగులను దారాదత్తం చేయడానికి ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీని లేకుండా చేయడం కోసం చూస్తున్నాయని మావోయిస్టులు వాదిస్తున్నారు. ఇటు పోలీసులు అటు మావోయిస్టు మధ్య అరణ్య గ్రామాల సామాన్య ప్రజలు చిగురుటాకుల నలిగిపోతున్నారని పలువురు విశ్లేషిస్తున్నారు. ఏదేమైనాప్పటికిని భవిష్యత్తు ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.

అతిథి అధ్యాపక పోస్టులకు ఆహ్వానం



మణుగూరు: మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మణుగూరు నందు ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ 1, ఎకనామిక్స్ 1 పోస్టులకు అతిథి అధ్యాపకులుగా నియమించడానికి అర్హత కలిగిన వారు అప్లై చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.భద్రయ్య పత్రిక ప్రకటనలో కోరారు. సెప్టెంబర్ 11 సాయంత్రం ఐదు గంటల లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మణుగూరు నందు అప్లై చేసుకోవాలని కోరారు. పీజీలో 55% మార్కులు కలిగి ఉండాలని, నెట్, సెట్ మరియు పిహెచ్డి కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ తెలియజేశారు. సెప్టెంబర్ 12 ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి

నవతెలంగాణ- బూర్గంపాడు

ప్రముఖ ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎంపీడీవో జమలారెడ్డి హాజరై నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనను తన కవితల ద్వారా దుయ్యబట్టిన మహోన్నత వ్యక్తి కాళోజీ అన్నారు. ప్రతిఒక్కరూ కాళోజీ అడుగు జాడల్లో నడవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీవో సునీల్ శర్మ, సూపరింటెండ్ రవీందర్, యూడీసీ రఘు, టైపిస్ట్ మాధవి, ఉపాధిహామీ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

19న ఐద్వా జిల్లా మహాసభలు

రాష్ట్ర కమిటీ సభ్యురాలు డి సీతాలక్ష్మి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభలు సెప్టెంబర్ 19న భద్రాచలం పట్టణంలో జరగనున్నాయని ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మి పిలుపునిచ్చారు. సంఘం పట్టణ ఆఫీస్ బేరర్స్ సమావేశం సున్నం గంగ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో డి. సీతాలక్ష్మి మాట్లాడుతూ.. ఈ నెల 19న జరగనున్న జిల్లా మహాసభల సందర్భంగా భద్రాచలం పట్టణంలో మహిళలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో మహిళలపై జరుగుతున్న దాడులు మహిళలకు రక్షణ కల్పించే చట్టాలు అమలపై నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలులో ఉచిత ఆర్టీసీ బస్సు తప్ప, మిగతా గ్యారెంటీలు అమల్లోకి రాలేదని అన్నారు. కావున మిగతా ఐదు గ్యారెంటీలు పగడ్బందీగా అమలు చేయాలని ఆమె అన్నారు. పట్టణంలో ప్రతి ఏరియాలో విషపు జ్వరాలతో ప్రజలు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి ఏరియాలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎన్.లీలావతి, ఏ సక్కుబాయి, జి.జీవన్ జ్యోతి, జి.రాధ, యు.జ్యోతి, ఎం రమ, గౌతమి ఏజేఎం సుబ్బలక్ష్మి, జి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జానంపేట పీహెచ్‌సీలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించాలి

- ఏఐటీయూసీ పినపాక మండల కార్యదర్శి తోగటి కుమార్

నవతెలంగాణ-పినపాక

మండలంలోని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌ను వెంటనే నియమించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి తోగటి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ పీహెచ్సీలో ఉన్నటువంటి మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌ను ట్రాన్స్ఫర్ చేశారని, ఆయన స్థానంలో వేరే వారిని వెంటనే నియమించాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో రోగాల బారిన పడినవారు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కావున వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాలను పట్టించుకోకపోతే ఊరుకునేది లేదన్నారు. పోస్టును భర్తీ చేయకపోతే సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

అశ్వారావుపేట ఎండీఓగా ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-అశ్వారావుపేట



అశ్వారావుపేట ఎండీఓగా పి.ప్రవీణ్ కుమార్ నియమితులు అయ్యారు. ఆయన సోమవారం ఇక్కడ విధుల్లో చేరారు. అశ్వారావుపేట మొదటి సారిగా వచ్చిన ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. గతంలో ఎండీఓగా పని చేసిన జీ.శ్రీనివాస్ జూన్ లో పదవీ విరమణ పొందారు. ఎంపీఈఓ సీతారామరాజు సైతం అనారోగ్యంతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళడంతో పాలన స్తంభించింది. ప్రస్తుతం దుమ్ముగూడెం నుండి డిప్యుటేషన్‌పై వచ్చిన ఎంపీఈఓ ప్రసాద్ ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గత రెండు నెలలు ఇక్కడ ఇన్‌చార్జ్ పాలనే సాగింది. నియోజక వర్గం కేంద్రం కావడం, త్వరలో పంచాయతీ ఎన్నికలు సమీపించడంతో పూర్తికాలం ఎండీఓ కావాలనే ఉద్దేశ్యంతో జిల్లా కలెక్టరేట్ జితేష్ వి.పాటిల్ ఇల్లందు మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్ ను పూర్తి కాలం ఎండీఓగా ఇక్కడకు బదిలీ చేసారు. ఖమ్మం జిల్లా వైరా వాసి అయిన ప్రవీణ్ కుమార్ 1992లో పంచాయతీ రాజ్ శాఖలో ఉద్యోగం పొంది మొదటిగా జూలూరుపాడు లో విధులు నిర్వహించారు. అనంతరం ఏన్కూర్, కూనవరం మండలాల్లోను, గ్రామీణ తాగునీటి సరఫరా, డీఆర్డీఏ, డ్వామా లాంటి జిల్లా స్థాయి కార్యాలయాల్లో విధులు నిర్వహించారు. ఎండీఓ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీలో రామచంద్రరావు, ఎస్.ఏ కుమారి, యూడీసీ శ్రీనివాసరావు, పేరాయిగూడెం కార్యదర్శి శ్రీరామ మూర్తిలు పాల్గొన్నారు.

గ్రేడ్ సి మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి

- కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు జీతభత్యాలకు ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలి
- పన్ను వసూలు 100 శాతం దాటిన మున్సిపాలిటీలకు ఈ గ్రాండ్ విడుదల చేయాలి
- జాతీయ 16వ ఆర్థిక సంఘం ప్రతినిధుల సదస్సులో మున్సిపల్ చైర్మెన్ డీవి

నవతెలంగాణ-ఇల్లందు



రాష్ట్ర జీఎస్టిపి కంటే జనాభా ఆధారంగా 16 ఆర్థిక సంఘం గ్రాంట్ ను విడుదల చేయడం వల్ల సీ గ్రేడ్ మున్సిపాలిటీలో ఏ విధంగా నష్టపోతున్నాయో అనేక సమస్యలను జాతీయ 16వ ఆర్థిక సంఘం దృష్టికి ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వర రావు తీసుకెళ్లారు. హైదరాబాద్ ప్రజా భవన్ లో సోమవారం 16వ ఆర్థిక సంఘం ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్రం నుండి ఐదుగురు మేయర్లకు 10 మంది మున్సిపల్ చైర్మన్లు మాత్రమే ఆహ్వానించారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ డీవీకి పాల్గొనడానికి అరుదైన అవకాశం దక్కింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా పదవ ఆర్థిక సంఘ చైర్మన్ అరవింద్ పంగారియ, ఆర్థిక సంఘ ఫైనాన్స్ సభ్యులు సిడిఎం కమిషనర్ వీపి గౌతమ్, జిహెచ్ఎంసి కమిషనర్ హైడ్రా తదితరులు పాల్గొన్నారు. సమావేశంను ఉద్దేశించి ఫైనాన్స్ సభ్యులు మాట్లాడుతూ 16 ఫైనాన్స్ నిధులు మున్సిపాలిటీలకు ఏ విధంగా కేటాయిస్తే బాగుంటుందోనని పలువురిని అడిగారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ మాట్లాడారు. రాష్ట్ర జిఎస్ డిపి కంటే జనాభా ఆధారంగా 16వ ఆర్థిక సంఘం గ్రాంటును విడుదల చేయడం గురించి సలహాలు ఇచ్చారు. గ్రేడ్ సి మున్సిపాలిటీలో ఎదుర్కొంటున్న సమస్యలపై సమస్యలు లేవనెత్తారు. మున్సిపాలిటీలో కొత్త అసెస్మెంట్ ల అభివృద్ధికి ఎటువంటి అవకాశం లేదు, ఎందుకంటే పట్టణ స్థానిక సంస్థ మొత్తం ల్యాండ్ స్కేల్‌కు కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన సింగరేణి సంస్థ లీజుకు తీసుకుంది. రాష్ట్రంలో ఇతర మున్సిపాలిటీలో పోల్చినప్పుడు ఈ మున్సిపాలిటీకి 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయింపు చాలా తక్కువ, ఈ కొద్ది నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం చాలా తక్కువ ఉందని తెలిపారు. కాబట్టి రాష్ట్ర జిఎస్‌డిపి కంటే విడుదల చేయడం వలన ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. 15 ఫైనాన్స్ కమిషన్ వారు విడుదల చేసిన నిధులను హరితహారం, డీఆర్సీసీ మెయింటెనెన్స్ కు సంబంధించిన జీతభత్యాలు చెల్లించుటకు అవకాశం కల్పించాలని కోరారు. 16వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలతో ద్రవ వ్యర్థాల నిర్వహణ కింద మున్సిపాలిటీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి నిధులు కేటాయించడం గురించి మాట్లాడారు. అనంతరం సిడిఎంఎ కమిషనర్ విపి గౌతమ్ చిన్న మున్సిపాలిటీలలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు జీతభత్యాలు చెల్లించడంలో నిధులు సరిపోక అనేక మున్సిపాలిటీలు ఇబ్బంది పడుతున్నాయని వాటిని గమనించి సంవత్సరానికి జీతాలు చెల్లించుటకు సపరేట్ గ్రాంట్ సిడిఎంఏ నుండి విడుదల చేయాలని కోరారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన కేవీకే శాస్త్రవేత్తల బృందం

మణుగూరు: మణుగూరు, అశ్వాపురం మండలంలోని పలు గ్రామాల్లో గత వారం రోజులుగా కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను కేవీకే శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయ శాఖ అధికారుల బృందం సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వీ.లక్ష్మి నారాయణమ్మ, డాక్టరు శ్రీనివాసరావు బి. శివ, వ్యవసాయ శాఖ ఏడిఏ తాతారావు, లక్ష్మణ్ రావు, ఏఈఓలు 50 మంది రైతులు పాల్గొన్నారు. రైతులకు వర్షాల వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని జాకారం గ్రామం ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రకృతి ప్రేమికులు, ఫ్రూటేరియన్ షేక్ మహమూద్ పాషా సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కాళోజీ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు.



గిరిజనులకు పోలీసుల చేయూత..

- 3 వాగులు దాటి 8కిలోమీటర్లు అభయారణ్యంలోకి వెళ్లి నిత్యావసరాలు పంపిణీ

నవతెలంగాణ-గూడూరు

మహబూబాబాద్ జిల్లా గూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అత్యంత మారుమూల ఏజెన్సీ గ్రామానికి పోలీసులు వెళ్లి వరదల్లో చిక్కుకున్న గిరిజనులకు తమ చేయూతను అందించారు. సరిగ్గా రోడ్డు సౌకర్యం కూడా లేని దొరవారి తిమ్మాపురం గ్రామానికి వెళ్లేందుకు.. 3 వాగులు దాటి.. 8 కిలోమీటర్ల అభయ అరణ్యంలో ప్రయాణించారు. జిల్లాలో 10రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దొరవారి తిమ్మాపురం గ్రామానికి బాహ్య ప్రపంచంతో రాకపోకలు తెగిపోయాయి. దాంతో అక్కడి ప్రజలు నిత్యావసరాలు లభించక విలవిల్లాడుతున్నారు. విషయం తెలుసుకున్న గూడూరు సీఐ బాబురావు గూడూరు, కొత్తగూడ, గంగారం ఎస్ఐలు గిరిధర్‌రెడ్డి, కుష కుమార్, రవికుమార్, పోలీస్ సిబ్బందితో కలిసి ఆ గ్రామాన్ని సందర్శించారు. రెండు ట్రాక్టర్ల సహాయంతో అడవిలో 8 కిలోమీటర్లు వెళ్తుండగా 3సార్లు బురదలో ట్రాక్టర్ దిగబడింది. అయినా వెనుదిరగకుండా మరో ట్రాక్టర్ సహాయంతో బయటకు తీసి ప్రమాదకరంగా ప్రవహిస్తున్న మూడు వాగులను దాటి అతి కష్టంమీద గ్రామానికి చేరుకున్నారు. సహాయం కోసం ఎదురుచూస్తున్న ఆ గ్రామంలోని23 కుటుంబాలకు 15 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసి భరోసా నిచ్చారు. గిరిజనులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వర్షం సైతం లెక్కచేయకుండా వాగులు వంకలు దాటుతూ ఏజెన్సీ గ్రామానికి వచ్చి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసిన పోలీసులకు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొరవారి తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెనుక ప్రభాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్మికుని ఆత్మహత్యాయత్నం

- ఏడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు

నవతెలంగాణ -బిజినేపల్లి



ఏడు నెలలుగా జీతం రాకపోవడంతో గ్రామ పంచాయతీ కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని అల్లీపూర్‌లో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లీపూర్‌కు చెందిన సూరంపల్లి బాలపీరు(57) గ్రామ పంచాయతీలో అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడిగా కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్నాడు. ఏడు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. జీతం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని కోరాడు. జీతం ఇవ్వడం లేదని రెండు నెలల నుంచి విధులకు హాజరు కావడం లేదు. ఈ క్రమంలో తోటి కార్మికులందరికీ జీతాలు చేసి తనకు జీతం ఇవ్వక పోవడంలో బాలపీరు మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ముందే పురుగుల మందు తాగాడు. ఇతర కార్మికులు వెంటనే నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు బంధువులు తెలిపారు. బాలపీరుకు భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


నవతెలంగాణ-పెద్ద అడిశర్లపల్లి

సరదాగా కోసం వెళ్లి చేపలు పడుతూ ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి గల్లంతైన వ్యక్తి మృతదేహం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని ఏఎమ్మార్పీ కాల్వలో సోమవారం లభ్యమైంది. గుడిపల్లి ఎస్ఐ డి.నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణానికి చెందిన మహ్మద్ జుబేర్(47) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం సాయంత్రం స్నేహితుడు ఆరిఫ్‌తో కలిసి మండలంలోని అక్కంపల్లి జలాశయం ప్రధాన గేట్ల దిగువన ఏఎమ్మార్పీ కాలువ వద్దకెళ్లారు. అక్కడ చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యాడు. ఆరిఫ్ వెంటనే పోలీసులకు సమాచారం అందజేశాడు. దాంతో ఎస్ఐ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి గేట్ల ద్వారా నీటి విడుదల ఆపేశారు. జాలరులతో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ రాత్రి సమయం కావడంతో జుబేర్ ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టగా కాలువలో మృతదేహం లభ్యమైంది. సంఘటనా స్థలాన్ని కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్ గౌడ్ పరిశీలించి ప్రమాద విషయాలు ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

గణేష్ మండపం వద్ద అపశృతి

- పారిశుధ్య పనులు చేస్తూ విద్యుత్ షాక్‌తో సపాయి కార్మికుని మృతి

నవతెలంగాణ-హవేలి ఘనపూర్



గణేష్ మండపం సమీపంలో అపశృతి నెలకొంది. మండపం వద్ద శుభ్రం చేసేందుకు వెళ్లిన గ్రామ పంచాయతీ కార్మికుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా హవేలి ఘనపూర్ మండలంలోని రాజపేట్ గ్రామంలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజపేట్ గ్రామ పంచాయతీకి చెందిన పారిశుద్ధ కార్మికుడు.. దాసరి పోచయ్య (60) రోజు మాదిరిగానే సపాయి కార్మికునిగా విధులు నిర్వహించేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. గణేష్ మండపం వద్దకు వెళ్లి అక్కడ శుభ్రం చేస్తున్నాడు. అక్కడ ఏర్పాటు చేసిన జే వైరును పక్కన పెట్టేందుకు పట్టుకోగా పోచయ్యకు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గణేష్ మండప నిర్వాహకులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా కార్మికుడు పోచయ్య అప్పటికే మృతిచెంది ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హవేలి ఘనపూర్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సఫాయి కార్మికుడు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

నీటి గుంటలో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మద్యం మత్తులో నీటి గుంటలో పడి వ్యక్తి ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటన కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ మండలంలో జరిగింది. ఎస్ఐ కమలాకర్, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్ గ్రామపంచాయతీ రైస్‌మిల్ కాలనీకి చెందిన షేక్ హుస్సేన్‌కు భార్యతో మనస్పర్థల కారణంగా పదేండ్ల కిందట విడాకులయ్యాయి. అప్పటి నుంచి హుస్సేన్ తన అక్క సబేరా బేగం ఇంటి వద్ద ఉంటున్నాడు. ఆదివారం రాత్రి మద్యం తాగాడు. ఆ తర్వాత బీడీలు తెచ్చుకుంటానని ఇంటి నుంచి వెళ్లాడు. బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఉదయం ఏడు గంటలకు ఇంటి పక్కన ఉన్న నీటి గుంటలో పడి ఉండగా చూశారు. అప్పటికే మృతిచెందాడు. అతని అక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులను ఆదుకోవాలి

23న కార్మిక సంక్షేమ కార్యాలయం ఎదుట ధర్నా

- ప్రభుత్వ పథకాల నిర్వహణను ఇన్సూరెన్స్ కంపెనీలకివ్వొద్దు : భవన నిర్మాణ కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల నిర్వహణను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 23న హైదరాబాద్‌లోని కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు.

పదో తేదీ నుంచి 22వ తేదీ వరకు దశలవారీగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర గౌరవాధ్యక్షులు వంగూరు రాములు అధ్యక్షతన జరిగింది. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకరం కోటంరాజు తీర్మానం ప్రవేశపెట్టారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో వారితోపాటు ఎ.రాజు, ఇ.జగన్, ఆర్.వెంకటేష్(సీఐటీయూ), జి.అనురాధ(ఐఎఫ్‌టీయూ), జి.నాగయ్య (ఐఎఫ్‌టీయూ), సాంబశివుడు (ఐఎఫ్‌టీయూ), కామల ఐలయ్య (బీఎస్‌ఆర్‌కేఎస్), ఎస్. కుమార్, చంద్రమౌళి (ఎస్‌బీఎస్‌కేఎస్), పాలడుగుల రమేష్, పోతరాజు కుమారస్వామి (బీఆర్‌టీయూ), ఇ. చిన్నారావు, జె. అనిల్ కుమార్ (టీబీఎస్‌కేటీయూ) ఆమోదం తెలుపుతూ మాట్లాడారు. తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం లాంటి సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పుకోవడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీని నియమించి నిధులను దారి మళ్లించకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని కోరారు.

సంక్షేమ పథకాల అమలు కోసం ఇన్సూరెన్స్ కంపెనీలను టెండర్లకు ఆహ్వానించడం దారుణమన్నారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైయిజరీ కమిటీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో 25 లక్షల మంది భవన, ఇతర నిర్మాణ కార్మికులుంటే 15.9 లక్షల మంది బోర్డులో రెన్యూవల్ చేసుకున్న వర్కర్లుగా మాత్రమే ఉన్నట్టు చూపడం దారుణమన్నారు.

గిగ్ వర్కర్లకు ప్రీమియం ఎక్కడ నుంచి చెల్లిస్తారని నిలదీశారు. భవన నిర్మాణ కార్మికుల కడుపు కొట్టి పెద్ద పెద్ద ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టటం కోసమే ప్రభుత్వం టెండర్లకు పిలిచిందని విమర్శించారు. ఇన్యూరెన్స్ కంపెనీలకు ఇవ్వటం వలన నేడు కార్మికులకు వస్తున్న స్కీములు అందకుండా పోతాయన్నారు. చిన్న చిన్న కారణాలు చూపి తప్పులు వెతికి కార్మికులకు నష్టపరిహారాలు అందకుండా చేస్తాయని వాపోయారు. సెస్సు నిధులను ఎవరు వసూలు చేస్తారు ? ఉన్న నిధులకు రక్షణ ఎవరు? అని ప్రశ్నించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను తిరిగి తీసుకోవాలి

- వైద్యారోగ్యశాఖ కమిషనర్‌కు టీయూఎంహెచ్ఇయూ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



వికారాబాద్ జిల్లాలో తొలగించిన ల్యాబ్ టెక్నీషియన్స్ గ్రేడ్ 2, ఫార్మాసిస్ట్ గ్రేడ్ 2లను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కార్యదర్శులు బి. విజయవర్ధన్ రాజు, ఎస్.నవీన్ కుమార్, సుభాష్ చంద్ర తదితరులు సోమవారం హైదరాబాద్‌లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు. టర్మినేషన్ ఆర్డర్స్ రద్దు చేసి యథావిధిగా కొనసాగించాలని కోరారు. 104 ఎఫ్ డీహెచ్ఎస్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో 2009 నుంచి ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2లు పని చేస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 20న ఈ సర్వీసులను రద్దు చేసిందని తెలిపారు. 1,098 మంది సిబ్బందిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేసి కొనసాగిస్తున్నారని చెప్పారు. 2024-2025 సంవత్సరానికి గానూ కొనసాగింపు ఉత్తర్వులు రావాల్సి ఉన్నదని గుర్తుచేశారు. ఈ పరిస్థితిలో ఏడుగురు ఫార్మాసిస్ట్ గ్రేడ్ 2లను, ఆరుగురు ల్యాబ్ టెక్నీషియన్లకు ఈ నెల 4న వికారాబాద్ జిల్లా అధికారి తొలగించడం పట్ల విచారం వ్యక్తం చేశారు. 104 ఉద్యోగులందరినీ యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించి జిల్లాల్లో సర్దుబాటు చేసి వేతనాలు చెల్లిస్తుందనీ, వీరి కొనసాగింపు ఉత్తర్వుల ఫైల్ ఆర్థిక శాఖలో ఉందని చెప్పారు. ఈ పరిస్థితిలో జిల్లా అధికారులు తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడి అన్యాయానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాలిచ్చి యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో వికారాబాద్ జిల్లాలోని ఫార్మసిస్టులు ల్యాబ్ టెక్నీషియన్లు తొలగించబడ్డ వారున్నారు.

అనంతరం నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనే కాంట్రాక్ట్ ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందని వాపోయారు. సీఎం ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో ఇద్దరినీ, స్పీకర్ ప్రాతినిథ్యం వహిస్తున్న వికారాబాద్‌లో 14 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను జిల్లా అధికారులు తొలగించారని తెలిపారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీనియార్టీ మేరకు పదోన్నతులివ్వాలి -వీవీపీ కమిషనర్‌కు వినతి

తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో ల్యాబ్ టెక్నీషియన్ల పదోన్నతులను సీనియార్టీ ప్రకారం ఇవ్వాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) డిమాండ్ చేసింది. 30 ఏండ్లుగా పని చేస్తున్న సీనియర్లను కాదని జూనియర్లకు పదోన్నతులు కల్పించారని యూనియన్ అభ్యంతరం తెలిపింది. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర నాయకులు వి.భూలక్ష్మి ఆధ్వర్యంలో టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సంబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించినట్టు కమిషనర్ నాయకులతో చెప్పారు.



ప్రభుత్వంపై ప్రతిపక్షాల రాద్ధాంతం

- వరదలతో నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-మల్హర్‌రావు/కాటారం

తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని, రైతులు అధైర్యపడొద్దని, అర్హత కలిగిన ప్రతి రైతుకూ రుణమాఫీ అవుతుందని ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హత ఉన్న రైతులందరికీ రుణమాఫీ అవుతుందని తెలిపారు. కొంతమంది ప్రతిపక్ష నాయకులు సాంకేతికపరంగా బ్యాంకుల్లో ఏర్పడిన సమస్యలను అనువుగా చేసుకొని రాజకీయం చేసే ప్రయత్నం చేసున్నారని ఆరోపించారు. ఒక వైపు ప్రకృతి వైపరీత్యంతో ఏర్పడిన అధిక వర్షాలతో వరదలు వచ్చి రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నష్టం జరిగి ప్రజలు అల్లాడిపోతుంటే.. ప్రతిపక్షాలు సహాయక చర్యల్లో పాల్గొనకుండా ఇలా రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు చేరువలో ఉంటూ సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా వరద సహాయ చర్యలు చేపట్టేలా అధికార యంత్రాంగం ప్రయత్నం చేస్తుందని అన్నారు. వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వరదలు వచ్చి పంటనష్టం జరిగినా, ఇండ్లు కూలిపోయినా నష్ట పరిహారం అందించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టంపై పూర్తి స్థాయిలో సర్వే చేపట్టి పంట నష్ట పరిహారం చెల్లిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీని రద్దు చేయాలి

- సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా
- మద్దతు తెలిపి ధర్నాలో కూర్చున్న ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని డప్పూరు, మల్గీ, వడ్డీ గ్రామాల్లో ఏర్పాటు చేసే ప్రమాదకరమైన ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆయా గ్రామాల రైతులు సోమవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. రైతుల ధర్నాకు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మద్దతు తెలిపి.. రైతులతో కలిసి ధర్నాలో కూర్చున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మూడు పంటలు పండే పచ్చని ప్రాంతంలో వ్యవసాయాన్ని నాశనం చేసేలా ఫార్మాసిటీని పెట్టొద్దని డిమాండ్ చేశారు. వ్యవసాయంపైనే ఈ గ్రామాల ప్రజల జీవనాధారం ఉన్నదని, ఫార్మాసిటీ వల్ల ఇక్కడ వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న మంజీరా నది కలుషితమై సంగారెడ్డి జిల్లాతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా కూడా పూర్తిగా కలుషితమవుతుందని తెలిపారు. తాగు నీళ్లు లేక ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందన్నారు. 2013 భూసేకరణ చట్టంలో పంటలు పండే చోట పరిశ్రమలు పెట్టొద్దని ఉన్నప్పటికీ అధికారులు గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రజలకు నష్టం చేసే ఫార్మాసిటీని తక్షణమే రద్దు చేయాలని, లేని పక్షంలో ఫార్మాసిటీ రద్దు చేసే వరకు రైతుల పక్షాన ఆందోళన చేస్తామని చెప్పారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ.మాణిక్యం, గ్రామ రైతు నాయకులు రవీందర్, శివరాజ్, శ్రీకాంత్ మూడు గ్రామాల రైతులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తాత్కాలికంగా ట్రిపుల్ ఐటీ విద్యార్థుల నిరసన వాయిదా

నవతెలంగాణ-ముథోల్

నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో సమస్యల పరిష్కారం కోసం ఐదు రోజులుగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు తాత్కాలికంగా విరమించారు. తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ (టీఎస్ఎఎస్) ఆధ్వర్యంలో శాంతియుత నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. సోమవారం ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ విద్యార్థులతో చర్చలు జరిపారు. సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో తమ నిరసన, ర్యాలీలను తాత్కాలికంగా నిలిపివేసినట్టు టీఎస్ఎఎస్ ప్రెసిడెంట్ ఆకాష్, జనరల్ సెక్రెటరీ యశ్వంత్ ప్రకటించారు. ట్రిపుల్ ఐటీ పరిపాలన విభాగం నుంచి హామీ పత్రాన్ని స్వీకరించామని వెల్లడించారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించకుంటే మళ్లీ నిరసన ప్రారంభిస్తామన్నారు.

గ్రీన్ ఫార్మాసిటీ పనులు వేగవంతం చేయండి

- కాలుష్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోండి : సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ శివార్లలో ఏర్పాటు చేస్తున్న గ్రీన్ ఫార్మాసిటీ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉప యోగించుకోని కాలుష్య రహితంగా ఉండేలా గ్రీన్ ఫార్మాసిటీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ముచ్చర్ల పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రయినేజీలు తదితర మౌలిక సదుపాయాల నిర్మాణాలను వీలైనంత తొందరగా చేపట్టాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకనుగుణంగా మౌలిక సదుపాయాలు ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే పేరొందిన ఫార్మా కంపెనీలు ముందుకొస్తున్నాయనీ, త్వరలోనే వాటితో సంప్రదింపులు జరుపుతామని సీఎం తెలిపారు. ఔషధాల తయారీ, బయోటెక్, లైఫ్ సైన్సెస్ కంపెనీలకు గ్రీన్ ఫార్మాసిటీ సింగిల్ స్టాప్‌గా ఉండాలని అభిప్రాయపడ్డారు. యాంటీ బయాటిక్స్, సింథటిక్ డ్రగ్స్, రసాయనాలు, విటమిన్లు, వ్యాక్సిన్లు, డ్రగ్ ఫార్ములేషన్స్, హెర్బల్ తదితర ఉత్పత్తులకు ఫార్మాసిటీలో ప్రాధాన్యముంటుందని చెప్పారు. పరిశోధన, శిక్షణ, నైపుణ్యాలకు అవసరమైన ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. హెల్త్‌కేర్, ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా అందులో కోర్సులు నిర్వహించాలని సూచించారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీజీఐఐసీ ఎమ్‌డీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ తుది కీలో తప్పులు!

- విద్యాశాఖకు అభ్యర్థుల ఫిర్యాదు
- ఫలితాల విడుదల ఆలస్యమయ్యే అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాతపరీక్షలకు సంబంధించి విద్యాశాఖ విడుదల చేసిన తుది కీలో తప్పులు ఉన్నాయంటూ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం పెద్దఎత్తున అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖకు తరలివచ్చారు. తుది కీలో కొన్ని ప్రశ్నలకు జవాబులు తప్పుగా ఉన్నాయంటూ అందుకు సంబంధించిన ఆధారాలతో సహా పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు లింగయ్యను కలిసి ఫిర్యాదు చేశారు. వాటిని సరి చేయాలని కోరారు. సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) ప్రశ్నాపత్రంలోనే తప్పులు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యర్థులు ఇచ్చిన ఫిర్యాదులను రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ)కి అధికారులు పంపిస్తారు. అక్కడ ప్రశ్నాపత్రం తయారు చేసిన సబ్జెక్టు నిపుణులు వాటిని పరిశీలిస్తారు. ఆ తర్వాత తప్పుల ను గుర్తిస్తే సవరణ తుది కీని విడుదల చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల డీఎస్సీ ఫలితాల విడుదల ఆలస్యమయ్యే అవకాశమున్నది. జులై 18 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 2,79,957 మంది దరఖాస్తు చేయగా, 2,45,263 (87.61 శాతం) మంది అభ్యర్థులు రాతపరీక్షలకు హాజరయ్యారు. 34,694 (12.39 శాతం) మంది గైర్హాజరయ్యారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

యూపీఐతో మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

- రూ.4 కోట్ల మేర మోసం
- నెల వ్యవధిలోనే 1120 మోసాలు
- నిందితులు రాజస్థాన్‌కి చెందిన వారుగా గుర్తింపు : సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ నరసింహ

నవతెలంగాణ-మియాపూర్



యూపీఐ మోసాలతో డబ్బులు కాజేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.4కోట్ల మోసాలకు పాల్పడ్డ 13 మందిని రిమాండ్‌కు తరలించారు. వీరు రూ. 4 కోట్ల వరకు మోసాలకు పాల్పడినట్టు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ కమిషరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ నరసింహ వెల్లడించారు. సుమారు 20 నుంచి 25 మధ్య వయస్సు గల రాజస్థాన్‌కు చెందిన కొందరు యువకులు ఓ ముఠాగా ఏర్పడి.. హైదరాబాద్‌లోని బజాజ్ షోరూమ్‌లే టార్గెట్‌గా తనిఖీ చేసేవారు. విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసి షోరూమ్ క్యూఆర్ స్కాన్‌ను రాజస్థాన్‌కు చెందిన వారి ముఠాకు పంపేవారు. వారు అక్కడ నుంచి డబ్బును పంపించి రెండు రోజుల తర్వాత రాంగ్ పేమెంట్ అని బ్యాంక్ వారికి చెప్పడంతో వారి డబ్బులు తిరిగి అకౌంట్‌లోకి రిటర్న్ చేసుకునేవారు. ఈ విషయమై సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో కూడా కేసులు నమోదయ్యాయి. బజాజ్ ఎలక్ట్రానిక్స్ సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీఎస్ శంషాబాద్, సీసీఎస్ బాలనగర్, మాదాపూర్, కేపీహెచ్‌బీ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. సోమరాజు, సునిల్, లాక్రామ్, శర్వాణ్, సోమరాజ్, శివలాల్, రమేష్, శ్రావణ్, పప్పురామ్, శ్రవణ్, రాకేష్, రమేష్, అశోక్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.1.72 లక్షల నగదు, రూ.50 లక్షల విలువ గల ఎలక్ట్రానిక్ వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితునితో పాటు ముఠాలోని సభ్యులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రాజస్థాన్‌ను పంపించినట్టు డీసీపీ తెలిపారు. అరెస్ట్ చేసిన 13మంది నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్యాయాన్ని నిలదీసిన సివంగి



వీరనారి అయిలమ్మ.. తెలంగాణలో భూస్వాములు, పటేల్, పట్వారీలకు ధీటుగా నిలబడింది. ఆత్మగౌరవ పోరాట రణ నినాదాన్ని వినిపించింది. దుర్భర బతుకులకు చరమగీతం పాడేందుకు నడుంబిగించింది. దొరలను గడీల నుంచి ఉరికించిన వీరవనిత. తెలంగాన పౌరుషాన్ని, త్యాగాన్ని, పోరాటాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన పోరాట యోధురాలు. ఈ రోజు ఆమె వర్ధంతి సందర్భంగా ఆ స్ఫూర్తిదాయక జీవిత పరిచయం నేటి మానవిలో...

రాయపర్తి మండలం కిష్టాపురం గ్రామంలో ఓరుగంటి మల్లమ్మ సాయిలు దంపతులకు నాలుగో సంతానంగా జన్మించారు అయిలమ్మ. చిట్యాల నరసయ్యను వివాహం చేసుకుని పాలకుర్తి గ్రామానికి కోడలుగా వచ్చారు. సోమయ్య, లచ్చయ్య, ముత్తిలింగం, సోమ నర్సమ్మ, లచ్చి నర్సయ్య, ఉప్పలయ్య అనే ఆరు బిడ్డలు వీరికి. అతి పేద కుటుంబంలో కోడలిగా అడుగు పెట్టిన అయిలమ్మ తమ కులవృత్తి అయిన రజక పని చేసుకుంటూ ఉపాధి పొందేవారు. రజక వృత్తిదారులుతో కూడా ఆనాటి దొరలు వెట్టిచాకిరి చేయించుకునేవారు. ఆ వృత్తితో తగిన ఆదాయమే కాక గౌరవం కూడా లేకపోవడంతో అయిలమ్మ కల్లు వ్యాపారం మొదలు పెట్టారు.



గౌరవంగా బతకాలన్న తపనతో...

కోలుకొండ నుంచి పాలకుర్తి వరకు ఆమె 10 కిలోమీటర్లు కల్లుకుండలు కావడిగా మోసుకొని తెచ్చేవారు. నరసయ్య, సోమయ్యలు ఎడ్లబండిపై తోలు తిత్తితో కలుసరఫరా చేసేవారు. కొంత కాలానికి ఆర్థిక ఇబ్బందులు తొలిగి పోయాయి. ఆ ఆదాయంతో సుమారు 200 గొర్రెలు, మేకలు, నాలుగు నాగండ్ల ఎడ్లు, పాలిచ్చే బర్రెలు కొనుగోలు చేశారు. కల్లు వ్యాపారం అభివృద్ధి చెందడంతో భూస్వాములు ఆటంకాలు సృష్టించారు. గౌరవంగా బతకాలన్న తపన ఉన్న అయిలమ్మ దృష్టి అప్పుడు వ్యవసాయం వైపు మళ్ళింది. పెద్ద కొడుకు సోమయ్య, నడిపి కొడుకు లచ్చయ్య ఎదగడంతో మల్లంపెల్లికి చెందిన ఉత్తంరాజు జయప్రదాదేవి వద్ద నాలుగు ఎకరాల పొలం, 35 ఎకరాల చెలుక కౌలుకు తీసుకున్నారు. భర్త నరసయ్య, ఇద్దరు కొడుకుల సహకారంతో వ్యవసాయం ప్రారంభించారు.

ప్రజలతో మమేకమై

కుటుంబమంతా వ్యవసాయ పనుల్లో మునిగి వెట్టి పనులు, కులవృత్తి మానేశారు. వ్యవసాయం చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. మరో ఇద్దరినీ వ్యవసాయ జీతగాల్లుగా పెట్టుకున్నారు. అయిలమ్మ శ్రమనే పెట్టుబడిగా పెట్టింది. కుటుంబ వ్యవహారాల్లో అన్నీ తానై చక్కదిద్దుకునేవారు. దీంతో కొత్త జీవితం ప్రారంభమైంది. వ్యవసాయ పనులతో ఆర్థికంగా ఎదగడంతో పాటు అయిలమ్మ ప్రజలతో మమేకమై కులవృత్తిదారులకు చేదోడు వాదోడుగా నిలిచేవారు. ఇది భూస్వాములకు, పెత్తందారులకు రుచించలేదు. పాలకుర్తి పోలీస్ పటేల్ వీరమనేని శేషగిరిరావు, విస్నూరు దొరకు ప్రధాన అనుచరుల్లో ఒకడు. పాలకుర్తిని శాసిస్తూ తన ఆధిపత్యాన్ని దేశముఖ్ అండతో నిలబెట్టుకుంటున్నాడు. ప్రజలను పీడించడం, వెట్టిచాకిరి చేయించుకోవడం ఇతనికి నిత్య కృత్యం. అయిలమ్మ కుటుంబాన్ని కూడా లొంగదీసుకోవాలని ప్రయత్నించాడు. ఆ సమయంలో అయిలమ్మతో పాటు పోలీస్ పటేల్ చేత పీడించబడిన జీడి నరసయ్య, జీడి బాలయ్య, వీరమనేని రామచంద్రయ్య, మామిండ్ల కొండయ్య, శేరు సోమనరసయ్యల నాయకత్వంలో పాలకుర్తి గ్రామంలో ఆరుట్ల రాంచంద్రారెడ్డి సమక్షంలో ఆంధ్ర మహాసభ ఏర్పడింది. భువనగిరిలో జరిగిన 11వ ఆంధ్ర మహాసభకు పాలకుర్తి నుండి 15 మంది వెళ్లారు. ఆ మహాసభ నుండి స్ఫూర్తి పొందిన అయిలమ్మ దంపతులు సంఘం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. దాంతో 15 మందితో ప్రారంభమైన సంఘం అతి తక్కువ కాలంలోనే 200 మందికి చేరింది.

ప్రజల్లో విశ్వాసం

ప్రజా చైతన్యవేదికకు వచ్చే ఆరుట్ల రామచంద్రారెడ్డిని విస్నూరు దొర గూండాలు హత్య చేస్తారనే వార్త తెలియడంతో అందరూ అప్రమత్తమయ్యారు. సభలో కళాకారులు పాటలు పడుతున్నారు. కమ్మరి బ్రహ్మయ్య తబలా వాయిస్తున్నాడు. వావిలాల గ్రామం నుండి ఆరుట్ల రామచంద్రారెడ్డిని ఎడ్ల బండిలో సభా వేదిక మీదికి తీసుకువచ్చారు. అంతలోనే గూండాలు దాడులకు పూనుకోవడంతో సంఘం కార్యకర్తలు వారిని తరిమికొట్టారు. దొర మనుషులను కొట్టారనే నెపంతో కమ్మగాని చుక్క సోమయ్య, చిట్యాల నరసయ్య, చిట్యాల సోమయ్యలను పోలీసులు పట్టుకెళ్ళారు. అయిలమ్మ వారిని అడ్డుకుని ఎదిరించారు. దాంతో అయిలమ్మ కొడుకులు సోమయ్య, లచ్చయ్య భర్త నరసయ్యలను కుట్ర కేసులో ఇరికించి జైల్లో పెట్టారు. అయిలమ్మ ఎంతకీ లొంగి రావడం లేదనే కసితో ఆమె పంచ చేను కోసుకురమ్మని విస్నూరు దొర తన గూండాలను పంపుతాడు. ఈ వార్త తెలిసిన సంఘం నాయకులు గుత్పలు చేత పట్టుకొని అయిలమ్మ పంటను రక్షించేందుకు ముందుకు వచ్చారు. దాంతో సంఘ నాయకుల పట్ల ప్రజల్లో విశ్వాసం కలిగింది. పార్టీ ఆదేశాలతో సుమారు 30 మంది పాలకుర్తికి చేరుకున్నారు. ఒకరోజు రాత్రి సుమారు వందమంది గూండాలను విస్నూరు దొర అయిలమ్మ పంట చేనుకు పంపాడు. సూర్యాపేట నుండి వచ్చిన బీమ్ రెడ్డి నరసింహారెడ్డి, నల్లు ప్రతాపరెడ్డి, కాసం కృష్ణమూర్తి, పాలకుర్తి సంఘం కార్యకర్తలు 30 మంది కలిసి గూండాలను ఒక్కసారిగా అడ్డుకున్నారు. తరిమి తరిమికొట్టారు. ఈ సంఘటనతో పాలకుర్తిలో అయిలమ్మ విజేతగా నిలిచింది.

అజ్ఞాత జీవితం

సాయుధ పోరాటం ప్రారంభం కావడంతో అయిలమ్మ కుటుంబంపై కక్ష సాధింపులు పెరిగాయి. కుటుంబమంతా చెల్లాచెదురైంది. లచ్చయ్య, సోమయ్యలు సాయుధ సమరంలో దళ కమాండర్లుగా, ఏరియా కమిటీ నాయకులుగా ఉన్నారు. అయిలమ్మ బిడ్డ సోమనరసమ్మ కొరియర్‌గా సేవలందించింది. అయిలమ్మ అజ్ఞాతంలోకి వెళ్ళింది. 50 ఏండ్ల వయసులో నాయకులతో పోటీపడి పనిచేసింది. రక్షణ కోసం ఆమెకు పార్టీ తుపాకీ ఇచ్చి, ఎలా ఉపయోగించాలో నేర్పించారు. రైఫిల్ వినియోగించే అవసరం అయిలమ్మకు రాకపోవడంతో తిరిగి చకిలం యాదగిరికి అప్పగించారామె. రహస్యం జీవితం గడుపుతున్న అయిలమ్మను పట్టుకోవడానికి గాలిస్తున్న పోలీసులకు బొమ్మెర గ్రామంలో ఉన్నదని తెలియడంతో గ్రామాన్ని నైజాం పోలీసు దిగ్బంధనం చేసి, ఇల్లిల్లు జల్లెడపట్టారు. గొల్లవారి ఇంటిలో తలదాచుకున్న అయిలమ్మ గొల్లవారి లాగా తన వేషాదరణ మార్చుకొని ధూపబుడ్డి తలకెత్తుకొని గొర్ల మంద కాడికి పోతున్న గొల్లలతో పాటు బయలుదేరి వెళ్లి పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంది. ఇలా ఆమె జీవితంలో అనేక సంఘటను జరిగాయి.

స్ఫూర్తిదాయక జీవితం

అయిలమ్మ భర్త నరసయ్య, కుమారులు సోమయ్య, లచ్చయ్యలు నల్లగొండ జైల్లో దేశముఖ్ కుట్రలతో జైలుపాలయ్యారు. వారిని కలిసేందుకు వంద కిలో మీటర్ల దూరంలో ఉన్న నల్లగొండకు అయిలమ్మ కాలినడకనే వెళ్ళింది. పాలకుర్తి నుండి ఆమెతో పాటు కమ్మగాని సత్తెమ్మ, మామిళ్ళ లక్ష్మీదేవమ్మ, జీడి ముత్యాలమ్మ, మచ్చ రాజయ్య, చిట్యాల మల్లమ్మ, జీడి లక్ష్మీనరసమ్మ, మామిళ్ల గట్టు మల్లమ్మ, అంకిరెడ్డి నర్సమ్మ, చిట్యాల లక్ష్మీనరసయ్య నల్లగొండకు కాలినడకన అన్నం సద్ది మూటలు కట్టుకొని వెళ్లేవారు. తెలంగాణ సాయుధ పోరాట విరమణ తర్వాత అయిలమ్మతో పాటు ఆమె కుటుంబం ఊపిరి పీల్చుకుంది. ఇలా చివరి వరకు స్ఫూర్తిదాయక జీవితం గడిపిన అయిలమ్మ తన 90 ఏండ్ల వయసులో 1986లో సెప్టెంబర్ 10వ తేదీన మరణించారు. అంతిమ యాత్రలో కమ్యూనిస్టు పార్టీల అగ్రనాయకత్వం, వివిధ రాజకీయ పార్టీల పాల్గొన్నారు. కామ్రేడ్ ఏ.సి.రెడ్డి నరసింహారెడ్డి అధ్యక్షతన పాలకుర్తిలో అయిలమ్మ సంస్మరణ సభ జరిగింది. అనేక గ్రామాల నుంచి వేలాదిగా పాల్గొన్న ఈ సభలో కామ్రేడ్. భీమిరెడ్డి నరసింహారెడ్డి, నీర్మాల కృష్ణమూర్తి, మోటూరు ఉదయం వంటి వానే ఐలమ్మ పోరాట పటిమను కొనియాడుతూ నివాళులర్పించారు.

- సాంబరాజు యాదగిరి



సంఘం బలోపేతం కోసం

ఆనాడు అయిలమ్మ ఇల్లే కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం. అగ్ర నాయకులు అయిలమ్మ ఇంటికి వచ్చి పోతుండడంతో దొర గూండాలు, పోలీసుల నుండి రక్షించేందుకు అయిలమ్మకు మరింత పకడ్బందీగా రక్షణ కల్పించింది పార్టీ. సంఘం ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు కడవెండి, దేవరుప్పుల కేంద్రాలతో పాటు పాలకుర్తిని కూడా ప్రధాన స్థావరంగా పార్టీ ఎంచుకుంది. తెలంగాణ అగ్రశ్రేని నాయకత్వం అయిలమ్మ ఇంటికి వస్తున్నారనే విషయం విస్నూరు దొరకు కంటగింపయ్యింది. పాలకుర్తికి చకిలం యాదగిరిరావు బాధ్యులుగా ఉండి నడిపించారు. యాదగిరిరావు నేతృత్వంలో జీడి సోమనరసయ్య, చిట్యాల సోమయ్య, అంకిరెడ్డి సోమయ్య, జీడి బాలయ్య, వీరమనేని రామచంద్రయ్య, అయిలమ్మతో కమ్యూనిస్టు పార్టీని నిర్మాణం చేశారు.

కమ్యూనిస్టులకు ఆశ్రయం

సంఘం పెట్టారనే కోపంతో కక్షగట్టిన పోలీసు పటేల్ వీరమనేని శేషగిరిరావు, ఐలమ్మ కుటుంబమంతా వచ్చి తన పొలంలో వెట్టి పనిచేయాలని ఆజ్ఞాపించాడు. అందుకామె నిరాకరించింది. దీంతో ఆగ్రహించిన శేషగిరిరావు, విస్నూరు దొరను కలిసి అయిలమ్మ కమ్యూనిస్టులకు ఆశ్రయం ఇస్తుందని, సంఘం బాగా బలపడిందని, ఇప్పటికే ప్రజలు తన మాట ఖాతార్ చేయడం లేదని అందుకు కారణమైన సంఘాన్ని నామరూపాలు లేకుండా చేయడమే మార్గమని చెప్పాడు. దాంతో విస్నూరు దొర అయిలమ్మ ఇంటి మీదికి గుండాలను పంపించాడు. ఆ గుండాలను అయిలమ్మ కుటుంబమంతా కలిసి తరిమి కొట్టింది. ఆ తర్వాత శివరాత్రి బ్రహ్మోత్సవాలను ప్రజా చైతన్యవేదికగా మార్చుకోవాలని స్థానిక నాయకులు నిర్ణయించుకున్నారు. సంఘం అభివృద్ధికి ఈ సభ దోహదపడుతుందనే లక్ష్యంతో అప్పటి నల్లగొండ జిల్లా నాయకత్వం సభ ఏర్పాటు చేసింది.

కేసు పురోగతిపై నివేదికివ్వండి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేసు దర్యాప్తు పురోగతిపై నివేదికను సెప్టెంబర్ 17లోగా సమర్పించాలని సీబీఐని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ-హాస్పిటల్ ట్రైనీ వైద్యురాలిపై లైంగికదాడి, హత్య కేసుపై సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ కేసు దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును వచ్చే వారం సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. లైంగికదాడి ఘటన జరిగిన సమయం, వివరాలతో పాటు సీసీటీవీ ఫుటేజీని సీబీఐకి ఇచ్చారా లేదా అని ఈ సందర్భంగా సుప్రీం ప్రశ్నించింది. సీబీఐ ఫోరెన్సిక్ నివేదికను అందజేసిన తరువాత కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. "శాంపిల్స్ ఎవరు సేకరించారు" అనేది ఈ కేసులో ముఖ్యమైన ప్రశ్న అని, అందుకే ఎవరు సేకరించారనే విషయం నిర్ధారణైన తరువాత వచ్చే మంగళవారం తాజా రిపోర్ట్ దాఖలు చేయాలని కోరింది.

శరీరంపై గాయాలున్నాయి : సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా

ఘటన తరువాత బాధితురాలి శరీరంపై గాయాలు ఉన్నాయని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పరీక్ష జరిపిన ఫోరెన్సిక్ రిపోర్ట్‌ను ఎయిమ్స్‌కి పంపి పరిశీలించాలని సీబీఐ నిర్ణయించిందని చెప్పారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీని తాము పరిశీలిస్తున్నామని సీబీఐ పేర్కొంది. మరోవైపు సీఐఎస్ఎఫ్ సిబ్బందికి బెంగాల్ ప్రభుత్వం సహకరించడం లేదని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఆర్‌జీ కర్ ఆస్పత్రి వద్ద మూడు మహిళా సీఐఎస్ఎఫ్ కంపెనీలుంటే ఒక కంపెనీకి మాత్రమే వసతులు కల్పించారని ప్రస్తావించింది. కాగా వసతులు కల్పించామని బెంగాల్ ప్రభుత్వం చెప్పింది. మూడు వారాల తరువాత సీఐఎస్ఎఫ్‌కు సదుపాయాలు కల్పించారని కేంద్రం పేర్కొంది. మరోవైపు బెంగాల్‌లో వైద్యుల భద్రతకు తీసుకున్న చర్యలపై బెంగాల్ ప్రభుత్వం స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసింది.

ఉదయం 9.30 గంటలకే గుర్తింపు

తమ వద్ద ఫోరెన్సిక్ నిర్ధారణ రిపోర్ట్ ఉందని, దీని ప్రకారం 9:30 గంటలకు వైద్యురాలి మృతదేహం ఉన్నట్టు వెలుగులోకి వచ్చిందని కోర్టుకు తుషార్ మెహతా వెల్లడించారు. వైద్యురాలి జీన్స్, లో దుస్తులు తొలగించి ఉన్నాయని, అవి సమీపంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇక శరీరంపై గాయం గుర్తులు కూడా ఉన్నాయని తుషార్ మెహతా పేర్కొన్నారు.

దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన కోల్‌కతా ట్రైనీ డాక్టర్ శవపరీక్షకు సంబంధించిన కీలక పత్రం మిస్సైంది. ఈ విషయం తెలుసుకున్న సుప్రీంకోర్టు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై మండిపడింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. శవపరీక్ష కోసం బాధితురాలి మృతదేహంతో పాటు ఆమె దుస్తులు కూడా పంపారా? అని న్యాయవాది ప్రశ్నించారు. దీంతో పోస్టుమార్టం కోసం అవసరమైన కీలక పత్రం గురించి సీజేఐ డివై చంద్రచూడ్ ఆరా తీశారు. పోస్టుమార్టం కోసం మృతదేహంతో పాటు ఏమి పంపారో అన్నది సంబంధిత చలాన్‌లోని కాలమ్‌లో కానిస్టేబుల్ పూరించాల్సి ఉంటుందని తెలిపారు. ఆ పత్రం లేకుండా శవపరీక్ష నిర్వహించలేరని బెంగాల్ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను ఉద్దేశించి అన్నారు.

కాగా, ప్రభుత్వం దాఖలు చేసిన నివేదికలో ఈ చలాన్ గురించి ఎలాంటి ప్రస్తావన లేదని జస్టిస్ జెబి పార్దివాలా అన్నారు. ఒకవేళ అది మిస్ అయితే అలా ఎందుకు జరిగిందో అన్నది రేపటి కల్లా వివరణ ఇవ్వాలని కపిల్ సిబల్‌కు సూచించారు. ఆ చలాన్‌ను కోర్టుకు సమర్పిస్తామని, అయితే కొంత సమయం కావాలని కోర్టును ఆయన అభ్యర్థించారు. మరోవైపు బాధితురాలి మరణం, ఎఫ్ఐఆర్ నమోదు మధ్య 14 గంటలు ఆలస్యం జరిగినట్టు కేసు విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ గుర్తు చేశారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిపై నివేదికను సెప్టెంబర్ 17లోగా సమర్పించాలని సీబీఐకి ధర్మాసనం సూచించింది. అలాగే బాధితురాలి ఫొటోలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఆదేశించింది.

వైద్యుల నిరసనతో రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది మృతి : పశ్చిమబెంగాల్ సర్కార్

కోల్‌కతా ఘటనపై డాక్టర్ల నిరసన వల్ల రాష్ట్రవ్యాప్తంగా 23 మంది రోగులు మృతి చెందినట్టు పశ్చిమ బెంగాల్ సర్కార్ సుప్రీంకోర్టుకు వెల్లడించింది. దీంతో నిరసన చేస్తున్న బెంగాల్ వైద్యులు మంగళవారం సాయంత్రం 5 గంటలలోపు తిరిగి విధుల్లోకి చేరాలని ఆదేశించింది. లేనిపక్షంలో ప్రతికూల చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అల్టిమేటం జారీ చేసింది. మంగళవారం సాయంత్రం 5 గంటలలోపు వైద్యులు విధులకు హాజరైనట్లయితే ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వానికి తాము తెలియజేస్తామని తెలిపింది. డాక్టర్లకు భద్రతా సౌకర్యాలు కల్పించినప్పటికీ విధులకు దూరంగా ఉంటే భవిష్యత్తులో చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించింది. 'వైద్యులు తిరిగి విధుల్లోకి రావాలని మేం కోరుకుంటున్నాం. వారు సేవలందించే వ్యవస్థలో ఉన్నారు. మేం సౌకర్యాలు అందిస్తాం. కానీ వారు ప్రతిస్పందించాల్సి ఉంది. వైద్యులు తిరిగి విధుల్లోకి రాకపోతే ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు తీసుకోకుండా మేం ఆపలేం' అని తెలిపింది.





స్వరం తగ్గించండి
న్యాయవాదికి సీజేఐ మందలింపు

విచారణపై ఓ న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ బిగ్గరగా అరిచాడు. అప్పుడు చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ జోక్యం చేసుకున్నారు. స్వరాన్ని తగ్గించుకోవాలంటూ ఆ న్యాయవాదికి వార్నింగ్ ఇచ్చారు. దీంతో ఆ న్యాయవాది క్షమాపణలు చెప్పారు. వాదనలు జరుగుతున్న సమయంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ.. నిరసన ప్రదర్శనలో ఓ లాయర్ రాళ్లు రువ్వినట్లు తన వద్ద ఫొటోలు, వీడియోలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆ సమయంలో అడ్వకేట్ కౌస్తవ్ భాగ్చి మాట్లాడుతూ.. ఓ సీనియర్ న్యాయవాది కోర్టులో ఎలాంటి వ్యాఖ్యలు చేస్తారని ప్రశ్నించారు. అదే సమయంలో చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ మాట్లాడుతూ.. కోర్టు బయట జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్నారా, గడిచిన రెండు గంటల నుంచి మిమ్మల్ని గమనిస్తున్నానని, గొంతు తగ్గించి మాట్లాడాలంటూ పేర్కొన్నారు. ముగ్గురు జడ్జీల ముందు మీరు మాట్లాడుతున్నారని, మీరేమి జనాలను ఉద్దేశించి మాట్లాడటం లేదని సీజేఐ తెలిపారు. ఈవార్నింగ్‌తో లాయర్ క్షమాపణలు చెప్పారు.

రాజకీయాల్లో గౌరవం, మానవత్వం ఏది?

(మొదటిపేజీ తరువాయి)

మంది ప్రజలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆయన చెప్పారు. గురువు కోరిక మేరకు బొటనవేలిని త్యాగం చేసిన ఏకలవ్యుడిని ఆయన గుర్తు చేశారు. దేశంలో నైపుణ్యానికి కొరత లేదని, కానీ దానికి గౌరవమే కొరవడిందని చెప్పారు. భారతదేశంలో ప్రతి రోజూ లక్షలాది మంది ఏకలవ్యుల కథలు విన్పిస్తాయని తెలిపారు. భారత్ పశ్చిమాన అమెరికా, ఇతర దేశాలు నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నాయని, చైనాలో అది లేదని, అంతర్జాతీయ ఉత్పత్తిలో దాని ఆధిపత్యం కొనసాగుతోందని వివరించారు. భారత్‌లో తయారీ రంగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఉత్పత్తిని పెంచితే ఉపాధి అవకాశాలు అవే పెరుగుతాయని రాహుల్ తెలిపారు.

వరద సహాయం తక్షణమే విడుదల చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తున్న వక్రీకరణలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులు, ప్రజలకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం పిలుపునిచ్చింది. రాష్ట్రంలోని పోరాట కేంద్రాలను కలుపుతూ కళాకారుల బృందం శౌర్యయాత్రను నిర్వహిస్తున్నదని తెలిపింది. ఇండియన్ యూనియన్‌లో తెలంగాణ విలీన దినోత్సవాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఇందుకు సంబంధించి పక్షోత్సవాలు జరుగుతున్నాయనీ, అన్ని జిల్లాల్లో సభలు, సమావేశాలను జరపాలని కోరింది. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సంబంధించి వాస్తవ చరిత్రను కొత్తతరం ముందుకు తేవాలని నిర్ణయించిందని తెలిపింది.

జీఎస్టీ సెస్ పరిహారమివ్వాలి : రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క

రాష్ట్రాలకు జీఎస్టీ సెస్ పరిహారం వాటా ఇవ్వాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన 54వ జీఎస్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో వివిధ అంశాలపై లేవనెత్తారు. ఆరోగ్య బీమా ప్రీమియంలపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. సీనియర్ సిటిజన్ల విషయంలో ఆరోగ్య బీమా ప్రీమియంలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఆరోగ్యబీమా అందరికీ అందుబాటులోకి తీసుకు రావడం ప్రజా ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం, ప్రయివేట్ ఏజెన్సీల నుంచి స్వీకరించే పరిశోధన గ్రాంట్లపై జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని తెలిపారు. అదనపు తాత్కాలిక ఐజీఎస్‌టి విభజన పునరుద్ధరణపై లేవనెత్తారు. మొత్తం కేటాయింపులో 4.02 శాతం తెలంగాణ రాష్ట్రానికి తాత్కాలిక విభజన జరిగిందని (ఆర్థిక సంవత్సరం 2015-16 కోసం ఆదాయాలు), కానీ మరొక ఫార్ములా ఆధారంగా ఇప్పుడు 5.07 శాతం రికవరీ చేయాలని తెలిపారు. ఈ విషయాన్ని పరిశీలించడానికి అధికారుల కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు.

రాజ్యాంగస్ఫూర్తిని నిలబెట్టేలా తీర్పు : హరీశ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టేలా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు. ఎమ్మెల్యేల అనర్హత పిటీషన్లపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు తెలిపారు. ఈ తీర్పు కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక విధానాలకు చెంపపెట్టు అని విమర్శించారు. ఈ తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురికావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఆ తీర్పుకు అనుగుణంగా నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకుని ప్రజాస్వామ్యాని కాపాడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేతన్నలకు రూ.30 కోట్ల రుణమాఫీ

(మొదటిపేజీ తరువాయి)

ఏటా 60 మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తామని చెప్పారు. ఈ ఏడాదికి గానూ తెలుగు యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్నామనీ, వచ్చే ఏడాది నుంచి ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేసే స్కిల్ యూనివర్సిటీలో ఐఐహెచ్‌టీకి సొంత భవనం ఉండేలా చర్యలు తీసుకుంటామని రేవంత్ తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి చిత్తశుద్ధితో పని చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ఈ ఇనిస్టిట్యూట్‌కు పెడుతున్నట్టు ప్రకటించారు. చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నేతన్నలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యల్ని పరిష్కరించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్లో వస్తున్న అనుకరణల బెడద నుంచి కాపాడేందుకు ట్రేడ్ మార్క్ కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ మినరల్ కార్పొరేషన్ చైర్మెన్ ఎరావత్ అనిల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేనేత వర్గానికి చేసిందేమి లేదని విమర్శించారు. వారి హయాంలో రైతులు, చేనేతలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. అధికారం కోల్పోగానే శవరాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చేనేత పొదుపు లబ్దిదారులకు, కుటుంబ పెద్దను కోల్పోయిన నామినీలకు ఈ సందర్భంగా సీఎం చెక్కులను అందించారు. అంతకు ముందు చేనేత అభయహస్తం లోగో వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ విజయలక్ష్మి, నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్‌ది త్యాగమయితే..కొందరిది భోగం

"1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రం వచ్చే వరకూ పదవులను చేపట్టనని ఎమ్మెల్యేగా, మంత్రిగా రాజీనామా చేశారు. చివరి వరకు ఆ మాటకు కట్టుబడి ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో నీలువ నీడ లేని కేసీఆర్‌కు జలదృశ్యం ఇచ్చి అండగా ఉంటే, అదే కేసీఆర్ ఆయనకు నిలువ నీడ లేకుండా చేశారు. తెలంగాణ కోసం పదవిని తృణప్రాయంగా వదిలేసిన బాపూజీది అసలు సిసలైన త్యాగం" అని రేవంత్ అన్నారు. అలాంటిది నేడేమో కొందరు రాజీనామాలు చేయటం, ఎలక్షన్లు తేవటం, కలెక్షన్లు చేసుకోవడం త్యాగమని చెప్పుకుంటున్నారని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఉద్యమం ముసుగులో ఫాం హౌజ్‌లు, బంగ్లాలు సంపాదించుకున్నారని విమర్శలు గుప్పించారు. తెలంగాణ సమాజం ఇదంతా గమనిస్తున్నదని హెచ్చరించారు.

మహిళా శక్తికి ప్రతీక చాకలి ఐలమ్మ : సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణ తొలి భూపోరాటానికి నాంది పలికిన వీరమాత చాకలి ఐలమ్మ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె వర్ధంతి సందర్భంగా ఆయన నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఆమె కనబరిచిన ధైర్య సాహసాలను సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. భూమి కోసం ఆధిపత్య వర్గాల భూఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడి అణగారిన వర్గాలకు మద్దతుగా ఐలమ్మ నిలిచారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాలుపంచుకుని మహిళలను ఐక్యం చేసిన స్ఫూర్తి ప్రదాత అని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధురాలు చాకలి ఐలమ్మ ప్రేరణతో అనేక మంది మహిళలు ఆనాటి భూపోరాటానికి స్వచ్ఛంధంగా ముందుకొచ్చారని పేర్కొన్నారు. ఆమె బహుజన చైతన్యానికి, మహిళా శక్తికి ప్రతీక అని రేవంత్‌రెడ్డి ఆమె సేవలను కొనియాడారు.

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మెన్‌గా గాంధీ

(మొదటిపేజీ తరువాయి)

సాంబశివరావు,

ఎమ్మెల్సీలు: టి.జీవన్‌రెడ్డి, టి.భానుప్రసాదరావు, ఎల్.రమణ, సత్యవతి రాథోడ్

ఎస్టిమేట్స్ కమిటీ చైర్మెన్‌గా నల్లమద పద్మావతిరెడ్డి

ఎమెల్యేలు: వాకిటి సునితా లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాగంటి గోపినాథ్, సిహెచ్ విజయరామారావు, కోరం కనకయ్య, రాందాస్ మాలోతు, మామిడాల యశస్విని, పి.రాకేష్‌రెడ్డి.

ఎమ్మెల్సీలు: ఎం.ఎస్ ప్రభాకర్‌రావు, సుంకరి రాజు, టి.రవీందర్‌రావు, వి.యాదవరెడ్డి

ప్రజాపద్దుల సంఘం చైర్మెన్ : కె. శంకరయ్య

సభ్యులుగా ఎమ్మెల్యేలు: పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి

కేపీ వివేకానంద్, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, పట్లోళ్ల సంజీవరెడ్డి, తోట లక్ష్మీకాంతారావు, కౌసర్ మోహియుద్దీన్

ఎమ్మెల్సీలు: పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శేరిసుభాష్‌రెడ్డి, తాట మధుసూదన్, మిర్జా రియాజుల్ హసన్ ఎఫెన్డి

ఫిరాయింపు ఎమ్మెల్యేకు పీఏసీ చైర్మెన్ పదవి సిగ్గుచేటు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేకు పీఏసీ చైర్మెన్ పదవిని కట్టబెట్టడం సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు విమర్శించారు. పార్టీ మారని ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు తీర్పు వచ్చిన రోజే ఇదేం దుర్మార్గమని సోమవారం ఆయన ట్వీట్ చేశారు. ప్రధాన ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన పీఏసీ చైర్మెన్ హోదాను, పార్టీ మారిన ఎమ్మెల్యేకు కట్టబెట్టడం ఎక్కడి సంస్కృతి అని ప్రశ్నించారు. గీత దాటిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని పూర్తి కాలరాస్తోందని తెలిపారు.



ఆటలు

23 ఏండ్ల ఇటలీ కుర్రాడు న్యూయార్క్‌లో సంచలన విజయం సాధించాడు. ఈ ఏడాది మార్చిలో నిషేధిత ఉత్ప్రేరకం వాడకంలో పాజిటివ్‌గా తేలి నిషేధం నీడ నుంచి తప్పించుకున్న వరల్డ్ నం.1 స్టార్ ఆటగాడు.. సీజన్‌ను ఊహించని రీతిలో అద్భుతంగా ముగించాడు. అంచనాలు లేకుండా బరిలోకి దిగి.. మెన్స్ సింగిల్స్ చాంపియన్‌గా అవతరించాడు. అతడే టాప్ సీడ్, ఇటాలియన్ జానిక్ సినర్. వరుస సెట్లలో టైటిల్ పోరులో విజయం సాధించిన జానిక్ సినర్.. లోకల్ హీరో టేలర్ ఫ్రిట్జ్ ఆశలను ఆవిరి చేశాడు. సుమారు రెండు దశాబ్దాల అనంతరం మెన్స్ సింగిల్స్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో ఇద్దరు కుర్రాళ్లు పోటీపడటం టెన్నిస్ ఓపెన్ శకంలో మరో విశేషం. యు.ఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచిన జానిక్ సినర్ కెరీర్ రెండో గ్రాండ్‌స్లామ్ విజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు.

సూపర్ సినర్



- మెన్స్ సింగిల్స్ టైటిల్ వశం
- ఫైనల్లో ఫ్రిట్జ్‌పై ఘన విజయం

యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

నవతెలంగాణ-న్యూయార్క్

వరల్డ్ నం.1, టాప్ సీడ్ జానిక్ సినర్ (ఇటలీ) యు.ఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ విజేతగా నిలిచాడు. ఆదివారం న్యూయార్క్‌లోని ప్రధాన స్టేడియంలో జరిగిన టైటిల్ పోరులో 12వ సీడ్ అమెరికా కుర్రాడు టేలర్ ఫ్రిట్జ్‌పై జానిక్ సినర్ విజయం సాధించాడు. 6-3, 6-4, 7-5తో వరుస సెట్లలో అదరగొట్టిన జానిక్ సినర్.. కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ విజయం నమోదు చేశాడు. టాప్ సీడ్‌గా బరిలో నిలిచినా..టైటిల్ రేసులో పెద్దగా అంచనాలు లేని జానిక్ సికర్ రెండు వారాల అత్యుత్తమ ప్రదర్శన అనంతరం న్యూయార్క్ నయా కింగ్‌గా అవతరించాడు. సుమారు రెండున్నర గంటల పాటు ఉత్కంఠగా సాగిన తుది సమరంలో లోకల్ హీరో టేలర్ ఫ్రిట్జ్ సైతం ఆకట్టుకున్నాడు. కానీ వరల్డ్ నం.1 జానిక్ సినర్ చాంపియన్ గేమ్ ముంగిట తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనలిస్ట్ టేలర్ ఫ్రిట్జ్ తలవంచక తప్పలేదు. యు.ఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ చాంపియన్‌గా అర్యాన సబలెంక (బెలారస్) నిలిచిన సంగతి తెలిసిందే.

సినర్ అదరగొట్టాడు

136 నిమిషాల మెన్స్ సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్, ఇటలీ స్టార్ జానిక్ సినర్ అదరగొట్టాడు. లోకల్ అభిమానుల మద్దతు ప్రత్యర్థి టేలర్ ఫ్రిట్జ్‌కు లభించినా.. సొగసైన ఆటతీరుతో అభిమానుల మద్దతు కూడగట్టుకున్నాడు. 6-3, 6-4, 7-5తో వరుస సెట్లలో టేలర్‌ను చిత్తు చేశాడు. టేలర్ ఫ్రిట్జ్ 10 ఏస్‌లు సంధించగా.. సినర్ ఆరు ఏస్‌లు మాత్రమే కొట్టాడు. కానీ తొలి సర్వ్‌లోనే 88 శాతం పాయింట్లను సొంతం చేసుకున్న జానిక్ సినర్ విజయం దిశగా అడుగులు వేశాడు.



టేలర్ తొలి సర్వ్‌లో 66 శాతం పాయింట్లను మాత్రమే సాధించగలిగాడు. జానిక్ సినర్ ఆరు బ్రేక్ పాయింట్లు సాధించి మెప్పించాడు. టేలర్ రెండు సార్లు మాత్రమే సినర్ సర్వ్‌ను బ్రేక్ చేయగలిగాడు. విన్నర్ల పరంగా సైతం సినర్‌పై టేలర్ ఫ్రిట్జ్ పైచేయి సాధించాడు. టేలర్ 29 విన్నర్లు సాధించగా.. సినర్ 23 విన్నర్లు మాత్రమే కొట్టాడు. పాయింట్ల పరంగా 96-79తో టేలర్‌పై సినర్ ఆధిపత్యం చెలాయించాడు. నెట్ గేమ్‌లోనూ సినర్‌పై టేలర్ పైచేయి సాధించాడు. తొలి రెండు సెట్లలో అలవోక విజయాలు సాధించిన జానిక్ సినర్‌కు మూడో సెట్‌లో కాస్త ప్రతిఘటన ఎదురైంది. 5-5తో స్కోరు సమం కావటంతో వరుసగా రెండు గేమ్ పాయింట్లు గెల్చుకుని టైటిల్‌కు చేరువయ్యాడు. యు.ఎస్ ఓపెన్‌లో జానిక్ సినర్‌కు ఇదే తొలి టైటిల్ కావటం విశేషం.

యువ పోరు

టెన్నిస్ ఓపెన్ శకంలో 2024 యువ శకానికి నాంది పలికింది. 1974, 1993 తర్వాత తొలిసారి ఓ క్యాలెండర్ ఏడాది నాలుగు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో యువ ఆటగాళ్లే (23 ఏండ్లు, అంత కంటే తక్కువ వయసు) విజేతలుగా నిలిచారు. స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాస్ ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ విజేతగా నిలువగా.. జానిక్ సినర్ ఆస్ట్రేలియా ఓపెన్, యు.ఎస్ ఓపెన్ చాంపియన్‌గా అవతరించాడు. యు.ఎస్ ఓపెన్ చరిత్రలో తొలిసారి ఓ ఇటలీ ఆటగాడు సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఫైనల్లో తొలి రెండు సెట్లలో తొలి సర్వ్‌లో సినర్ ఒక్క పాయింట్‌ను సైతం కోల్పోలేదు. 28/28 పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు.ఇక అమెరికా అభిమానులకు మరోసారి చేదు ఫలితమే ఎదురైంది. 21 ఏండ్లుగా ఓ గ్రాండ్‌స్లామ్ విజయం కోసం ఎదురుచూస్తున్న అమెరికా.. ఆదివారం ఆ టైటల్‌కు అడుగు దూరంలో ఆగిపోయింది. టేలర్ ఫ్రిట్జ్ ఫైనల్లో ఉత్తమ ప్రదర్శన చేశాడు. జానిక్ సినర్ సూపర్‌గా రాణించినా.. అతడికి దీటుగా బదులిచ్చాడు. ఆరంభంలో టేలర్‌కు అధికంగా అభిమానులు మద్దతు పలికినా నెమ్మదిగా సినర్ స్టేడియాన్ని సొంతం చేసుకున్నాడు. యు.ఎస్ ఓపెన్ రన్నరప్‌గా నిలిచిన టేలర్ ఫ్రిట్జ్.. టైటిల్ దూరమైనా 2024 ఏడాదిని ఘనంగా ముగించాడు. ఆండ్రీ ఆగస్సీ తర్వాత ఓ ఏడాది గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్లలో 17 విజయాలు సాధించిన తొలి అమెరికన్‌గా నిలిచాడు.

2వ పాట రిలీజ్‌కి రెడీ

రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాలో కియారా అద్వాని హీరోయిన్‌గా నటిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా సినిమాను తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నారు.

ఇప్పటికే రిలీజైన పోస్టర్స్, 'జరగండి..' సాంగ్, వస్తోన్న అప్డేట్లతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో వినాయక చవితి సందర్భంగా ఈ మూవీ నుంచి మరో క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ నెలలో సినిమా నుంచి మరో సాంగ్‌కి సంబంధించిన అప్డేట్ ఇవ్వబోతున్నట్లు మేకర్స్ తెలియజేశారు.



రామ్‌చరణ్

నవచిత్రం

భావోద్వేగాలను ఆవిష్కరించే కాంత

రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా, దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిల్మ్స్ కలయికలో రూపొందనున్న బహు భాషా చిత్రం 'కాంత'.
ఈ సినిమా రామానాయుడు స్టూడియోస్‌లో పూజాకార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైంది. హీరో వెంకటేష్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్‌కు జోడిగా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నారు. సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ కూడా ప్రారంభం కావడం విశేషం. 1950 మద్రాస్ బ్యాక్‌డ్రాప్‌లో హ్యూమన్ రిలేషన్స్, సోషల్ ఛేంజెస్‌ని ఎక్స్‌ప్లోర్ చేసే గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌గా ఈ సినిమా ఉండనుంది. రానా దగ్గుబాటి మాట్లాడుతూ, 'వేఫేరర్ ఫిల్మ్స్‌తో భాగస్వామ్యం కావడం ఈ ప్రాజెక్ట్‌కి కొత్త డైమెన్షన్‌ని యాడ్ చేసింది. సురేశ్ ప్రొడక్షన్స్ 60వ యానివర్సరీని పురస్కరించుకుని, స్పిరిట్ మీడియాతో కొత్త శకానికి నాంది పలికేందుకు పర్ఫెక్ట్ మూవీ 'కాంత" అని అన్నారు. 'స్పిరిట్ మీడియాతో జర్నీ ప్రారంభించడం పట్ల ఉత్సాహంగా ఉన్నాను. ఇది మానవ భావోద్వేగాల లోతులను ఆవిష్కరించే అందమైన లేయర్డ్ కథ. ఒక నటుడికి పెర్ఫార్మెన్స్ చేయడానికి చాలా స్కోప్ ఇస్తుంది' అని హీరో దుల్కర్ సల్మాన్ చెప్పారు. డైరెక్టర్ సెల్వమణి సెల్వరాజ్ మాట్లాడుతూ,'ఈ సినిమాతో మేం ప్రేక్షకులను గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలని లక్ష్యంగా పని చేస్తున్నాం' అని తెలిపారు. ఈ చిత్రం తెలుగు, మలయాళం, తమిళం, కన్నడ భాషలలో విడుదల కానుంది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886